# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 117 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA






### ఆయుధాలకు సానబడుతున్న భారత్

అరేబియా సముద్రంలో సీ స్కిమ్మింగ్ టెస్ట్ సక్సెస్

2

### వెతికి వెతికి వేటాడ్తం

## కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం..

- ఉగ్రవాదులకు, వారి వెనుకనున్న శక్తులకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్
- ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేస్తం



2



## రాష్ట్రపతితో అమిత్ షా భేటీ

ఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్ర ఘటన నేపథ్యంలో భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. రాజకీయ, దౌత్య పరమైన కార్యకలాపాలు ఒక పక్క జరుపుతూనే ఇరు దేశాలూ సైనిక తయారీలు చేసుకుంటున్నట్టు వార్తలు పొక్కుతున్నాయి. చోటుచేసుకుంటున్న ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. కావడం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్ర దాడి ఘటనకు సంబంధించి పలు అంశాలను ఆమెకు

...మిగతా 2లో

# కలిసి రండి.. కఠిన చర్యలు తీసుకుందాం

## అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వ హామీ

- ఏ చర్యలు తీసుకున్నా మద్దతిస్తామన్న కాంగ్రెస్
- ఉగ్రదాడిపై ఆల్ పార్టీ మీటింగ్‌లో మృతులకు సంతాపంగా మౌనం పాటించిన నాయకులు





ఢిల్లీ, ఏప్రిల్ 24: ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. "జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా

...మిగతా 2లో

### నిఘా నీడలో తెలంగాణ..

# నేటి నుంచి భారత్ సమ్మిట్

### శిఖరాగ్రంలో పాల్గొనున్న రాహుల్ సహా 100 దేశాలకు చెందిన 400 మంది ప్రతినిధులు

- వచ్చే నెలలో మిస్ వరల్డ్ ఈవెంట్స్
- ప్రపంచ స్థాయి కార్యక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం




హైదరాబాద్, ఏప్రిల్ 24, మనం బ్యూరో: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తెలంగాణలో దాడులు జరిగే అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాలు చేసిన హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాజధాని హైదరాబాద్ నగరంలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెండు రోజుల

...మిగతా 2లో

### తెలంగాణను ప్రపంచానికి రోల్ మోడల్‌గా చూపడానికే..

ఏర్పాట్లు పరిశీలించిన మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్

2

# అది పాక్‌కు మరణ శాసనమే

### సింధూ నదీజలాల ఒప్పందం రద్దుతో పాక్ కూసాలు కదులుతున్నాయ్

- ఆదేశంలో సాగుకు వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం పరిధిలోనివే..
- దాని జీడీపీలో 25 శాతం ఈ నదీ జలాలే కంట్రిబ్యూట్ చేస్తాయి




2

### ఉగ్రవాదులు తప్పుదారి పట్టిచ్చిండ్రు?

దాడిలో మరణించిన కావలి వాసి మధుసూదన్ భార్య

'ప్లీజ్ నన్ను చంపొద్దు' అని వేడుకున్నా వదల్లేదు

భయానక ఘటనను వివరించిన భరత్ భూషణ్ భార్య

2

## అసోంలో ఎమ్మెల్యే అరెస్ట్

### పాకిస్తాన్‌ను సమర్థిస్తూ వీడియో

హైదరాబాద్, మనం ప్రతినిధి: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనలో పాకిస్థాన్‌ను సమర్థిస్తూ, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఏఐయూడీఎఫ్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాంను అసోం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆయనపై దేశద్రోహం అభియోగాలు మోపారు. ఈ అరెస్టుకు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆదేశించారు. గౌహతిలో ఏర్పాటు చేసిన

...మిగతా 2లో

### రజతోత్సవ సభ నేపథ్యంలో ఉద్యమ పార్టీకి షాక్..

# పాలకుర్తిలో బీఆర్ఎస్ ఖాళీ



### కాంగ్రెస్‌లో చేరడానికి క్యూ కడుతున్న నేతలు

- గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సమక్షంలో భారీగా చేరికలు
- ఎమ్మెల్యే యశస్విని నేతృత్వంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న డా. పానుగోటి
- అత్తాకోడళ్లను తక్కువ అంచనా వేసిన ఎర్రబెల్లి నిర్వాకం వల్లే వలసలు

మనం బ్యూరో, ఏప్రిల్ 24, హైదరాబాద్ : పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకరరావు గతంలో ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. రెండు రోజుల్లో ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ జరుగనుండగా, ఇదే సమయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి క్యూ కడుతున్నారు. అందులో భాగంగా గురువారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జి ఝాన్సీ

...మిగతా 2లో



## భగ్గుమంటున్న ఎండలు

- 2-5 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న వడగాల్పుల మరణాలు
- శుక్ర, శనివారాల్లో వర్షం పడొచ్చు

హైదరాబాద్, మనం ప్రతినిధి: భానుడి భగ భగలతో తెలంగాణలో భగ్గుమంటొంది. మండే ఎండలతో ప్రజల్ని తీవ్రంగా ఉక్కిరి బిక్కిరి చెస్తున్న వడగాల్పులు.. దీంతో ఎటు పాలుపొని పరిస్థితి.. ఇక, రాబోయే 2 రోజులు కూడా తెలంగాణలో భారీ స్థాయిలోనే ఎండల తీవ్రత అధికం కానుందని, సాధారణం కన్నా 2 నుంచి 5 డిగ్రీలు వరకు గరిష్ఠ అత్యంత గరిష్టంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత గణనీయంగా అధికమవుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ

...మిగతా 2లో

## కాళేశ్వరంలో లోపాలు

వెలుగులోకి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్

2

## 100 పర్సెంట్ హాజరు

అక్కాచెల్లెళ్ల ఆదర్శ చదువులు ● మాన్‌సింగ్ తండా ప్రైమరీ స్కూల్ విద్యార్థులు రితిక, పార్వతికి టీచర్ల సన్మానం ● 'మనం' దినపత్రిక అభినందనలు





హైదరాబాద్, మనం ప్రతినిధి: ఎదో ఒక సాకు జెప్పి పాఠశాలకు డుమ్మా కొట్టేందుకు విద్యార్థులు తంటాలు పడుతుండడం సర్వసాధారమైన ఈ రోజుల్లో... జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఈ విద్యా సంవత్సరం మొత్తం ఒక్క రోజు కూడా బడికి గైర్హాజరు కాకుండా వంద శాతం హాజరు నమోదు చేసి, యావత్ విద్యార్థి లోకానికి ఆదర్శంగా నిలిచారు. వారి నిబద్ధత, క్రమశిక్షణను గుర్తించిన ఉపాధ్యాయులు వారిని ప్రత్యేకంగా సన్మానించారు. జనగామ జిల్లా మాన్ సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న రితిక, 4వ తరగతి చదువుతున్న పార్వతి అనే

...మిగతా 2లో

# భారీ వే(డు)దికకు సర్వం సిద్ధం

- సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తికి కళ
- 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పు స్టేజ్
- సకల హంగులతో సిద్ధమవుతున్న రజతోత్సవ వేదిక
- 27న హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీ ఏర్పాట్లు



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ఉద్యమాల ఖిల్లా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీ(టీ)ఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉద్యమ పార్టీగా భారీ బహిరంగ సభల నిర్వహణలో రికార్డులున్న టీఆర్ఎస్.. ఎల్కతుర్తి సభను అదే స్థాయిలో నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ భారీ ఎత్తున సమాయత్తమవుతున్నది. లక్షలాది మంది ప్రజలు, తెలంగాణవాదులు, బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు హాజరయ్యే.. ఈ రజతోత్సవ మహాసభ వేదిక నిర్మాణంతో పాటు అన్ని ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తి అయ్యిందని సమాచారం. అయితే,

...మిగతా 2లో

# కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం..



**పాట్నా, ఏప్రిల్ 24 :** ఉగ్రవాది ఏ మూలన, ఏ తొర్రలో దాక్కున్నా వెతికి వేటాడి ఊహించని విధంగా శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోడీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం 'ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు, భారతీయాత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం' అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు'' అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు.

**ప్రపంచ దేశాలకు ధన్యవాదాలు..**

ఈసందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియపరుస్తూ 'మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదు' అని అన్నారు.

**ఇండియా విల్ పనిష్..**

'ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' (ప్రతి ఒక్క ఉగ్రవాదిని, వారికి మద్దతుగా నిలిచేవారిని భారత్ గుర్తించి, వెంటాడి, శిక్షిస్తుంది) అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. 'ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం.

# అది పాక్‌కు మరణ శాసనమే

**ఢిల్లీ, ఏప్రిల్ 24:** సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు దాయాది దేశంతో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారత్ చేసిన ప్రకటన పాకిస్తాన్‌కు మరణ శాసనమే. దీనితో ఏం చేయాలో దిక్కుతోచని పాక్ అక్కసు వెళ్లగక్కింది. 'సింధూ నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధం. ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు మధ్యవర్తిగా ఉన్న ఈ ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగే అవకాశం లేదు. ఈ చర్యతో నీటి యుద్ధానికి తెరతీస్తున్నారు. ఈ జలాల్లో ప్రతి నీటి చుక్కా మాదే..! ఈ హక్కును మేం చట్టపరంగా, రాజకీయంగా, అంతర్జాతీయంగా పూర్తిశక్తితో కాపాడుకుంటాం'' అని పాకిస్థాన్ మంత్రి అవాయిస్ లెఘారీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకున్నాడు. అయితే ఏ దేశంతో కుదుర్చుకున్న ఒప్పందాన్నైనా రద్దుచేసుకునే హక్కు భారత్ కు ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒప్పందంపై భారత్ సంతకం చేయనందున పాక్ అంతర్జాతీయ కోర్టుకు పోయినా అదిచ్చే తీర్పు భారత్ కు వర్తించదు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. వ్యవసాయానికి వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం కింద లభిస్తున్నవే కావడం గమనార్హం. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశానికి మరణ శాసనం కాకుండా ఎలా ఉంటుంది.

**షెహబాజ్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి సమావేశం..**

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న దౌత్య చర్యలపై పాక్ స్పందించింది. ఈ అంశంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో సమావేశమైన ఆ దేశ అత్యున్నత కమిటీ పలు అంశాలను చర్చించింది. మంత్రులు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు భారత్ తీసుకున్న చర్యలనే దాదాపు ఆ దేశం కాపీ కొట్టింది.సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా తమ దేశంలో పర్యటిస్తున్న భారత జాతీయులకు అనుమతులతో పాటు, ఇతర వీసాలను సైతం పాక్ రద్దు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో నిన్న జరిగిన అత్యున్నత సమావేశంలో భారత్ సైతం ఇదే నిర్ణయం తీసుకుంది. పాక్లోని హైకమిషన్ కార్యాలయంలోని భారత దౌత్య సిబ్బందిని 30కి తగ్గించింది. అంతకుముందు భారత్ కూడా ఇదే చర్యలను ప్రకటించింది. నిన్నటి సమావేశంలో అటారీ బోర్డర్ను మూసివేయాలని భారత్ నిర్ణయించగా.. పాకిస్థాన్ సైతం వాఘా బోర్డర్ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు పాక్ గగనతలంంలోకి భారత్ కు చెందిన విమానాలు గానీ, భారతీయ సంస్థలు నడుపుతున్న విమానాలు గానీ ప్రయాణించకుండా ఎయిర్స్పేస్ను మూసివేసింది. సౌదీ పర్యటన ముగించుకున్న అనంతరం ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించింది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. భారత్ తో వాణిజ్యాన్ని తెగదెంపులు చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని అమలును భారత్ తక్షణమే నిలిపివేయడాన్ని పాక్ ఖండించింది. 24 కోట్ల పాకిస్థాన్ పౌరులకు సంబంధించిన అంశంగా పేర్కొంది. సింధు జల ఒప్పందం ప్రకారం పాకిసాన్ కు ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి లేదా ఆపడానికి జరిగే ప్రయత్నాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పేర్కొంది.

# రాష్ట్రపతితో అమిత్ షా భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వివరించినట్లు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.

**కీలక దేశాలతో భేటీ..**

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా, కెనడాతో సహా జీ 20 దేశాల ఎంపిక చేసిన రాయబారులతో సమావేశం నిర్వహించింది.

# కాళేశ్వరంలో లోపాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 24:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ వెలుగులోకి వచ్చింది. సుదీర్ఘ సమావేశాల అనంతరం రూపొందించిన 378 పేజీల రిపోర్టు వైరల్ అవుతోంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో లోపాలను గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే నిర్మాణ లోపాలు కూడా స్పష్టంగా ఉన్నాయని ఆ రిపోర్ట్లో పేర్కొన్నట్లు సమాచారం. వెంటనే సరిచేయాల్సిన అవసరంపైన కూడా ఈ రిపోర్ట్‌లో ప్రస్తావించారు. మొత్తం 36 అత్యంత కీలకమైన సమావేశాల తర్వాత ఈ రిపోర్ట్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు రిపోర్టు త్వరగా ఇవ్వాలని ప్రభుత్వం తరపున నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కానీ, కేంద్రం మాత్రం ఆ రిపోర్టును ఇంకా ఇవ్వకపోవడంపై పలు రకాల ఆరోపణలు వినిపించాయి.



# కఠిన చర్యలు తీసుకుంటం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు'' అని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించాం. కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చాం.

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

కశ్మీర్లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాం.

**- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు**

ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నాం. ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశాం.

# ఆయుధాలకు సానబడుతున్న భారత్

**బెంగళూరు, ఏప్రిల్ 24:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. భారత సైన్యం దేనికైనా సై అంటూ సంసిద్ధంగా ఉంది. దీనిలో భాగంగానే నేడు నౌకదళం సీ స్కిమింగ్ సక్సెస్‌ఫుల్‌గా టెస్ట్ చేసింది. గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ గగనతలంలో కదులుతున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీస్కిమ్మింగ్ టార్గెట్లుగా పేర్కొంటారు. ఐఎన్ఎస్ సూరత్, వివిధ రకాల మిలటరీ ప్లాట్ ఫామ్‌లతో కలిసి



లక్ష్యాన్ని ట్రాక్ చేస్తూ ధ్వంసం చేసింది. టార్గెట్‌పైకి మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్-ఎస్ఏఎం) ను వినియోగించారు.

**పాక్ క్షిపణి పరీక్షలకు సిద్ధమైన వేళే..**

ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో 24, 25 తేదీల్లో ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలు నిర్వహిస్తామంటూ పాక్ మిలటరీ నోటమ్ విడుదల చేసింది. ఇదే సమయంలో ఐఎన్ఎస్ సూరత్ సీస్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించడం గమనార్హం.

**కర్వార్లో విక్రాంత్..**

విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ అరేబియా సముద్రంలో కర్ణాటకలోని కార్వార్ పోర్టు సమీపంలో ఇది గస్తీ కాస్తోంది. కాకపోతే కొన్ని వారాల ముందే అనుకొన్న ప్రణాళిక ప్రకారమే దీని మోహరింపు జరిగిందని చెబుతున్నా.. పహల్గాం దాడి వేళ ఈ సమాచారం బయటకు రావడం గమనార్హం.

# నేటి నుంచి భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

భారత్ సమ్మిట్ నేడు ప్రారంభం కానుంది. మే 7 నుంచి మిస్ వరల్డ్-2025 ఈవెంట్లు ఉండ టంతో పోలీసు వర్గాలు పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ సమ్మిట్‌లో జాతీయ, అంతర్జా తీయ, రాజకీయ, ఆర్థిక పరమైన అంశాలపై చర్చ జరుగనుంది. ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలున్నాయి. అదే విధంగా మే 7 నుంచి ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ 31వ తేదీ వరకూ కొనసాగనుంది. ఈ పోటీ లకు 140 దేశాల నుంచి కంటెస్టెంట్స్ హాజరవు తారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలు కావడంతో భద్రతా ఏర్పాట్లు చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటన లకు తావు లేకుండా ముందస్తు కార్యాచరణను రూపొందిస్తున్నారు.

అందులో భాగంగా హెచ్ఐసీసీతో పాటు శంషా బాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సైబరాబాద్ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేస్తు న్నారు. మరోవైపు, హైదరాబాద్ సహా దేశంలోని ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఐబీ హెచ్చరికలు జారీ చేసిన నేప థ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకంగా మాని టర్ చేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి శాంతికుమారి, డీజీపీ రాష్ట్ర పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కౌంటర్ ఇంటె లిజెన్స్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అనుమాని తులు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట నిఘా వ్యవ స్థను ఏర్పాటు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరి సర ప్రాంతాలను గురువారం నుంచే తమ అధీ నంలోకి తీసుకున్నారు. హైటెక్ సిటీ సహా విదేశీ యులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్థానిక పోలీ సులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ సహా అనుమానిత ప్రాంతాల్లో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.

# ఉగ్రవాదులు తప్పుదారి పట్టిచ్చిండ్రు?

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పర్యాటక స్వర్గధామం కశ్మీర్‌లో.. ఇటీవల జరిగిన ఉగ్రదాడి తీవ్ర విషాదాన్ని నింపింది. పహల్గాంలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో కావలికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఆయనతోనే ఉన్న భార్య, ఆ భయానక క్షణాలను, ఉగ్రవాదుల క్రూరత్వాన్ని కన్నీటిపర్యంతమవుతూ వివరించారు. కశ్మీర్ సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతోనే తాము విహారయాత్రకు వెళ్లామని, కానీ ఇంతటి దారుణం జరుగుతుందని ఊహించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మధుసూదన్ భార్య తెలిపిన వివరాల ప్రకారం... తమ మూడు కుటుంబాలకు చెందిన పది మంది పహల్గాం విహారయాత్రకు వెళ్లారు. స్థానికంగా 'మినీ స్విట్జర్లాండ్'గా పిలిచే ప్రాంతానికి గుర్రాలపై వెళ్లి, భోజనం చేశారు. మధుసూదన్, ఆయన భార్య ఇద్దరూ భోజనం ముగించుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే కాల్పుల శబ్దాలు వినిపించాయి. భయంతో వారు పరుగులు తీస్తుండగా, శాలువాలు అమ్మే కొందరు స్థానికులు వారిని అడ్డుకొని, అవి కేవలం కశ్మీరీ వార్షికోత్సవ వేడుకల శబ్దాలని, భయపడాల్సిన పనిలేదని చెప్పి తప్పుదోవ పట్టించినట్లు ఆమె తెలిపారు. 'మేము పరిగెడుతుంటే వాళ్ళు మమ్మల్ని మిస్‌గైడ్ చేస్తూ.. అది కేవలం వేడుకలని, ఇక్కడే ఉండండి అన్నారు' అని ఆమె పేర్కొన్నారు. అయితే, అక్కడే ఉన్న ఒక హోటల్ యజమాని మాత్రం ప్రమాదాన్ని పసిగట్టి.. తమ పిల్లలను, ఇతరులను వెంటనే పారిపోవాలని హెచ్చరించినట్లు చెప్పారు. హోటల్ యజమాని హెచ్చరికతో పిల్లలు, కొందరు ముందుగానే పారిపోయారని, కానీ తాము పారిపోయేలోపే ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ దగ్గరకు వచ్చారని మధుసూదన్ భార్య వివరించారు.

# 100 పర్సెంట్ హాజరు

(మొదటి పేజీ తరువాయి)

అక్కాచెల్లెళ్లు ఉన్నారు. గత విద్యా సంవత్సరం (జూన్ 12 నుండి విద్యా సంవత్సరం ముగిసే వరకు) ఒక్కటంటే ఒక్క రోజు కూడా వారు పాఠశాలకు సెలవు పెట్టలేదు. ప్రతిరోజూ వారు క్రమం తప్పకుండా బడికి హాజరయ్యారు. వీరిద్దరూ వంద శాతం హాజరు నమోదు చేయడమే కాకుండా, పరీక్షల్లోనూ మంచి మార్కులు సాధిస్తూ చదువులోనూ రాణించడం కూడా ఓ రికార్డుగా చెప్తున్నారు అక్కడి టీచర్లు. అయితే, అ విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణను గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు... వారిరువురిని అభినందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో రితిక, పార్వతిలను శాలువాలతో సత్కరించి, వారిని అభినందనలతో ముంచెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం కొన్నిసార్లు తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో, ఈ అక్కాచెల్లెళ్లు వంద శాతం హాజరుతో అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అక్కడి ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# పాలకుర్తిలో బీఆర్ఎస్ ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వంలో పనిచేయడానికి తొర్రూరు అభివృద్ధి కమిటీ చైర్మన్, నియోజకవర్గ ముఖ్యనేత డా.పొను గోటి సోమేశ్వరరావు నేతృత్వంలో సుమారు 500 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పు కున్నారు. వారికి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేతలలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేశ్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపీపీ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీలు సోమ్మనాయక్, సోషల్ మీడియా కన్వీనర్ జాటోత్ సురేష్ నాయక్, రాజేందర్, భోజ్యా తదిత రులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. అందరం కలసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని ఆశా భావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ మాట్లాడుతూ మా అత్తాకోడళ్లను తక్కువ అంచనా వేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంకా ఏదో ఆశతో ఉన్నారనీ, వారు ఆశలు వదులుకుంటే మంచిదని హెచ్చ రించారు. ఈ చేరికలు ఇంకా కొనసాగుతాయనీ, ఇంకా చాలా మంది పార్టీలో చేరతారని తెలిపారు.

**బీఆర్ఎస్ పనితీరు నచ్చకపోవడంతో కాంగ్రెస్‌లోకి : డా.పొనుగోటి**

పాలకుర్తి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్ని కల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలైనప్పటికీ మాజీ మంత్రి ఎర్రబెల్లి కనీసం ఎలాంటి సమీక్షలు నిర్వ హించకుండా ఎలాంటి పార్టీ సంస్థాగత నిర్మాణం చేప ట్టకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. పాల కుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావా లన్న సేవా ధృక్పదంతో అమెరికా నుంచి వచ్చి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పాలకుర్తి నియోజకవ ర్గంలో అఖండ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ నేతృ త్వంలో పనిచేయడానికి నిర్ణయించుకున్నట్లు వెల్ల డించారు. వారి సారథ్యంలో నియోజకవర్గం అన్ని రంగాలలో ముందుకు సాగుతుందని భావించి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. నాతో పాటు పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ముఖ్య నేతలు ఎన్.ప్రవీణ్ రావు, ఝాటోత్ నెహ్రూ, సంకటాల సోమేశ్వర్, సురేందర్ రెడ్డి, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణను ప్రపంచానికి రోల్ మోడల్‌గా చూపడానికే..

**హైదరాబాద్, మనం బ్యూరో:** తెలంగాణను ప్రపంచా నికి రోల్ మోడల్‌గా చూపడానికే భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం హెచ్ఐసిసిలో ప్రారంభం కానున్న భారత్ సమ్మిట్ ఏర్పాట్లను ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వ నాథ్ తదితరులు పాల్గొన్నారు. భారత్ సమ్మిట్‌కు 100 దేశాలకు పైబడిన ప్రభుత్వ అధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలతో కలిపి మొత్తంగా 450 మంది ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన అహింస-సత్యం-న్యాయం ప్రజాస్వామ్యం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించడం జరుగుతుంద న్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులను వివిధ అంశాలపై రెండు రోజుల పాటు చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోందని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# అసోంలో ఎమ్మెల్యే అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. 'సంబంధిత ఎమ్మెల్యే పహల్గాం దాడి వ్యవహారంలో పాకిస్థాన్ను సమర్థించినట్లుగా ఉన్న ఒక వీడియోను మేము సమీక్షించాం. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించాను. ఆయనను అరెస్ట్ చేసినట్లు డీజీపీ ధృవీకరించారు' అని హిమంత బిశ్వశర్మ తెలిపారు. ధింగ్ నియోజకవర్గ శాసనసభ్యుడైన అమినుల్ ఇస్లాంను న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సరైన రీతిలో ముగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో ఆధారంగా అసోం పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ వీడియోలోని అంశాలు ప్రజల మధ్య అశాంతిని రేకెత్తించేలా, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేలా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ అరెస్ట్‌పై అసోం పోలీసులు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రజలను తప్పుదోవ పట్టించేలా, రెచ్చగొట్టేలా ధింగ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం చేసిన ప్రకటన వైరల్ అయింది.దాని ప్రకారం ఆయనను అరెస్ట్ చేయడం జరిగింది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భారీ వే(డుక)దిక.. సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సభ ఏర్పాట్లు ఇటీవల రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిన్న ఎమ్మెల్సీ కవితలు ఏర్పాట్లను పరిశీలించారని, అన్ని బావున్నాయని చెప్పారన్నారు. నలు దిక్కుల నుంచి వచ్చే వారికి ఎక్కడ ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు.. అన్ని కూడా కేటీఆర్ పర్యవేక్షించారని సభ ఇన్‌చార్జులు చెప్తున్నారు. బీఆర్ఎస్.. రజతోత్సవ మహాసభ వేదిక, ఎవరూ ఊహించని స్థాయిలో నిర్మాణం చేశారు. 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదిక ఏర్పాటైనట్లు సమాచారం. దాదాపు 50 వేల వాహనాల్లో లక్షలాది మంది ఈ సభకు వస్తారనే అంచనా ఉండటంతో అందుకు అనుగుణంగా 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే, 154 ఎకరాల్లో సభా ప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్ వసతులు ఏర్పాటు చేశారు. మహాసభ ప్రాంగణం మొత్తం చదును చేశారు. సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ నుంచి జాతీయ రహదారి జంక్షన్‌గా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు అనువుగా ఉన్నది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అనుసంధానమయ్యేలా ఎల్కతుర్తి నుంచి జాతీయ రహదారులు ఉన్నాయి. రజతోత్సవ సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తి కొత్త కళను సంతరించుకున్నది. నెల రోజుల్లోనే గుర్తుపట్టలేనంతగా ఎల్కతుర్తిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అభివృద్ధి అయ్యాయి.

# భగ్గుమంటున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, రాబోయే 48 గంటల్లో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిల కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో నేడు, రేపు అక్కడక్కడా వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రాత్రి సమయాల్లో కూడా ఉక్కపోత, వేడి వాతావరణం అధికంగా ఉంటుందని తెలిపింది. అయితే, ఈ తీవ్రమైన ఎండల నుంచి కాస్త ఉపశమనం కలిగించే వార్తను కూడా వాతావరణ కేంద్రం అందించింది. ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాల మధ్య ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారే అవకాశం ఉందని పేర్కొంది. దీని ఫలితంగా శుక్రవారం, శనివారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఈ వర్షాలు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులతో కూడి ఉండొచ్చని అంచనా వేసింది. కాబట్టి, రానున్న రెండు రోజులు ప్రజలు ఎండ తీవ్రత, వడగాల్పుల నుంచి రక్షణ పొందాలని, ఆ తర్వాత కురిసే అకాల వర్షాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# కర్రెగుట్టలపై ఎన్ కౌంటర్



- ముగ్గురు మావోయిస్టుల మృతి
- ధృవీకరించిన ఐజిపి సుందర్ రాజ్

చర్ల, ఏప్రెల్ 24 (మనం న్యూస్) : కర్రెగుట్టలపై వేట మొదలయింది. మోస్ట్ వాంటెడ్ నేత మడివి హిడ్మాతో పాటు ఇతర అగ్రనేతలు, వందల మంది మావోయిస్టులు కర్రెగుట్టలపై తల దాచుకున్నారనే నిఘా వర్గాల సమాచారం, రెండు వారాల క్రితం కర్రెగుట్టలపైకి ఎవరూ రావద్దని, తమ రక్షణ కొరకు ఐఈడి లను అమర్చామని మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదల చేయడంతో మావోయిస్టుల కదలికలను నిర్ధారించుకున్న భద్రతా బలగాలు మూడు రోజుల క్రితం తెలంగాణ, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర వైపుల నుండి డి ఆర్ జి, ఎస్ టి ఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్, సి ఆర్ పి ఎఫ్ బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టాయి. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా పూజారికాంకేర్ వైపు నుండి భద్రతా బలగాలు ఒకొక్కటిగా మావోయిస్టులు అమర్చిన ఐఈడిలను వెలికితీసి నిర్వీర్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. చివరకు గురువారం ఉదయం భద్రతా బలగాలు లక్ష్యానికి చేరువయి మావోయిస్టు వేట ప్రారంబించారు. గురువారం ఉదయం భద్రతా బలగాలకు మావోయిస్టులు తారస పడటంతో ఇరు వర్గాల నడుమ పోరు ప్రారంభమైంది. ఈ ఎన్ కౌంటర్ లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత, కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా నేతృత్వం వహించే పి ఎల్ జి ఏ బెటాలియన్ నెంబర్ 1 కు చెందిన యూనిఫాం దరించిన ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని బస్తర్ ఐజిపి సుందర్ రాజ్ ధృవీకరించారు. మృతి చెందిన మావోయిస్టుల మృత దేహాలను స్వాదీన పరుచుకొని గుర్తించే పనిలో ఉన్నామని వెల్లడించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో పెద్ద మొత్తంలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, మావోయిస్టు సామగ్రిని స్వాదీన పరుచుకున్నట్లు వెల్లడించారు. మరో వైపు కర్రెగుట్టలకు సరిహద్దు రాష్ట్రాలలోని వైద్యశాలలను అప్రమత్తం చేసారు. అంబులెన్స్ లు, మందులను అందుబాటులో ఉంచారు. జవాన్ లు గాయపడితే చికిత్స నిర్వహించేందుకు హెలీ కాప్టర్ లను అందుబాటులో ఉంచారు. హెలికాప్టర్ ల ద్వారా గుట్టలపై ఉన్న భద్రతా బలగాలను ఆహారపదార్థాలు, త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. శుక్ర, శనివారం నాటికి భీకరపోరు సాగవచ్చని బావిస్తున్నారు.

# నకిలీ పత్రాలతో అక్రమ వెంచర్లు...

- ఫిర్యాదులు వచ్చిన స్పందించని అధికారులు
- డిఫెన్స్ ప్రహరీ గోడను ఆనుకొని ఏర్పాటు చేస్తున్న వెంచర్



రంగారెడ్డి, ఏప్రిల్24(మనం న్యూస్): నకిలీ పత్రాలతో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసిన ఉదాంతం బడంగ్పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సుల్తాన్ పూర్ లో చోటు చేసుకుంది. ఈ అక్రమ వెంచర్ డిఫెన్స్ ప్రహరీ గోడను ఆనుకొని ఉన్న అధికారులు ఎలాంటి చలనం లేకపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కంచె చేను మేసిందా అనే చందంగా... బడంగ్పేట మున్సిపల్ అధికారుల తీరు ఉండడంతో స్థానికంగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షించాల్సిన అధికారులు భక్షకులుగా మారితే... అక్రమాలకు అడ్డు అదుపు ఏముంటుంది? కాసుల కక్కుర్తితో ఎంతటి అక్రమాలకు పాల్పడ్డానికైనా వెనకాడరని సుల్తాన్ పూర్ సర్వే నంబర్ 59 లో అక్రమంగా వెలుతున్న వెంచర్ అధికారుల అక్రమార్జనకు నిలువెత్తు నిదర్శనమని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.... బడంగ్పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భారీగా లంచాలు తీసుకొని అక్రమ వెంచర్లను ప్రోత్సహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ వెంచర్ల కారణంగా కార్పొరేషన్ ఆదాయం గణనీయంగా తగ్గుతోందని, కార్పొరేషన్కు పన్నుల రూపంలో ఆదాయం రాకపోయినా పర్వాలేదు, కానీ మన జేబులు నింపుకోవడానికే సరిపోతుందనే తీరులో అధికారులు వ్యవహరిస్తున్నట్లు, అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయాన్ని పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని, రక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉంటూ పరోక్ష సహకారాలు అందిస్తున్నారు అనే విమర్శలు సైతం లేకపోలేదు. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ నియమనిబంధనలు గాలికి వదిలేస్తూ ఇష్టానుసారంగా వెంచర్లు చేపడుతున్న వెంచర్లపై ఫిర్యాదులు అందిన స్థానికుల నుండి వ్యతిరేకత ఉన్న అధికారులు మాత్రం చర్యలు తీసుకొని దాఖలాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**డిఫెన్స్ ప్రహారిని ఆనుకొని మరి ఏర్పాటు చేస్తున్నవెంచర్...**

రక్షణ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, డిఫెన్స్ వాల్ నుండి దాదాపు 500 వందల మీటర్ల వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ అక్రమార్కులు డిఫెన్స్ నిబంధనలను విస్మరిస్తు అక్రమ వెంచర్ ఏర్పాటు చేయడం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుంది. ఈ అక్రమ వెంచర్ జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తే, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాధ్యత వహిస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.రక్షణ శాఖకు అంతరాయం కలిగించడానికి బీ ఎం సి అధికారులు కన్సర్వేషన్ జోన్లో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నా, కానీ వారు దానిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రక్షణ శాఖకు చాలా దగ్గరగా ఉన్న కన్సర్వేషన్ జోన్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదు. కానీ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని చాలామంది ప్రశ్నిస్తున్నారు. దేశ భద్రతకు దగ్గరగా ఉన్న పోర్ట్ఫోలియో పత్రాలతో వెంచర్ ఏర్పాటుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షణ నియమాలను తుంగలో తొక్కి కన్సర్వేషన్ జోన్లో వెంచర్ ఏర్పాటుకు బీఎమ్సీ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ వెంచర్లలో మధ్యతరగతి ప్రజలు తమకు తెలియకుండానే ఇళ్లు కొనుగోలు చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఫిర్యాదులను పూడ్చిపెట్టి, అక్రమార్కులతో చేతులు కలిపి అధికారులు లంచాలు తీసుకొని అక్రమాలకు కొమ్ము కాస్తున్నారని దేశ ప్రజలను మోసం చేయడానికి నకిలీ పత్రాలతో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై, అక్రమ వెంచర్లను ప్రోత్సహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర దర్యాప్తు నిర్వహించి అక్రమ వెంచర్లను తొలగించాలని, అక్రమార్కులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో సర్వే నంబర్ 59లో ఏర్పాటు చేసిన అక్రమ వెంచ్ప రక్షణ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, విజిలెన్స్కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

# ఓటిపి తెచ్చిన తంటా..




- దరఖాస్తుదారులకు మంట...
- జనన.. మరణ.. ధృవ పత్రాలకు మరలా జన్మెత్తలా..?
- ధృవ పత్రాల కోసం కళ్లలో వత్తులేసుకుంటున్న దరఖాస్తుదారులు
- బల్దియాలో కార్యాలయాల చుట్టూ బారులు తీరుతున్న ప్రజలు
- అయోమయంగా ఆపరేటర్లు, అతలాకుతలంగా దరఖాస్తుదారులు

హైదరాబాద్,ఏప్రిల్24(మనం న్యూస్): ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు, సేవలు ప్రజలకు మెరుగైన పద్ధతిలో ఎలాంటి ఇక్కట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఉండేందుకు వీలుగా, సులువుగా, సౌకర్యవంతంగా ప్రభుత్వ సేవలను ప్రజలు పొందేందుకు కొన్ని ప్రభుత్వ సేవలను విధివిధానాలను పునరుద్ధరించడం గాని, మెరుగుపరచడం కానీ సర్వసాధారణం. అలా పునరుద్ధరించిన ఓ ప్రభుత్వ సేవనే అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వ కార్యాలయంలో ఆపరేటర్లకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం జనన మరణ ధ్రువపత్రాలు పారదర్శకంగా జారీ చేయాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఓటిపి పద్ధతి... ఆపరేటర్లకు తంటాలు తెచ్చి పెడుతుంటే.. దరఖాస్తుదారులు మాత్రం మండిపడుతున్నారు. బల్దియా పరిధిలో ఎక్కడ ఏ మున్సిపల్ కార్యాలయం చూసిన ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు కార్యాలయాల చుట్టూ బారులు తీరుతూనే ఉన్నారు. జనన మరణ ధృవ పత్రాలు కొరకు దరఖాస్తు చేసుకున్న ఏడు పనిరోజుల్లో ధృవీకరించి జారీ చేయాల్సిన ధ్రువపత్రాలు నెలలు గడుస్తున్న ఇంకా జారీ కాకపోవడంతో జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలు విసుగు చెందుతున్నారు. ఇందుకు గల కారణాలు ప్రతి ఒక్క దరఖాస్తుకు ఓటీపీ రావడమే ప్రధాన కారణం అనే వాదనలు బల్దియాలోని మున్సిపల్ కార్యాలయంలో వినిపిస్తున్నా మాట. గతంలో ఆపరేట్ ఒక్కసారి మెడికల్ ఆఫీసర్ నుండి ఉదయం ఒక్కసారి ఓటిపితో లాగిన్ అవుతే సాయంత్రం వరకు ఎన్ని దరఖాస్తులు అయినా జారీ చేసే వెసులుబాటు ఉండేది. కానీ ప్రస్తుత విధానం అందుకు పూర్తి బిన్నంగా ఉంది. ప్రతి దరఖాస్తుకు మెడికల్ ఆఫీసర్ నుండి ఆపరేటర్ ఓటిపి పొందాలి. ఉదాహరణకు ఒక్కరోజులో ఒక పది దరఖాస్తులు జారీ చేయాలంటే పది సార్లు మెడికల్ అధికారి నుండి పది సార్లు ఓటీపీలు పొందాల్సి వస్తుంది. దీంతో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ని పదేపదే ఓటీపీ అడగలేక దరఖాస్తులు వేగంగా పూర్తి చేయలేక ఆపరేటర్లు గందరగోళంతో పాటు ప్రజల ఆగ్రహానికి సైతం గురవుతున్నారు.

**తక్షణమే ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలి...**

జనన మరణ పత్రాలు పారదర్శకంగా వేగంగా జారీ అయ్యే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపించి, ఈ సమస్యకు వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే నెలల తరబడి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సైతం వెంటనే జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అవినీతిమయంగా తుర్కయంజాల్ టౌన్ ప్లానింగ్ అధికారులు



- పుట్టగొడుగుల అక్రమ నిర్మాణాలు

తుర్కయంజాల్, ఏప్రిల్ 24( మనం న్యూస్): మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్, రాగన్నగూడ, తుర్కయంజాల్, కమ్మగూడ బ్రాహ్మణపల్లి తొర్రూరు మునగనూరు గ్రామాల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే దారిలో పెద్ద ఎత్తున అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదు. టౌన్ ప్లానింగ్ సెక్షన్లో పని చేసే ఓ ఔట్సోర్సింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అక్రమ నిర్మాణాలు వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలిసింది. . 9 గ్రామాలతో ఏర్పడిన తుర్కయంజాల్ మున్సిపాలిటీకి పర్మినెం ట్ టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో ఔట్సోరి ంగ్స్ లో పనిచేసే సదరు షాడో అధికారి లక్షలు దండుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.. ఉన్నతాధికారులకు అక్రమ నిర్మాణదారులకు మధ్యవర్తిగా ఉంటూ పనులు చక్కబెడుతున్నారని తెలిసింది.. ఇప్పటికైనా సిడిఎంఏ అధికారులు సదరు ఔట్సోర్సింగ్ సిబ్బం దిపై చర్యలు తీసుకొని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

# ఉగ్రవాదులను అంతమొందించాలి




- సిపిఐ రాష్ట్ర సభ్యులు ఓరుగంటి యాదయ్య

తుర్కయంజాల్, ఏప్రిల్ 24( మనం న్యూస్): కాశ్మీర్ లోని పహాల్గం లో నిన్న మారు పోలీస్ వేషంలో వచ్చి విచక్షణారహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తుర్కయంజల్ మున్సిపాలిటీ సమితి ఆధ్వర్యంలో యంజాల్ చౌరస్తాలో ఘటనలో మరణించిన పౌరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివ కుమార్ గౌడ్ లు మాట్లాడుతూ సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడులు హేయమైన చర్య అని వారు అన్నారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లో అలజడి సృష్టించడమే పాక్ ప్రధాన ఉదేశ్యమని, ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో కేంద్రం ప్రభుత్వం విఫలం చెందిందని వారు ధ్వజమెత్తారు. అదేవిధంగా పౌరులపై జరిగిన ఉగ్ర దాడులను చూస్తే 370 ఆర్టికల్ రద్దు చేస్తే కాశ్మీర్ లో ప్రశాంత వాతావరణం ఉంటుందన్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యం, ఇంటెలిజెన్స్, విభాగాల వైఫల్యాల నిర్లక్ష్యమే కారణమని నమ్మాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోయారు. ఇండియన్ ఆర్మీ లో సైనికుల రిక్రూట్మెంట్ భర్తీని గత నాలుగు సంవత్సరాలుగా ఆపివేశారు. ఈ కారణంగానే భద్రతా వ్యవస్థ కుంటు పడిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సీపీఐ నాయకులు భాస్కర్, డి.ప్రసాద్, సురేష్, జంగయ్య, యాదయ్య, రామ్ సింగ్, హనుమంత్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం నిందితులను వెంటనే ఉరి తీయాలి

సిద్ధిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: పహల్గాం నిందితులను వెంటనే గుర్తించి బహిరంగంగా నిందితులను వెంటనే ఉరి తీయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తాలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండించారు. మృతి చెందిన కుటుంబాల సభ్యులకు సంతాపం తెలియజేశారు.

ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థకు వత్తాసు పలుకుతున్న పాకిస్తాన్ కు ప్రపంచ దేశాలు సహాయ నిరాకరణ చేయాలన్నారు.

పహల్గాం సంఘటనకు బాధ్యత వహించి ప్రధాన మంత్రి మోడీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి




- తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు యండి. షానూర్ బాబా

భువనగిరి, ఏప్రిల్ 24( మనం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో కాశ్మీర్ లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని తీవ్రంగా ఖండించి, వారి ఆత్మకు శాంతించాలని కోరుతూ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ పర్యటించడానికి వెళ్లిన సందర్శకులని ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన యావత్ దేశప్రజల్ని కలచివేసిందని ఇది హేయమైన చర్య అని అన్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి కాశ్మీర్ లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఆసరాగా చేసుకొని దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి చర్యలు పునవృత్తం కాకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవరకొండ లావణ్య, జిల్లా ప్రచార కార్యదర్శి బైరపాక సీరిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు చెన్నయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్

గండిపేట, ఏప్రిల్ 24(మనంన్యూస్): మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం బీఆర్ఎస్ నేతలు తిరుమల హిల్స్ లోని రోడ్ నెంబర్ 1, 2 మరియు 3 ని సందర్శించారు. . ఈ సందర్భంగా స్థానికులు వెల్లుబుచ్చిన ప్రధాన సమస్యలు తెలిపారు. రోడ్ నెంబర్ 2 లో దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం రోడ్డుని తవ్వి తిరిగి రోడ్డుని నిర్మించలేదనీ, ఈ విషయం పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. . రోడ్ నెంబర్ 2 ప్రాంతంలో మెయిన్ రోడ్డు పైన ఎప్పుడు వాన కురిసిన మోకాళ్లోతు నీళ్లు నిలబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దీనికి ప్రధాన కారణం గోల్డెన్ టెంపుల్ జంక్షన్ నుంచి ఒకవైపు మాత్రమే పెద్ద డ్రైనేజ్ లైన్ వేయడం జరిగింది ఇక రెండవ వైపు పాతకాలం నాటి చిన్న సైజు పైపులు ఉన్న కారణంగా నీరు నిలుస్తున్నది. కావున రోడ్ నెంబర్ 2 దగ్గర డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోడ్ నెంబర్ 2 మరియు 1 కూడలిలో ఎలక్ట్రికల్ స్తంభం ఒక వైపు వంగడం వలన ఎల్టి లైన్ వైర్లు పూర్తిగా కిందకి వేలాడుతున్నాయి. దీని కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు స్పందించి ఎలక్ట్రికల్ లైన్ సరి చేయవలసిన అవసరం, రోడ్ నెంబర్ 2 మరియు 3 మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం వేస్తున్న కారణంగా తరచు పాములు వస్తున్నాయని చెప్పి స్థానికులు తెలియజేశారు.. తిరుమల హిల్స్ కాలనీ మొత్తంగా



హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారు ప్లాన్ మంజూరు చేసినప్పటికీ కాలనీలో రోడ్లు కుదించుకు పోయినాయి. ముఖ్యంగా రోడ్ నెంబర్ 3 పూర్తిగా ధ్వంసం అయిపోయింది. ఇక ఈ రోడ్లో తరచూ డ్రైనేజ్ సమస్య కూడా ఉత్పన్న మవుతున్నది. కావున మున్సిపాలిటీ వారు స్పందించి ముందుగా డ్రైనేజీ లైన్ వేసి తదుపరి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని వీటికి వాక్సినేషన్ మరియు పునరుత్పత్తి జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరడమైనది. ఇక ఎప్పటినుంచో మణికొండ ప్రాంత ప్రజలందరూ కూడా ఈ వీధి శునకాలకు షెల్టర్ హోమ్స్ కట్టించాలని కోరుతున్నప్పటికీ మున్సిపాలిటీ వారు ఇంతవరకు ఈదిశగా చర్యలు చేపట్టక పోవడం శోచనీయం. రోడ్ నెంబర్ 2 లో సెక్రటేరియట్ కాలనీ కలుపుతూ వెనుక భాగంలో రోడ్డు నిర్మించ వలసి ఉండగా, దీన్ని ఎవరు పట్టించు కోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ రోడ్డు స్థలం అన్యక్రాంతం కాకముందే మున్సిపాలిటీ వారు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. మణికొండ ప్రాంతంలో రోజుకి 450 ట్యాంకర్లు తిరుగు తున్నప్పటికీ ట్యాంకర్ బుక్ చేసుకున్న వారికి దాదాపు 12 గురించి 14 గంటల సమయం పడుతున్నది. ఇక కొంతమంది నిర్ణీత ధర కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కావున హైదరాబాద్ వాటర్ వరక్స్ వారు నీటి టాంకర్లను అనుచితంగా ఉపయోగించకుండా చూడాలన్నారు. వీధి దీపాలు తరచూ పాడై పోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇంటి పన్ను వసూలు చేయడం పైన ఉన్న శ్రద్ధ ప్రజలకు అవసర నిమిత్తం మేలు తలపెట్టాలని మున్సిపల్ అధికారులకు లేదని, వీధి శుభ్రతపై అసలు స్పందనే లేదని తెలిపారు. ఈ సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, బుద్ధోలు బాబు, ఉపేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాస్ చారి, సంఘం శ్రీకాంత్, కిరణ్ యాలాల, సుమనళిని, చెరుకూరి బాలాజీ తది తరులు డిమాండ్ చేశారు.

# అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి చాలా గొప్పది

- ప్రజలకు మానవీయ కోణంలో వైద్యం చేయాలి
- పేదల పట్ల మానవతా దృక్పథంతో ఉండాలి
- రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

చేవెళ్ల , ఏప్రిల్ 24 (మనం న్యూస్): అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి చాలా గొప్పదని,వైద్యులు మానవీయ కోణంలో ప్రజలకు వైద్యం చేయాలని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. చేవెళ్లలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల మొదటి స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ హాజరై కళాశాల చైర్మన్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రముఖ వైద్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పతకాలు, పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల పట్ల మానవతా దృక్పథంతో ఉండాలని పేర్కొన్నారు. ఏ వృత్తికి లేని గౌరవం ఒక వైద్యానికి దక్కిందన్నారు. ఇది పవిత్రమైనదని వృత్తి విలువలను కాపాడుకోవాలని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ. 12393 కోట్లు వైద్య రంగానికి కేటాయించిందని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితి రూ.5లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచిందన్నారు. రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 4 090 కి పెరిగిందన్నారు. కొత్తగా 28 పారామెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రూ.2వేల 700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఇతర




అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడుకునేలా రాష్ట్ర , జాతీయ రహదారిపై ప్రతి 30 కిలోమీటర్లకు చొప్పున ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజలకు అండగా ఉంటూ రాజకీయాల్లో ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలు అందించడంతోపాటు మెడికల్ కళాశాలలో స్థాపించి డాక్టర్లను తయారు చేస్తున్న పట్నం మహేందర్ రెడ్డి సేవలను ఆయన అభినందించారు. ఝప్రజలకు మంచి వైద్యం సేవలు అందిందించి తల్లిదండ్రుల, ప్రజల మన్నలలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టెడ

మిత్రుని ఫోన్ కాల్తో బయటికి వెళ్తుంటే
గబుక్కున ఆగాను పట్టెడ
ఐదుగజ్జల పట్టెడ కిందపడి ఉంది
అల్మారా నుండి
ఏ కొత్తబట్టలు తీస్తుంటే
ఏ సర్టిఫికెట్లు చూస్తుంటే
పడిందో ఏమో పట్టెడ
మెడకి అలంకరించే ఆభరణం కాదది
ఒక్క మెరిసే ఆభరణమే కాదది
ఆ పట్టెడ మామూలుది కాదు
కొంత విలువ కొంత పవిత్రతతో
పాడుభూమిని చదునుచేసి
సాగుచేసినట్టు
మా పాడు బతుకుల్ని
పదనుచేసి బాగుచేసి
ఎన్నిసార్లు షావుకారి ఇనుపగదిలో
బంధిఖానా అయ్యిందో పట్టెడ
సగం జైలు సగం బెయిలు దానిది
మాది కుదుటపడ్డ గోపురం కాదు
కుదువపెట్టే కాపురం
ఏ అవసరాలు పిలిచినా
ఆపద్బాంధవమైన పట్టెడ
ఏ అరణ్యాలు మొలిచినా
ఆయుధమైన పట్టెడ
బంగారు పట్టెడ
అమ్మ శరీరాన్ని ముద్దాడిన పట్టెడ
సెలయేళ్ళుగా మారిన
మాకన్నీళ్లను తుడిచిన పట్టెడ
చేతిలోకి తీసుకొని పట్టెడ చూస్తుంటే
కన్నీటి సరస్సులో వికసించిన
పద్మంలా అగుపించిన అమ్మ
బాల్యపు జాడల్లోంచి
యవ్వనపు నీడల్లోంచి
కరిగిన కలలో మెరిసిన
వజ్రంలా కనిపించిన అమ్మ
ఇప్పుడన్నీ వున్నాయి
ఉద్యోగం హోదా
ఇప్పుడన్ని వున్నాయి
ఆస్తి అంతస్తూ
లేనిది అమ్మవొక్కతే

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# భూమిని మనమే కాపాడుకుందాం



సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. ఇది ప్రపంచ ఉపరితలంలో 29.1శాతాన్ని ఆక్రమించి కోట్లాది జీవ జాతులకు నివాసయోగ్యమైనది. గాలి, నీరు, నేలతో ఆవరించిన భూమి 'సహజ వనరుల' గని. దీనిపై జీవుల పుట్టుక దాదాపు 350 కోట్ల ఏళ్ల క్రితం జరిగిందని, ధరిత్రి ఇప్పటి స్థితికి రావడానికి దాదాపు 460 కోట్ల సంవత్సరాలు కాలం పట్టిందని శాస్త్రవేత్తల అంచనా. భూమిపై మానవ అనాలోచిత చర్యల ఫలితంగా జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న లక్ష్యంతో పాటు పర్యావరణం పట్ల స్పృహ కలిగి ఉండడానికి ప్రతి ఏటా 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' నిర్వహించడం జరుగుతుంది. పారిశ్రామీకరణ, పట్టణీకరణ వలన పెరుగుతున్న కాలుష్యం, పర్యావరణ అంశాలను దృష్టిలో పెట్టుకుని అమెరికన్ సెనేటర్ గేలార్డ్ నెల్సన్ ధరిత్రి దినోత్సవానికి రూపకల్పన చేశారు. దీనిని మొట్టమొదటిసారి అమెరికాలో 1970 ఏప్రిల్ 22న నిర్వహించారు. అనంతరం ఇది ప్రపంచ దేశాలకు వ్యాప్తి చెందింది. ప్రపంచ స్థాయిలో ధరిత్రి సంరక్షణ పట్ల మరింత అవగాహన కలిగించి, భూగోళాన్ని సంరక్షించడానికి 'ఎర్త్ డే నెట్‌వర్క్' కూడా ఏర్పడింది. ఐక్యరాజ్యసమితి 2009లో ఈ ధరిత్రి దినోత్సవానికి ఆమోదం తెలిపి దీనిని 'ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ డే'గా మార్చింది. ఈ ఏడాది ధరిత్రి దినోత్సవం 'మన శక్తి, మన గ్రహం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. 2030 నాటికి పునరుత్పాదక వనరుల నుండి ప్రపంచ విద్యుత్ ఉత్పత్తిని మూడు రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ నినాదం ప్రాధాన్యత సంతరించుకున్నది.

నేడు ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న అనేక కార్యకలాపాలు భూమి కాలుష్యానికి దారితీస్తుంది. శిలాజ ఇంధనాలు విచ్చలవిడిగా వాడడం వల్ల గ్రీన్ హౌస్ వాయువులు విడుదలై వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవిస్తున్నాయి. తద్వారా భూగోళం వేడెక్కి హిమాని నదులలో మంచు కరిగి వరదలు సంభవిస్తున్నాయి. దీంతో నేల కోతకు గురికావడం, కరువులు తాండవించడం జరుగుతుంది. అడవుల నరికివేత, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు, అణుశక్తి వలన రేడియోధార్మిక పదార్థాలు భూమిలోకి ప్రవేశించడం వలన నేల కాలుష్యానికి గురవుతుంది. వరల్ అట్లాస్ ఆఫ్ డెసర్టిఫికేషన్ ప్రకారం 75 శాతం నేలలు ఇప్పటికే క్షీణించాయి. ఇది 320 కోట్ల ప్రజలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపనుందని యునెస్కో పేర్కొన్నది.

2050 నాటికి, భూ గ్రహం యొక్క 90 శాతం వరకు నేల క్షీణించవచ్చని సంస్థ హెచ్చరించింది. ఇది ఇలా ఉంటే ఇటీవల పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా తప్పుకోవడం ఆందోళనకరం. దీన్ని పునసమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ ప్రకారం, భారతదేశంలోని దాదాపు 30 శాతం నేల క్షీణించింది. ఇది వ్యవసాయం మరియు ఆహార భద్రత పైన తీవ్ర ప్రభావం చూపనుంది. వాయు కాలుష్యం పెచ్చుమీరడం మూలంగా ఓజోన్ పొర కూడా రోజు రోజుకు దెబ్బతినడం జరుగుతుంది. తద్వారా అతి నీలలోహిత కిరణాలు భూమి పైకి చేరి జీవరాసులకు నష్టం వాటిల్లుతుంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం మూలంగా పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన భూమి నిస్సారంగా మారిపోయింది. ప్రస్తుతం ప్లాస్టిక్ మరియు చెత్త కూడా భూ కాలుష్యానికి ప్రధాన కారణంగా నిలుస్తుంది. ముఖ్యంగా ప్లాస్టిక్, లోహ మరియు ప్యాకేజీ తదితర వ్యర్థ పదార్థాల పరిమాణం కూడా విపరీతంగా పెరిగింది. విచ్చలవిడి గనుల తవ్వకం వలన పర్యావరణ సమతుల్యతఛదెబ్బతింటుంది. ముఖ్యంగా గనుల తవ్వకం వలన దట్టమైన అడవులు అంతరించిపోవడంతో పాటు దాని నుంచి వెలువడే దుమ్ము, దూళి వల్ల గాలి, నీరు, నేల కాలుష్యానికి గురికావడం జరుగుతుంది. ఇలా మానవ చర్యల ఫలితంగా జీవ వైవిద్యం సైతం పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో భారత విద్యా మంత్రిత్వ శాఖలోని పాఠశాల విద్య అక్షరాస్యత విభాగం ఈ సంవత్సరం ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్ కోసం ఎకో క్లబ్ ద్వారా వృక్షజాలం కోసం క్యూఆర్ కోడ్ లు' అనే విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించింది. తెలంగాణలోని అన్ని పాఠశాలలు తమ పర్యావరణ విద్యా కార్యక్రమాలలో దీన్ని అమలు చేయనున్నారు. పాఠశాల ఆవరణంలో చెట్ల కోసం ఖఖ కోడ్ ను రూపొందిస్తారు. ఇది పర్యావరణ అభ్యాసాన్ని డిజిటల్ నైపుణ్యాలతో కలిపే సృజనాత్మక మరియు ప్రభావవంతమైన విధానం. ఈ ఖఖకోడ్ లో చెట్టు పేరు, జాతులు, లక్షణాలు మరియు ప్రయోజనాల గురించి సమాచారాన్ని తక్షణమే పొందేలా చేస్తాయి.

ప్రస్తుతం పెరుగుతున్న జనాభా అవసరాలకు తీరుస్తూ భూగోళ సుస్థిరతకు చర్యలు చేపట్టాలి. ఇందులో భాగంగా సుస్థిర వ్యవసాయోత్పత్తికి, అడవుల యాజమాన్యానికి, నేలకోత నివారణకు, నీటి కాలుష్య నియంత్రణకు చర్యల చేపట్టాలి. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ, ఉత్పాదకత పెంచే సేద్య విస్తీర్ణంపై పరిశోధనలు జరగాలి. పర్యావరణానికి హాని కలిగించే శిలాజ ఇంధన వనరులకు బదులుగా పునరుత్పాద ఇంధన వనరులైన పవన, సౌర, బయోగ్యాస్, బయోమాస్, హైడ్రోజన్ శక్తి, సముద్ర తరంగ శక్తి మరియు జీవ ఇంధనాలపై దృష్టి పెట్టాలి. భూమి కాలుష్యానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్ బదులు భూమిలో కలిసిపోయే జనుము, గోగునార లాంటి ప్యాకింగ్ వస్తువుల వినియోగాన్ని తీసుకురావాలి. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ నిబంధలు కఠినంగా పాటించాలి. పట్టణ ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ సక్రమంగా చేయాలి. ఘన వ్యర్థ పదార్థాలను పున: చక్రియ ప్రక్రియ ద్వారా కంపోస్ట్ మరియు జీవ ఎరువులను తయారు చేయాలి. వ్యవసాయంలో రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం నేల సారాన్ని పరీక్షించడానికి సాయిల్ హెల్త్ కార్డులను తీసుకురావడం జరిగింది. వీటి పట్ల రైతులకు అవగాహన కల్పించాలి. పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలి. పరిశ్రమల నుంచి విషపూరిత వ్యర్థాల విడుదలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు నియంత్రించాలి. ఉపాధ్యాయులు బాల్య దశ నుంచే భూగోళ సంరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పాఠ్యాంశాల్లో ధరిత్రికి సంబంధించిన పాఠ్యాంశాలను చేర్చాలి. అంతేకాకుండా విద్యార్థులకు ధరిత్రికి జరుగుతున్న నష్టాన్ని క్షేత్రస్థాయి పర్యటనలు, కృత్యాల ద్వారా వివరించాలి. అప్పుడే భవిష్యత్ తరాల కోసం భూగోళం రక్షించబడుతుంది.



**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# ఒత్తిడికి గుండె ఎందుకు ఓడిపోతుంది?



ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో జీవితం సాంకేతికంగా సౌకర్యవంతంగా మారిందనుకునే సమయంలో, మనసు మాత్రం మరింత భారంగా మారుతోంది. రోజూ ఎదురయ్యే పని బారాలు, సంబంధాల అర్థం పర్థం లేని ఒత్తిళ్లు, సామాజిక మీడియా ప్రభావం, మరియు నిరంతరమైన 'ప్రదర్శన' కృషి ఇవన్నీ కలిసి మన ఆత్మస్థైర్యాన్ని నెమ్మదిగా హరిస్తున్నాయి. చాలా మంది నిద్రలేమితో,ఆలోచనల వణుకుతో, అప్రయత్న ఆగ్రహంతో బాధపడుతున్నారు. కానీ దీన్ని ఎవరూ మానసిక సమస్యగా గుర్తించాలనే ఆలోచన చేసుకోవడం లేదు. ఎందుకూ తెలియని ఉక్కిరిబిక్కిరి నిదానంగా నశిస్తున్న మన లోకపు లోపలి బాధ. ఎంతో బరువు మోయగల హృదయం... ఒత్తిడికి ఎందుకు ఓడిపోతుంది? మనశ్శక్తికి పరిమితి లేదు అనుకుంటూ, మౌనంగా తిప్పుకొంటున్న మానసిక బాధలకు గళం ఇవ్వాల్సిన సమయం ఇది

ఒత్తిడిని ఎదుర్కొనడంలో శరీరం ఫైట్ లేదా ఫ్లయిట్ ప్రతిస్పందనను ప్రదర్శిస్తుంది. ఇది తాత్కాలికంగా సహాయపడినా దీర్ఘకాలంలో మన నరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కొంతమందిలో బర్నౌట్ సిండ్రోమ్ కి, మరికొంతమందిలో ఆత్మహత్యల ఆలోచనలు కి దారితీస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు, మరియు మహిళలు ఒత్తిడికి ఎక్కువగా లోనవుతున్న సమూహాలలో ఉంటున్నారు. అయినప్పటికీ, వారు మానసిక నిపుణలను కలవడాన్ని అవమానంగా భావించడం మన సమాజంలో ఇప్పటికీ బలంగా ఉంది.

మానసిక ఆరోగ్యం సరైన మద్దతు లేకుండా వదిలేస్తే అది వ్యక్తిగతంగా కాక సమాజపరంగా కూడా ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. అధిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తులు తమను తాము గౌరవించలేకపోతారు, ఇతరులను నమ్మలేరు, మరియు అసూయ, క్రోధం, నిస్పృహ వంటి భావోద్వేగాలను అదుపులో పెట్టలేరు. ఇది కుటుంబ సంబంధాలను భంగపరుస్తుంది, పనితీరు దెబ్బతీస్తుంది, చివరకు జీవితం విలవిల్లాడే స్థితికి చేరుతుంది.



ముందుచూపు దిశగా - మార్పు అవసరం!

ఒత్తిడిని ఎదుర్కొనడం అంటే కేవలం ధైర్యం చెప్పడం కాదు. ఆత్మవిశ్లేషణ, స్వీకార సామర్థ్యం, ప్రొఫెషనల్ సహాయం. ఇవే దీని తాలూకు పరిష్కార మార్గాలు. మానసిక నిపుణలను కలవడంలో ఎలాంటి సందేహం ఉంచుకోవాల్సిన అవసరం లేదు, అది చైతన్యానికి నిదర్శనం. కౌన్సెలింగ్, సైకోథెరపీ, అవసరమైతే మందులు ఇవన్నీ మన బలహీనతలను తగ్గించేందుకు కాదు, మన బలాన్ని తిరిగి పొందేందుకు ఉన్నాయి అని గుర్తుంచుకోవాలి. మనసు అనేది శరీరానికి మార్గదర్శకమైన అస్త్రం. దాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మన పునాదులనే లెక్కచేయకపోవడం. ఇప్పుడు మన చేతుల్లో ఉన్న ముఖ్యమైన మార్పు మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం, మౌనం తొలగించడం, సహాయం కోరడాన్ని స్వీకరించడం.

మనసు ప్రశాంతంగా ఉంటేనే, శరీర ఆరోగ్యం

ఈ ప్రపంచం పరిగెత్తుతోందని మనం కూడా అలాగే పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. మన ఆరోగ్యం ముందు దారితప్పిన ప్రదర్శనలు ముఖ్యం కాదు. ఒత్తిడిని చిన్నచూపు చూడకండి ఇది శరీరం కన్నా ముందుగా మనసును గాయపరుస్తుంది. అవసరమైతే సహాయం కోరండి. మన జీవితం విలువైనది. మనసు ప్రశాంతంగా ఉంటేనే, శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అదే నిజమైన విజయం.

**- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# జంతువులకు హక్కులు లేవా!



రాజ్యాంగాలు మానవాళికి స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించాయి. తన మనుగడ కోసం ఏ పనికైనా సిద్ధం అంటున్నాడు నవ్య నరుడు. మనిషికి మనిషే శత్రువుగా మారాడు. పశుత్వం నిండిన మనిషి జంతువుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నాడు. తన స్వార్థం కోసం ఎంత దూరమైనా వెళ్లగలడు. ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు లేదా అధ్యయనాల పేరుతో మిలియన్ల సందర్భంగా మిలియన్ల కొద్ది మూగ జీవులపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి మిలియన్ల కొద్ది జంతువుల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. జంతువులపై ప్రయోగాలు పూర్తి అయిన తర్వాతనే ఆ ఔషధాలను మానవ వాడకానికి అనుమతిస్తారు. నేటికీ అనేక ప్రయోగశాలల్లో ఎలుకలు, కుందేళ్లు, పిల్లులు, కుక్కలు లాంటి అమాయక జీవులు బోనుల్లో మగ్గుతూనే ఉన్నాయి. కప్పలు, బొద్దింకలు, వానపాములు, పలు జంతువులను డిసెక్షన్ చేసి వాటి లోపలి అవయవ భాగాలను అధ్యయనం చేయడం గత తరం జంతుశాస్త్ర విద్యార్థులకు



అమాయక జంతువుల ఉసురుపోసుకుంటూ, ప్రయోగాల మిషతో చంపడం అనాదిగా కొనసాగుతున్నది. ఈ విధం అమాయక మౌనజీవులను ప్రయోగశాలల్లో వినియోగిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఏట 24 ఏప్రిల్ రోజున ప్రపంచ ప్రయోగశాల జంతువుల దినం లేదా వరల్ డే ఫర్ లాబొరేటరీ ఆనిమల్స్ అనబడే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

మనం నిత్యం వాడుతున్న ఔషధాలు, క్రిమిసంహారకాలు, ఏవియేషన్, యుద్ధ క్షేత్రాలు, కాస్మొటిక్స్, బాత్రూం క్లీనర్స్ ఆవిష్కరణల సందర్భాల్లో పరిశ్రమలు/ప్రయోగశాలలు అనేక రకాలైన పరీక్షలు, ప్రయోగాలు చేస్తారు. ఈ తెలిసిన అనుభవమే. ప్రపంచ ప్రయోగశాల జంతువుల దినం వేదికగా అవగాహన కల్పించడం, జంతువులపై ప్రయోగాలకు బదులుగా సరైన ప్రత్యామ్నాయాలు వెతకడం, జీవ కారుణ్య భావనలను విస్తరించడం, మానవీయ కోణంలో ఆలోచనలు చేయడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ఇలాంటి జీవ హింసకు బదులుగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జంతువులు లేకుండానే ప్రయోగాలను పూర్తి చేద్దాం, మానవత్వాన్ని కాపాడుదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## మారుతారా?
## మీరు ఇకనైనా మారుతారా?

ఓటు బ్యాంకు రాజకీయాలకోసం
కులాల చిచ్చు,మతాల చిచ్చు...
మౌనంగా ఏదైనా భరిస్తాం కానీ....

మరణమొచ్చినా మారేది లేదంటారా?
భిన్నత్వంలో ఏకత్వం ఎక్కడికి పోయింది...
ఈ నేల నెత్తురోడిన ప్రతిసారి ఇవే ప్రశ్నలు....

అప్పటిదాక కలిసున్న రాం-రహింలకు చిక్కులు...
ఎవడి జీవనం వాడిది,ఎవడి అభిమతం వాడిదే...
మరి కలిసుండాలంటే ఒకరినొకరు గౌరవించుకోవాల్సిందేగా...

ఇఫ్తార్ విందు ఇచ్చే నాయకులకు హిందువులు గుర్తుకురారా?
పీర్ల మసీదులో ఆడినా,పాడినా... దర్గాలను దర్శించుకున్నా...
రహీం గుడిలోకి రాడెందుకు? ఈ మధ్యన చెలరేగుతున్న ప్రశ్నలు...

ఎవడి కులం గొప్పది... ఎవడి మతం గొప్పదీ అంటూ...
భారతీయ ఐక్యతకు తూట్లు పొడుస్తుంటే...
అవకాశ వాదులు చూస్తు ఊరుకుంటారా?

ఐక్యతే లేకపోతే అమాంతం తన్నుకు పోరా??
ఈ ప్రశ్నలకు బదులు వెతుకుతూ ఇలాగే జీవిద్దామా?
మన జాతి గొప్పదని ప్రపంచానికి చాటుదామా?

**- ఆశన్నగారి ఆనందీశ్వరరెడ్డి**
8179192999



## విష సర్పాల సంచారం!

ఆకుపచ్చని లోయలో
నిలువెత్తు విష సర్పాల సంచారం
మతం ముసుగేసుకున్న ఉన్మాదాన్ని చూసి
ప్రపంచమే నెవ్వరపోతున్నది!
సర్పయాగం ఒకటి మొదలుపెట్టండే
కునుకు లేని జీవితానికి స్వస్తి పలకలేము!
లేత ఇల్లాలు రోదన చెవుల్లో
నిద్ర స్థితిలోనూ మారుమోగుతున్నది
కళ్ళముందే తండ్రిని వివస్త్రుని చేసి
నిలువునా కాల్చేస్తుంటే
ఆ పసి గుడ్డు విహ్వలత్వం
ముద్ద నోట్లో దిగనివ్వడం లేదు!
ఉదారవాదానికి చెల్లు చీటీ రాయండే
దేశ సరిహద్దులు తలెత్తుకోలేవు
సామరస్యం సకలజనుల సౌభాగ్యం
నా బోటి వాళ్లకు వాంఛనీయమే!
చీడ పురుగులను ఏరిపారేయండే
నా వాంఛిత కల నెరవేరదు
బిడ్డలను పోగొట్టుకున్న దేశానికి తెలుసు
ప్రతీకారేక్ష ఎంత అవశ్యమో!
వాడు సవాలు విసిరుంటే బాగుండేది
మూతోడ్ జవాబు చెప్పేవాళ్ళం
కుట్రలకు తెరదీశాడు
కనికరమక్కరలేదు!
తేరుకున్న దేశం ఒక్కటై నిలిచింది
మనం ఈసారి కొట్టే దెబ్బకు
హిమాలయాల ఆవల
సువిశాల శ్మశానాలే విస్తరించాలి!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

## అమానవీయతదే మతం?

వాళ్ళు ప్యాంటు విప్పమన్నారు
నేను మనసు విప్పి చూశాను
మతం తెలుసుకోవాలనుకున్నప్పుడే
తెలిసిపోయింది!
ఈ భూమ్మీద ఏ మతస్తులూ వారు కాదు
అసలీ భూమ్మీద ఉండదగ్గ మనుషులే కాదు
వాళ్ళకేవాదం లేదు
నరమేధం తప్ప!
తుపాకీ వాదానికి మతం ఉందంటే
మనిషన్న వాడెవడూ నమ్మడు గాక నమ్మడు
నువు హిందువా ముస్లిమా అని అడిగినపుడే
వాడు మనిషా జంతువా అని అడగాలనిపించింది
నేను మనిషినని నాకు తెలుసు
వాడు మృగమని వాడికీ తెలుసు
అందుకే వాడి తుపాకీ గర్జించింది..
నా కుటుంబం వేదనతో ఆక్రోశించింది!
యమభటులు రక్షకభటుల్లా వచ్చి భక్షించి
వెళ్లిపోయేరు
వినోదం విషాదమై ఎన్నో కుటుంబాలు
కొండలే గుండెలు బాదుకొనేలా
మంచే మండిపోయేలా ఆరిపోయేయి
మానవత్వం సిగ్గుపడి ఎక్కడో దాక్కుంది!
వెదికి తీసుకురావాలి
విచారించి వివరాలు అడగాలి..
మా పంచప్రాణాలు తీసినా సర్వమత
సమానత్వమే మా ఆరోప్రాణమని చెప్పాలి!

**- భీమవరపు పురుషోత్తమ్**
9949800253

## చూసావా

చిగురుటాకులా వొణుకుతున్న జనజీవన దృశ్యం
అమాయకప్రాణాలే కుంచలైగీసిన రక్తవర్ణచిత్రం
నాగరిక సమాజానికి తగిలిన పెనుగాయం
గణతంత్ర వ్యవస్థ పాడిన మహా విషాదగేయం
చూసావా
సర్వోన్నతజాతికి హేయం
స్వేచ్ఛగా యథేచ్ఛగా
గుండాలు గుడ్లురిమిన హింసాకాండ నిర్వహణలో
ఘోరాకలి మిగిల్చిన వికృతకళాకేళి
నేరజ్వాల రగిల్చిన భయానక మృత్యురవళి
చూసావా
ఎడతెగనిహింస
క్షతగాత్రమైన శాంతిహంస
కుల మత వర్గ వర్ణ తెగ కాంక్ష
విశ్వ శ్రేయాన్ని బలిపెడితే
కుత్తుకలు తెగిపడి రక్తాలు ధారకట్టి
అశాంతి చెలరేగితే
కంటక రహదారికి దారిచూపేది
లౌకిక భువన భవన నిర్మాణానికి రాల్లెత్తేకూలీలు
విశాల భారత నందన వనమాలీలు

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# రైతులు అధైర్య పడొద్దు,ఆందోళన చెందొద్దు

- ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2 లారీల ఏర్పాటు
- అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 24 (మనం ప్రతినిధి) :** యాసంగి పంట కొనుగోలు లో వేగం పెంచాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతముగా జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు 246 కొనుగోలు కేంద్రాలకు గాను 244 కేంద్రాల ప్రారంభం చేసి 224 కొనుగోలు కేంద్రాల నుంచి 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసిల్దార్ లు సిరిసిల్లలో అపెరల్ పార్క్ లో మరియు ఇతర చోట్ల అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గుర్తించి ధాన్యం తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రానున్న 10 రోజుల్లో వర్షాలు లేవనీ వాతావరణ శాఖ వెల్లడించినందున రైతులు ఆందోళన చెందవద్దని, అన్ని సెంటర్లలో టార్పాలిన్ కవర్లు, అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో పెట్టుకొవాలని అన్నారు.సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని అన్నారు.జిల్లాలో 500 లారీలు అందుబాటులో ఉన్నందున ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2 లారీలను పెట్టాలని, ధాన్యం రవాణా ఎటువంటి ఇబ్బందులు ఉండవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డి.ఎం.పౌర సరఫరాల శాఖ రజిత, అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్, ఏ.పి.ఎం పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు న్యాయం చేయడానికే వక్ఫ్ సవరణ చట్టం




జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి

**మంచిర్యాల,ఏప్రిల్ 24( మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పై ముస్లింలలో అపోహలు తొలగించి పేద ముస్లింలకు న్యాయం చేయడానికి మరియు అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్ ఆస్తులను కాపాడటానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ వక్ఫ్ సవరణ చట్టం తీసుకువచ్చిందని వివరించాలని బీజేపీ శ్రేణులకు మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ సూచించారు . మంచిర్యాల పట్టణం లోని హోటల్ స్నేహ ఇన్ లో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సెమినార్ మరియు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అవగాహన కార్యక్రమానికి బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి తో పాటు ముఖ్య అతిథిగా జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి , బీజేపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చింత సాంబమూర్తి , జిల్లా సంఘటన ప్రభారీ బద్దం లింగారెడ్డి , పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ కంటెస్టెడ్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ లు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు అంబెడ్కర్ జయంతి ఉత్సవాలను ప్రతి బూత్ స్థాయిలో నిర్వహించాలని కోరారు . ఈ సందర్భంగా ఈ బీజేపీ జిల్లా సమావేశం లో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరగౌడ్ లు సన్మానం చేశారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి

# పోలీస్ శాఖ కట్టుబడి ఉంది



- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 24 (మనం ప్రతినిధి) :** శాంతి భద్రతల పరిరక్షణకు ఎప్పుడూ ముందుండే పోలీస్ సిబ్బంది,అధికారులకు మానసిక స్థితి ఎంతో కీలకం వారి మానసిక ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ అవశ్యకతగా గుర్తించి రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో ప్రఖ్యాత మానసిక నిపుణులు డాక్టర్ అశోక్ కుమార్, టీం చే మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిదిగా జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు.ఈఅవగాహన సదస్సులో పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ మానసిక ఒత్తిడులపై సమగ్ర అవగాహన ఇచ్చారు.ముఖ్యంగా నిరంతర ఒత్తిడిలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎలాంటి మానసిక సమస్యలు ఎదురవుతాయో, వాటిని ఎలా గుర్తించాలి అనే విషయంపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్,ఆర్మడ్ పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమని అట్టి సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.సిబ్బంది అధికారుల మానసిక స్థితి ,మానసిక ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ అవశ్యకతగా గుర్తించి రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాలమేరకు జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి మానసిక ఆ అగహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్య వుంటే ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకరవలని ఆయా సమస్యల పరిష్కరనికి కృషి చేయడం జరుగుతుందన్నారు.తాత్కాలిక ఆనందాల కోసం ప్రాణాలను, కుటుంబ సభ్యులను ప్రమాదంలో పెట్టవద్దని అధికారులు, సిబ్బంది విరామ సమయంలో కుటుంబలతో గడపాలని తెలిపారు.మహిళ సిబ్బందికి సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుందని,మహిళ సిబ్బందికి అన్ని రకాల అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు.నిత్యం యోగ,వ్యాయామం లాంటివి అలవాటు చేసుకోవడం ద్వారా ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదురుకోవచ్చని అధికారులకి, సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆత్మహత్యలు నివారణ సంస్థ చైర్మన్ డాక్టర్ అశోక్, సభ్యులు రామకృష్ణ ,సైకాలజిస్ట్ లు శైలజ,రామోజిరావు, బోడా అరుణ,సి.ఐ మొగిలి, మధుకర్, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు రమాకాంత్, రామ్మోహన్, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్, ఆర్.ఎస్.ఐ లు శ్రవణ్, సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడి హేయమైన చర్య

- వంచ శ్రీనివాసరెడ్డి



**కరీంనగర్ టౌన్,ఏప్రిల్24( మనం న్యూస్):** 27 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అని టిడిపి కరీంనగర్ నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ లోని పహల్గాం లో జరిగిన ఉగ్రవాదుల దాడిని తెలుగుదేశం పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తీవ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. మరణించిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకొని అండగా నిలవాలని క్షతగాత్రులకు వైద్యం అందించాలని కోరారు.

# భూభారతితో రైతులకు న్యాయం



- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**శంకరపట్నం (ఏప్రిల్ 24) మనం న్యూస్:** ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూభారతి చట్టంతో రైతులకు న్యాయం చేకూరుతుందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారు శ్రీవెంకటేశ్వర గార్డెన్స్లో గురువారం భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ చట్టం అమలైతే 95 శాతం మంది రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు పాల్గొన్నారు.

### చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదం సమాజ విధానం కావాలి

- నమిలకొండ ప్రభాకర్



**కరీంనగర్ టౌన్,ఏప్రిల్24( మనంన్యూస్):** పద్మశ్రీ వనజీవి రామయ్య దశదిన ఖర్మ సందర్భంగా రామయ్య ఆశయమైన వృక్షో రక్షతిః రక్షితః అన్న నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర శాఖ కోశాధికారి నమిలకొండ ప్రభాకర్ గురువారం తమ ఇంటి ఆవరణలో మొక్కను నాటి జీవకోటికి ప్రాణవాయువు ప్రదాతగా నిలిచే చెట్లను పెంచడం ద్వారా పచ్చదనాన్ని పర్యావరణాన్ని పరిరక్షించే సామాజిక యజ్ఞంలో సమాజం సంపూర్ణ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. పౌరసమాజం 'స్వచ్ఛంధ సంస్థలు 'ప్రభుత్వం పద్మశ్రీ వనజీవి రామయ్య ఆశయాల సాధనకు కృషి చెయ్యాలన్నారు.చెట్లు ప్రగతికి మెట్లు అన్నది నినాదం కాకుండా వ్యక్తి సమాజ విధానం కావాలని పిలుపు నిచ్చారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కరీంనగర్‌టౌన్, ఏప్రిల్24 (మనం న్యూస్) :** నగరంలోని కట్ట రాంపూర్ లో గల కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు విచ్చేసి తమ చిన్నారులు గ్రాడ్యుయేషన్ డ్రెస్ లలో సర్టిఫికెట్ తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ బోర్డు వద్ద తమ చిన్నారులను గ్రాడ్యుయేషన్ డ్రెస్ లో సెల్ఫీ ఫోటోలతో పాఠశాల ఆవరణలో చాలా బిజీగా గడిపారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలలో కూడా ప్రతి ప్రోగ్రాంను సెలబ్రేట్ చేసుకుంటూ తక్కువ ఫీజులకే అత్యున్నత విద్యను అందిస్తున్నామని, అలాగే పాఠశాలలో ఏ కార్యక్రమం నిర్వహించిన అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# అభాగ్యులకు అండగా ఆదరణ సేవా సమితి సేవలు



**కరీంనగర్, ఏప్రిల్24 ( మనంబ్యూరో):** కరీంనగర్ పట్టణంలోని జ్యోతినగర్ కు చెందిన పెయింటింగ్ కార్మికుడు అక్కిరాజు సురేష్ అనే వ్యక్తి ఇటీవల ఒక ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి క్రిందపడి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆధరణ సేవసమితి అధ్యక్షురాలు కర్రె పావని-రవి ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం రోజున వారు ఉంటున్న ఇంటికి వెల్లి ఆకుటుంబానికి వీల్ చైర్ ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు, 25 కిలోల బియ్యం బస్తాను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చెశారు. ఈ సందర్భంగా ఆధరణ సేవసమితి అధ్యక్షురాలు కర్రె పావని- రవి మాట్లాడుతూజ్యోతి నగర్ కు చెందిన పేయింటింగ్ కార్మీకుడు సురేష్ ఒక భవణానికి రంగులు వేస్తూప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కింద పడడంతోఅతని వెన్నెముకకు తీవ్ర గాయం అయిందని అదేవిధంగా రెండు కాళ్లు చచ్చిబడిపోయి.. నడవలేని స్థితిలో చాలా ఇబ్బందుల్లో ఉన్నాడని, అతనికి భార్యతో పాటు ఇద్దరు, ఆడపిల్లలు ఉన్నారని, రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం సురేష్ కు జరిగిన ప్రమాదంతో దిక్కుతోచని స్థితిలో ఉందని వారన్నారు. ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు కర్రె పావని - రవితో పాటు దాతలు సంతోష్ రెడ్డి - సరస్వతి, సంపత్, మరియు వీణ లు పాల్గొన్నారు.

# విఎన్ఆర్ ఫౌండేషన్ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ




**కరీంనగర్,ఏప్రిల్24 (మనంబ్యూరో):** జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒలంపియాడ్ ఫౌండేషన్ కోచింగ్ లో భాగంగా రామడుగు మండలం వెదిరలోని అల్ఫోర్స్ హై స్కూల్ ని సందర్శించి ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి 9వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ , పుస్తకాలను అల్ఫోర్స్ వారి ఆధ్వర్యంలో విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు 21 రోజులపాటు ఉచిత భోజన వసతితో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే చక్కటి ప్రణాళికలతో కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.మొదటి దశలో 350 మంది విద్యార్థులో 80 మంది విద్యార్థులు ఎంపికయ్యారని , ఎంపికైన వారికి రెండో దశ లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ,ఏప్రిల్ 24 (మనం న్యూస్) :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వేములవాడలోని మైనార్టీ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు హేమంత్ వోకేషనల్ ఏంఎల్టీ మొదటి సంవత్సరంలో 496 మార్కులతో రాష్ట్ర మొదటి ర్యాంకు, ఆదిల్ షరీఫ్ ఎల్ఎండిటి లో 500కు 483 తో రాష్ట్ర రెండవ ర్యాంకు, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా సాధించిన 16 మంది విద్యార్థులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటి,రెండవ ర్యాంకులు సాధించడం అభినందనీయమని కొనియాడారు.ప్రజా ప్రభుత్వంలో విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం,ఐటిఐలు,స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.గత పది సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా గురుకులాల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, లెక్చరర్స్ పాల్గొన్నారు.

# గుర్తింపు లేని పార్టీల వివరాలు అందించండి

- భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్

**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 24 (మనం ప్రతినిధి):** ఏప్రిల్ 28 నాటికి రిజిస్టర్ గుర్తింపు లేని పార్టీల వివరాలు అందించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ అన్నారు.గురువారం భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ రిజిస్టర్ గుర్తింపు లేని పార్టీల నివేదిక పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు పొందని రాజకీయ పార్టీ వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు సేకరించి ఏప్రిల్ 28 నాటికి భారత ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని సూచించారు. రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలను మినహాయించి దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో జిల్లా ఎన్నికల అధికారులకు ఏప్రిల్ 22 న రిజిస్టర్ చేసుకుని గుర్తింపు లేని రాజకీయ పార్టీల వివరాల సేకరణ గురించి మార్గదర్శకాలు జారీ చేశామని, వాటిని తూచా తప్పకుండా పాటించాలని అన్నారు.రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు లేని రాజకీయ పార్టీల అధ్యక్షులకు సమాచారం అందించి ఎన్నికల కమిషన్ నిర్ణీత నమూనా ప్రకారం పార్టీ సంబంధిత వివరాల రిపోర్టు సంతకంతో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.మన దగ్గర ఉన్న వివరాల ప్రకారం గుర్తింపు లేని రాజకీయ పార్టీల అడ్రస్ లో సంబంధిత పార్టీ లేని పక్షంలో ఆ వివరాలను కూడా అందించాలని అన్నారు.ఈ సమావేశంలో సంబంధిత ఎన్నికల అధికారులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# భూభారతితో..భూసమస్యలకు చెక్

- ధరణితోనే భూముల పంచాయతీ
- జూన్ 2 నుంచి అమలు
- ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఫిర్యాదు చేయాలి
- రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్,ఏప్రిల్ 24,(మనం న్యూస్): భూభారతి పోర్టల్‌తో భూసమస్యలకు చెక్ పడుతుందని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలోని శుభం గార్డెన్స్‌లో నూతన ఆర్.వో.ఆర్.చట్టం, భూభారతి పోర్టల్ పై రైతులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి భూమి పంచాయతీలుండొద్దు అనే భూభారతిని తీసుకువచ్చామన్నారు. భూముల విలువలు పెరగటంతోనే భూసమస్యలు వచ్చాయన్నారు. ధరణీ వచ్చిన తర్వాత భూపంచాయతీలు ఎక్కువయ్యాయి అన్నారు. భూసమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకునే వారన్నారు. భూభారతితో ప్రతి భూమి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రభుత్వ భూములు ఎవరూ కబ్జా చేసినా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ భూమిని ఎవరూ కబ్జా చేసినా వారి వద్ద నుంచి భూమిని తీసుకుని అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని స్పష్టం చేసారు. ఎక్కడైనా పేదలకు భూములు దానం చేసి ఉండి దానం చేసిన వారు మళ్లీ గుంజుకున్న అన్నిటికి రికార్డులుంటాయిన్నారు. మీ ఏ సమస్య ఉన్న రెవెన్యూ అధికారుల వద్ద అప్లికేషన్ పెట్టుకుంటే మూడు నెలల్లో మీ సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. జూన్ 2 నుంచి భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో అమలు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్, ఆర్టీఏ మెంబర్ సూర్యవర్మ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, ఆయా శాఖల అధికారులు, తదితరులున్నారు.

### కోర్టుకు వెళ్లాల్సిన పని లేదు

భూసమస్యల రిష్కారానికి కోర్టుకు వెళ్లకుండా ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఆర్.వో.ఆర్.చట్టం, భూభారతి పోర్టల్ తోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. భూభారతి చట్టం పై రైతులందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలో రికార్డుల్లో సవరణ చేయడానికి ఆప్షన్ ఉంది అన్నారు. ప్రజావాణి, ధరణిలో తప్పు పడిన పేర్లు తొలగించే ప్రయత్నం చేసిన కాలేదని..ఇప్పుడు తప్పుగా వచ్చిన రికార్డులు ఉన్న పేరు ఇద్దరిని పిలిచి నెల రోజుల్లో సమస్యను పరిష్కారం చేయవచ్చు అన్నారు. మ్యూటేషన్, రిజిస్ట్రేషన్, ఫోర్జరీ, కబ్జా భూములను కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. సర్వే హద్దుల పై భూధార్ కార్డు వస్తుందన్నారు. తహసీల్దార్ పాస్ చేసిన ఆర్డర్ ఆర్డీవో, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు అన్నారు. రైతులకు ఉచిత న్యాయసేవలు అందించనున్నారని తెలిపారు. మీ డాక్యుమెంట్స్ తీసుకువస్తే సమస్య అక్కడే పరిష్కారం అవుతుందన్నారు. గత సంవత్సరాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

- మే 21 లోగా జాబితాను సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ మను చౌదరి



సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 24, మనం న్యూస్: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను, బ్యాంకులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లతో రాజీవ్ యువ వికాస లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం కింద దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్దిదారుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సూచించారు. శుక్రవారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల స్క్రూటినీ చేయాలన్నారు. ఎస్. బి.ఐ., టి.జి.బి., యూనియన్ బ్యాంకులలో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. బ్యాంకర్ల వారీగా సిద్ధం చేసిన జాబితాను మే 21వ తేదీ లోగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ల్.డి.ఎం. హరిబాబు, డి.ఆర్.డి.ఓ. జయదేవ్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను గుర్తించాలి



హైదరాబాద్, ఏప్రిల్ 24(మనంన్యూస్): రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి లబ్ధిదారులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ఎన్.ఐ.సి. సమావేశ మందిరం లో మండల స్పెషల్ ఆఫీసర్లు,ఎస్.సి.,ఎస్.టి.,బి.సి.,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లా రాజీవ్ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు మండల స్థాయి కమిటీ పరిశీలించిన తర్వాత జిల్లా స్థాయి కమిటీ అప్లికేషన్లను తదుపరి క్షుణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా అర్హత గల లబ్ధిదారులను ఎంపిక చేయాలని, మండల కమిటీలు రేపటి నుండి సమావేశాలు జరిపి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద అప్లై చేసుకున్న అర్హులైన వారి అప్లికేషన్లను బ్యాంకుల వారిగా వేరు చేసి వారి సిబిల్ స్కోరు వివరాలను ఆయా బ్యాంకులు పరిశీలించాలని, ఈ పథకానికి అర్హత ఉన్న వారి అకౌంట్ల వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని బ్యాంకర్లకు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాజీవ్ యువ వికాసం నోడల్ అధికారి, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ వెంకటరెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిఆర్డిఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఇందిర, ఎస్.సి.అభివృద్ధి శాఖ డి.డి.సుదర్శన్,మండల స్పెషల్ ఆఫీసర్లు సి.పి. ఓ రవీందర్,డి.డి.ఉద్యాన శాఖ వేణుగోపాల్,జిల్లా యువజన,క్రీడల అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మతం అడిగి మరీ దాడులా?

- రాహుల్ విదేశీ పర్యటనలో ఉన్న ప్రతిసారీ దాడులు
- ఎంఐఎం నేతల చేతుల్లో వక్ఫ్ భూములు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



సిద్దిపేట, ఏప్రిల్ 24, మనం న్యూస్ ప్రతినిధి: హిందూ ధర్మం పరమత సహనాన్ని ముమ్మాటికీ పాటించమని చెబుతుంది. అదే సమయంలో ధర్మాన్ని కాపాడుకునేందుకు హింసా అనే ఆయుధాన్ని కూడా వాడమని చెప్పింది. ఇక మీదట దాడులను ఉపేక్షించం.. సహించబోం. ముమ్మాటికీ ప్రతీకారం తప్పదని మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఒక వైపు పహల్గాంలో మతం పేరుతో జరిగిన టెర్రరిస్టుల ఘాతకాలు ఉమ్మడి జిల్లాలోనూ హిందూ దేవాలయాలపై ఒక వర్గం వ్యూహాత్మకంగా చేస్తున్న దాడులను తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. మతం అడిగి మరీ దాడులకు పాల్పడుతున్నారంటే వారి వైఖరి స్పష్టమని, ఇలాంటి వారికి ముమ్మాటికీ బదలా ఇచ్చి తీరుతామన్నారు. హిందూయేతర వ్యక్తులపై చిన్నచిన్న సంఘటనలు జరిగితే గొంతులు చించుకొని అరిచే సూడో సెక్యులర్లు అయిన స్టాలిన్, ఉదయనిధి, ప్రకాష్ రాజులు ఇప్పుడు నోరెందుకు మూసుకున్నారో స్పష్టం చేయాలన్నారు. పదేండ్ల పాటు మోదీ నేతృత్వంలో దేశం అత్యంత భద్రంగా ఉందని, అందాల కాశ్మీరాన్ని, శాంతికి విఘాతం కలిగించాలని మతం అడిగి మరీ దాడులకు ఎగబడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టే పరిస్థితి లేదన్నారు. అంబేద్కర్ ను వ్యతిరేకించింది ముమ్మాటికీ కాంగ్రెస్ కమ్యూనిస్టులేనని, చివరికి అంబేద్కర్ ఎన్నికల్లో నిలబడితే ఇరువురూ కుమ్మక్కై ఓడించిన పరిస్థితి అందరికీ తెలుసన్నారు. మన దేశం నుండి వచ్చిన మతాలెప్పటికీ దేశాన్ని కాపాడలేవని నాడు అంబేద్కర్ చెప్పిన మాటలు ఒక్కసారి గుర్తుంచుకోవాలన్నారు. భారత రాజ్యాంగ పుస్తకంలోనూ రాముడు, కృష్ణుడు, భగవద్గీత బొమ్మలున్నాయని, దీన్ని బట్టి హిందుత్వం మతం కాదు, ధర్మం అని గమనించాలన్నారు. కానీ కొంతమంది ఏమీ తెలియని కాంగ్రెస్ మూర్ఖులు రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తామే రక్షకులమంటూ ఫోజులు కొడుతున్నారన్నారు. రాహుల్ విదేశీ పర్యటనలో ఉన్న ప్రతీసారి టెర్రరిస్టుల ఘాతకాలు జరుగుతున్నాయంటే వీరి వెనుక కాంగ్రెస్ ఉందన్నది సుస్పష్టమన్నారు. మదర్సాల పేరుతో జరుగుతున్న కుట్రలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

### దేశాన్ని విఛ్చిన్నం చేసేందుకే ఉగ్రదాడి



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 24 (మనం న్యూస్): దేశాన్ని విఛ్చిన్నం చేసేందుకే పాకిస్తాన్ ఇస్లాం మత చాందసవాద ఉగ్రవాదులు మరణ హోమం సృష్టించారని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, యువ న్యాయవాది జక్కనపల్లి గణేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాం ప్రాంతంలోని బైసరీస్ వ్యాలీలో పాకిస్తాన్ ప్రేరేపిత ఇస్లాం మత చాందస ఉగ్రవాదులు భారత యాత్రికుల పైన జరిపిన మారణ హోమాన్ని ఖండించారు. మతం పేరుతో మారణ హోమం సృష్టించాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. తమ ఉనికిని చాటుకోవడానికి కాశ్మీర్ లో రక్తపాతం సృష్టించి భారతదేశాన్ని అస్థిరపరిచేందుకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నం సఫలంకాదన్నారు.

### మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

కొండపాక, ఏప్రిల్ 24, మనం న్యూస్: మతిస్థిమితం లేని మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం సిరసనగండ్లలో గురువారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన చెంది లక్ష్మి (56) అనే మహిళ కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతుంది. కొద్ది రోజులకు చనిపోతానని బెదిరించేది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రానందున కుటుంబ సభ్యులు వెతుకుతుండగా వారి వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనబడింది. వెంటనే ఆమెను కిందికి దింపి సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా గమనించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కొడుకుకు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విద్యాసాగర్ తెలిపారు.

## ఉగ్రమూకల దాడి అమానుషం

### హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

మీరుదొడ్డి, ఏప్రిల్ 24, మనం న్యూస్: జమ్మూలోని ఫహల్ గాన్ లో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మ శాంతి కలగాలని మిడిదొడ్డి మండల కేంద్రంలో హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదులు దొంగ చాటున వచ్చి పిరికిపంద చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. టెర్రరిస్టులకు వ్యతిరేకంగా దేశం మొత్తం ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఉగ్రవాదులు దొంగ దెబ్బతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి గ్రామ హిందూ సేవా సమితి సభ్యులు ఐలయ్య, దేవరాజు, లింగాల సదానంద రెడ్డి, పూస రాజు పాల్గొన్నారు.



# కొవ్వొత్తులతో బిఆర్ఎస్ పార్టీ ర్యాలీ




మంచిర్యాల, ఏప్రిల్ 24 (మనం న్యూస్): జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మరియు మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల నియోజక వర్గం ఆధ్వర్యంలో మంచిర్యాల మాజీ ఎంఎల్ఏ నడిపెల్లి దివాకర్ రావు, రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ ని నిర్వహించారు . ఈ కొవ్వొత్తుల ర్యాలీ మంచిర్యాల మార్కెట్ రోడ్ నుంచి మంచిర్యాల మున్సిపాలిటీలోని గాంధీ పార్క్ గాంధీ విగ్రహం వద్ద(రైల్వే స్టేషన్ రోడ్డు) వరకు కొనసాగించారు.రెండు నిమిషాలు వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు .ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోవాలని అన్నారు .ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వము తగు చర్యలు తీసుకోవాలని అన్నారు .ఈ కొవ్వొత్తుల ర్యాలీలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

# యాదవుల రాజకీయ చైతన్యమే లక్ష్యం



మెట్ పల్లి ఏప్రిల్ 24 (మనం న్యూస్): యాదవులలో రాజకీయ, సామాజిక చైతన్యం తీసుకురావడమే లక్ష్యమని. యాదవ సంఘం అడ్ హాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఘన వేణి మల్లేష్ యాదవ్ అన్నారు గురువారం ఆయన మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో జరిగిన యాదవ సంఘ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల రాజకీయ చైతన్య మే లక్ష్మన్నారు. ఈ సమావేశంలో మండల ఇంచార్జి లు తొట్ల చిన్నయ్య యాదవ్, తిప్పన వేణి రవి యాదవ్, శంకర్ యాదవ్, గుండెల నాగేష్ యాదవ్, కొత్తూరి సురేష్ యాదవ్, ముక్కెర లింబాద్రి యాదవ్ లతో కలిసి సభ్యత్వ నమోదుతో చేశారు. సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం జనాభా ప్రాతి పదికన యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయాలు చర్చించారు. అనంతరం జగ్గాసాగర్ గ్రామ యాదవ సంఘ సభ్యులు. మొత్తం 56 మంది సభ్యత్వం తీసుకోగ వారికి ఇంచార్జిలతో కలిసి సభ్యత్వ రసీదులందించారు. ఈకార్యక్రమంలో జగ్గాసాగర్ గ్రామ యాదవ సంఘ పెద్ద మనుషులు, సభ్యులు కంబ నరేష్ యాదవ్, మాదం రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

# భూభారతితో గడువు లోపు భూ సమస్యలు పరిష్కారం

- రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు
- ఉచిత న్యాయ సేవలు
- కలెక్టర్ క్రాంతి వల్లూరు




సంగారెడ్డి, ఏప్రిల్ 24(మనంప్రతినిధి): నిర్ణీత గడువు లోపు భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం దోహదపడుతుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. భూమి హక్కుల రికార్డులలో ఏవైనా లోటుపాట్లు, తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ నూతన ఆర్.ఓ.ఆర్ -2025 చట్టం వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం లోనినాగలిగిద్ద,మనూర్,సిర్గాపూర్ , మండల కేంద్రాలలో భూభారతి చట్టంపై గురువారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవరెడ్డి , ఈ కొత్త చట్టం వల్ల రైతులకు, ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, చట్టంలో పొందుపర్చిన కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ధరణి రికార్డులను భూభారతిలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరికైనా భూముల రికార్డుల విషయంలో తప్పులు ఉంటే, ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. ఈ అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తప్పులను సవరిస్తారని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. మొదటి అంచెలో ఆర్డీఓ అప్పీలును పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని, అయినా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని, ల్యాండ్ ట్రిబ్యునల్ ను కూడా అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టం అవకాశం కల్పిస్తుందని వివరించారు. అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. రైతులు భూ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, నిర్దిష్ట కాల వ్యవధిలో వాటిని పరిష్కరించి, రైతుల భూములపై వారికి హక్కులు ఏర్పరుస్తూ, వారికి పూర్తి భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టా పాస్ బుక్కులలో సమగ్ర వివరాలతో, హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాప్) పొందుపరుస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టా పాస్ బుక్కుకు జత పరుస్తారని అన్నారు. ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూధార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఈ చట్టంలో ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు కూడా హక్కుల రికార్డు ఉంటుందన్నారు. ఎవరైనా మోసపూరితంగా హక్కుల రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే అలాంటి పట్టాలను రద్దు చేసే అధికారం భూభారతి ద్వారా అధికారులకు కల్పించారని వివరించారు. ధరణిలో కొన్ని భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని, అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీఓ లకు దరఖాస్తులు చేసుకుని సమస్యలు పరిష్కరించుకునేలా భూభారతి వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు.. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను కోర్టు స్టే విధించడం వల్ల ధరణిలో పరిష్కరించేందుకు అవకాశం లేకపోయిందని, ప్రస్తుతం కొత్త ఆర్ ఓ ఆర్ చట్టంలో పెండింగ్ దరఖాస్తులను ఆర్డీఓలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అర్హులైన రైతులు ఈ చట్టంపై అవగాహనను పెంపొందించుకుని, భూ సమస్యలు ఉంటే గ్రామ సభలలో అధికారులకు అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని, ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో అసైన్మెంట్ కమిటీలు పునరుద్ధరణ చేశారని,గత ప్రభుత్వా భూ చట్టాల్లో ఎన్నో అక్రమాలు చేసిందని,భూ భారతి చట్టం కోసం దేశం లో ఎన్నో భూ చట్టాలు అధ్యయనం చేసి ఈ చట్టాన్ని రూపొందించారని,నారాయణఖేడ్ నియోజక వర్గంలో 32 కోట్ల రూపాయలు రుణ మాఫీ జరిగిందని,ఈ ప్రాంతానికి త్రాగునీటి అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ అని , సబ్సిడీపై చాలా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసిం దన్నారు. నారాయణఖేడ్ ప్రాంతానికి వైద్య,విద్య వ్యవస్త చాలా బలోపేతం అయిం దన్నారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ మాధురి,జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ విష్ణు సాగర్, రెవెన్యూ అధికారులు, రైతులు, రైతు సంఘాలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మంచిర్యాల, 24, ఏప్రిల్, ( మనం న్యూస్): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో కోడా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కోరారు. గురువారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో గురువారం రోజున ఆర్కే-5 గనిలో గేట్ మీటింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు శరవేగంగా ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. దేశానికి స్వాతంత్రం రాకముందు కార్మిక వర్గం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కార్మిక వర్గం కోసం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్రలు చేస్తున్నదని ,ఈ కుట్రను తిప్పుకొట్టదానికి కార్మికులంతా కార్మిక సంఘాల భేదం లేకుండా పాల్గొని సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యంతో స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, జిఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పాల్గొన్నారు.

## యస్.బి.ఐ.టి. లో నేడు జాతీయ స్థాయి ఆరోహన్ టెక్నికల్ సింపోజియం



ఖమ్మం, ఏప్రిల్ 24(మనం న్యూస్): ఈ నెల 25వ తేదీన ఆరోహన్ 2025 పేరుతో యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నికల్ సింఫోజియంను నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా యస్.బి.ఐ.టి విద్యార్థులతో పాటు ఖమ్మం జిల్లాలోని ఇతర విద్యార్థులకు సాంకేతిక పోటీలైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, స్లైడ్ డెక్, కోడింగ్ క్లబ్, టిక్నికల్ క్విజ్తో పాటు ట్రేజర్ హంట్, ఫ్రేమ్వర్క్స్, స్నాప్ షాట్ మొదలగు పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. వీటితో పాటు ఇన్నోవేటివ్ ప్రాజెక్ట ప్రదర్శన కూడా ఏర్పాటుచేసారని తెలిపారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీయటానికి, వారు సాంకేతిక అవగాహన పెంపొందించుకోవటానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థిని విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

# నూతన ఆర్.ఓ.ఆర్.-భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- డిజిపిఎస్ సర్వేతో నూతన భూ కొలతలు
- లక్షకు పైగా పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం
- భూ హక్కుల రికార్డుపై అభ్యంతరం ఉంటే అప్పీల్ చేసుకునే వ్యవస్థ ఏర్పాటు
- ముజ్జుగూడెం రైతు వేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్



ఖమ్మం/నేలకొండపల్లి, ఏప్రిల్ -24 (మనం న్యూస్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్.ఓ.ఆర్. భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం రైతు వేదిక వద్ద నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం-2025 రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యులు, అడ్వకేట్ సునీల్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,₹ భూమి స్వభావం, కొలతలు, ఎక్కడ ఉంది తేలితేనే భూ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. 1910 నుంచి 1930 వరకు నైజాం కాలంలో భూ సర్వే జరిగిందని అన్నారు. భూ సమస్యల పరిష్కారం సర్వేతోనే సాధ్యం అవుతుందని, భూ సర్వేను భూ భారతి చట్టంలో పొందుపర్చడం జరిగిందని అన్నారు. జి.పి.ఎస్. సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి సర్వేయర్లను కేటాయించి సర్వే పూర్తి చేస్తామని, మండలంలో సర్వేయర్ సర్వే సరిగా జరిగినట్లు ధృవీకరణ జరుపుతారని అన్నారు. భూమి కొలతలు, ఎక్కడ ఉందో తెలిసిన తర్వాత యాజమాన్య హక్కు తేల్చాల్సి ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు లక్ష పైగా సాదా బైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీరికి పట్టాలు అందించేందుకు భూ భారతి చట్టంలో సౌలభ్యం కల్పించామని అన్నారు. జ వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ చేసే ముందు తప్పనిసరిగా కుటుంబ సభ్యులందరికీ నోటీసులు జారీ చేయాలని, తర్వాత మాత్రమే భూ హక్కుల బదలాయింపు జరగాలని కొత్త చట్టంలో చేర్చుకున్నామని, దీని వల్ల వివాదాలకు తావు లేకుండా ఉంటుందని అన్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునేందుకు గతంలో సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ కోర్టులను ప్రవేశ పెట్టిందని అన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలు అందేలా చట్టంలో అధికారులపై బాధ్యత పెట్టడం జరిగిందని అన్నారు. భూ హక్కుల రికార్డు మ్యూటేషన్ దరఖాస్తులను 30 రోజుల లోగా పూర్తి చేయాలని, చేయని పక్షంలో దరఖాస్తు ఆటోమేటిక్ గా ఆమోదం పొందుతుందని అన్నారు. భూ భారతి చట్టంపై అడ్వకేట్ సునీల్ మాట్లాడుతూ,₹ ధరణి వ్యవస్థ వల్ల వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 2025 ఏప్రిల్ 14న నూతన ఆర్.ఓ.ఆర్. భూ భారతి చట్టం తీసుకొని వచ్చిందని అన్నారు. భూ భారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, చట్టం ప్రకారం మనం దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం త్వరగా సాధ్యం అవుతుందని అన్నారు. భూ హక్కుల రికార్డు సవరణ కోసం భూ భారతి చట్టం సెక్షన్ 4 సబ్ సెక్షన్ 5, 6 ప్రకారం దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లోగా పరిష్కారం అవుతుందని, గతంలో ఏమైనా సవరణలు చేయాలంటే సివిల్ కోర్టుకు వెళ్ళాల్సి ఉండేదని అన్నారు. తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన సాదా బైనామా భూముల పట్టాలు అందించాలని గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తుల పరిష్కారంపై ధరణిలో అవకాశం లేనందున హైకోర్టు స్టే విధించిందని, 9 లక్షల 24 వేల పెండింగ్ సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టం సెక్షన్ 6 క్రింద ఆర్డిఓ లకు బాధ్యతలు అందించిందని అన్నారు. చిన్న సన్న కారు రైతులు 2014 కంటే ముందు కొనుగోలు చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు మాత్రమే సాదా బైనామా పట్టా లభిస్తుందని అన్నారు. గడిచిన 12 ఏళ్ళలో సాదా బైనామా భూముల అనుభవంలో ఉన్న వారికి మాత్రమే దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు. మన సేల్ డీడ్ మనమే రాసుకోవచ్చని, మ్యూటేషన్ పై ఏదైనా అభ్యంతరం ఉంటే ఆర్డిఓ దరఖాస్తు చేసుకోవాలని, ఆర్డిఓ ఇచ్చే పరిష్కారంపై సంతృప్తి లేకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేయవచ్చని తెలిపారు. భూమి పటం ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ప్రతి మండలంలో లైసెన్స్ సర్వేయర్ ఉంటారని, అతనితో భూ సర్వే చేయించి పటం తయారు చేసుకోవాలని అన్నారు. వారసత్వం ప్రకారం ధరణిలో విచారణ లేకుండా పట్టాలు జరిగేవని, నేడు భూ భారతి చట్టం ప్రకారం తహసిల్దార్ దరఖాస్తు అందించిన 30 రోజులలోగా విచారణ చేసి పట్టాలు అందించాలని, లేకపోతే 31 వ రోజు ఆటోమేటిక్ గా పట్టా వస్తుందని అన్నారు . రాబోయే రోజుల్లో వచ్చే భూముల సమస్య పరిష్కారం కోసం భూమి వివరాలు తెలిపేలా భూదార్ నెంబర్ వ్యవస్థ ఏర్పాటు అవుతుందని అన్నారు. భూ హక్కుల రికార్డుపై అప్పీల్ లో వచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే కోర్టులో కేసు వేసేందుకు న్యాయ సహాయం కూడా భూ భారతి చట్టం కల్పించిందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం పహాణి రాసి పెట్టాలని అన్నారు. ధరణి పాస్ పుస్తకాలు ఉంటే, నూతన చట్టం ప్రకారం కొత్త పాస్ పుస్తకం తెచ్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో ఎర్రయ్య, మండల వ్యవసాయ అధికారిణి రాధ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతి హాస్పిటల్‌కి ఐఎస్ఓ, ఎన్ఏబిహెచ్ గుర్తింపు



- పలువురు అభినందనలు

ఖమ్మం , ఏప్రిల్ 24(మనం న్యూస్): ఖమ్మం నగరంలోని నెహ్రు నగర్ లోని ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ కి ఐఎస్ఓ, ఎన్ఏబిహెచ్ గుర్తింపును పొందినట్లు హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ కేసోజ్ భరత్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరం తో పాటు ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వరంగల్ నల్గొండ కృష్ణా జిల్లాలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తూ పేద మధ్యతరగతి ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించామని పేర్కొన్నారు. అందరికీ అతి తక్కువ ఫీజులు తో వైద్యం చేసినందుకు యాజమాన్యాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అభినందిస్తూ ఐఎస్ఓ డైరెక్టర్ అభినందనలు తెలిపారని డాక్టర్ భరత్ బాబు తెలిపారు .నాణ్యత నిజాయితీ నిబద్ధత కలిగిన వైద్యులు ఉండడంతో ప్రశాంతికి అరుదైన గౌరవం లభించిందని ఈ సందర్భంగా వైద్యులకు డాక్టర్ భరత్ బాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ లో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో వైద్యులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ బసవయ్య చౌదరి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హేమంత్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ జీవన్ కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ లో చేపలు మాయం

**నిరాశపరిచిన చేపల వేట**

వైరా, ఏప్రిల్ 24(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉచిత చేపలను పంపిణీ చేస్తుంది. ఈ క్రమంలో గత ఏడాది వైరా రిజర్వాయర్లో 14 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విడుదల చేశారు. అధికారులు రిజర్వాయర్ల లో చేపల వేటకు గురువారం అనుమతి ఇచ్చింది. గురువారం నుండి సుమారు 500 నుండి 600 మంది మత్స్యకారులు వైరా రిజర్వాయర్లో చేపలు వేటకు దిగారు. ఎంతో ఆశతో వేటకు వెళ్లిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. గత సంవత్సర క్రితం ఒక్కొక్క మత్స్యకారుడు మూడు రోజుల చేపల వేటలో సుమారు లక్ష నుండి రెండు లక్షల రూపాయలు సంపాదించారు. కానీ గురువారం చేపల వేటలో మత్స్యకారులకి రెండు కేజీల నుండి 5 కేజీల వరకు చేపలు పడ్డాయి. గత ఆరు నెలల క్రితం ఉచితంగా పోసిన చేపలు ఏమైపోయాయి అంటూ మత్స్యకారులు ఆశ్చర్యానికి గురయ్యారు. పక్క గ్రామాల నుండి చేపలు కొనుక్కొని వెళ్దామని వచ్చిన చేపల ప్రియులకు నిరాశ మిగిలింది. గత సంవత్సరం వైరా రిజర్వాయర్లో ఉచితంగా చేపలు విడుదల చేసిన సందర్భాల్లో ఏమైనా అవకతవకలు జరిగాయా లేక రిజర్వాయర్లో రాత్రి వేళ అక్రమంగా చేపల వేట జరుగుతుందా అనేక అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాత్రిపూట చేపల వేటలో అధికారులకు ప్రమేయం ఉందని, అధికారులు కనుల్లోనే చేపల వేట జరుగుతుందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. 14 లక్షల చేప పిల్లలకు కనీసం 10 లక్షల చేప పిల్లలైనా పెద్దవిగా పెరిగి లాభాలు వస్తాయి అనుకున్న



మత్స్యకారులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా రిజర్వాయర్లు రాత్రి వేళలోచేపల వేట సాగిస్తున్న వారిని నియంత్రించుకుంటుంటే మత్స్యకారుల బ్రతుకు ఆగమ్య గోచరంగా ఉంటుందని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై డిఎఫ్ఓ శివప్రసాద్ ను వివరణ కోరగా తను ఫోను లిఫ్ట్ చేయలేదు. అలాగే వైరాలోని మత్స్య కార్యాలయానికి వెళ్ళగా తమకు సమాచారం తెలియదంటూ ఖమ్మంలో ఉన్న అధికారులను ద్వారా సమాచారం తెలుసుకోవాలని వారు సూచించారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి



- మాజీ ఎంపీ నామ

ఖమ్మం, ఏప్రిల్ 24(మనం న్యూస్)ః వరంగల్, ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఘనంగా జరిపేలా అందరూ కృషి చేయాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాల్గొని తెలంగాణ ప్రజలకు భవిష్యత్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని నామ తెలిపారు. కొత్త ఆలోచనలు, ప్రజా సమస్యలపై సమగ్ర పరిష్కార మార్గాలను ఈ సభలో కేసీఆర్ వెల్లడించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఐటీ, పారిశ్రామిక అభివృద్ధి నాడు రాష్ట్రానికి తీసుకు వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు నూతన తెలంగాణకు నాంది పలికినట్టు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. బస్సులు, ఇతర వాహనాల ద్వారా ప్రజలను తరలించేలా ఏర్పాట్లు ఆయా నియోజకవర్గ ఇంచార్జిల ఆధ్వర్యంలో చురుకుగా కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోన్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా గత రెండు దశాబ్దాల విజయాలను ప్రజల ముందుంచే ప్రస్తక్తి ఉందని ఆయన పేర్కొన్నారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు అంతా ఈ సభకు హాజరవ్వాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని ఒక ఉద్యమంగా భావించి, నిండు హృదయంతో ప్రతి కార్యకర్త ఈ సభ విజయానికి తన వంతు భాగస్వామ్యం అందించాలన్నారు. ఇది ఒక సాధారణ సభ కాదు, తెలంగాణ ప్రజల భవిష్యత్ కు దారి చూపించే వేదికగా నిలుస్తుందన్నారు.

## గోడౌన్ లను అకస్మికంగా పరిశీలించిన రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్



మధిర, ఏప్రిల్ 24(మనం న్యూస్): మధిర నియోజకవర్గం,మధిర మండలం దెందుకూరు,బోనకల్ మండలం చిరునోముల గ్రామాల్లోని గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహరావు,డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తో కలిసి గురువారం ఆకస్మికంగా సందర్శించారు.గోదాముల్లో ఉన్న సన్న బియ్యం నిల్వలను ఆయన పరిశీలించారు.గోడౌన్ల సామర్థ్యం తో పాటు ఎంతమంది హమాలీలు ఉన్నారు లాంటి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిరునోముల గోడౌన్ ప్రాంగణంలో నేరేడు మొక్కను నాటినారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వెజెండ్ల సాయి కుమార్,షేక్ జానీ భాషా, మార్కెట్ డైరెక్టర్ అనుమోలు వెంకటేష్, చెప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు,షేక్ ఫారుక్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల

పాల్వంచ, ఏప్రిల్ 24(మనం న్యూస్)ః మహిళలు అన్నీ రంగాల్లో రాణించి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ పరిధి రాహుల్ గాంధీ నగర్ లో గురువారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ లో కొత్వాల మహిళా సోదరీమణులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. మహిళలు కష్టించే తత్వం మరెవ్వరికీ సాధ్యం కాదన్నారు. అన్నీ వర్గాల ప్రజలు మహిళలకు సంపూర్ణ మద్దతు, సహకారం అందించి సమాజ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏడిఈ వెంకటేశ్వర్లు, వేణు, గజ్జి శ్రీను, రాంబాబు, నర్సింహారావు, శ్రీలత, మహిళలు పాల్గొన్నారు.



## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహయాన్ని అందించిన తోటి స్నేహితులు



పెన్ పహాడ్ ఏప్రిల్ 24 (మనం న్యూస్): మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన తోటి మిత్రుడు దాచేపల్లి అజయ్ ఈనెల 14న ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందగా 2001--2002 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ చెందిన తోటి స్నేహితులు గురువారం మృతుని దశదినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపి మిత్ర బృందం అందరూ కలిసి సేకరించిన రూ.75,500 కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన తన మిత్రుడు అజయ్ కుటుంబానికి భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా మేము ముందుంటామని భరోసాను అందిస్తామని అన్నారు మృతునికి తల్లి మణెమ్మ, భార్య కవిత,కుమార్తె, కుమారుడు ఉన్నారు ఈ కార్యక్రమంలో స్నేహితులు సలిగంటి మధు, షేక్ జాన్ షరీఫ్,రామినేని సైదులు,వంగాల అరవిందు,ఎరకల విష్ణు, హుస్సేన్, దాచేపల్లి శ్రీనివాస్, బచ్చు సైదులు, అశోక్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మామిడి పండ్ల మార్కెట్ ను వినియోగించుకోవాలి

**సహజ సిద్ధంగా పండిన మామిడి పండ్ల విక్రయం • వివిధ సీజన్ లలో వచ్చే పండ్లను మార్కెట్ లో అమ్మేలా చర్యలు • ఖమ్మం నగరంలో మామిడి పండ్ల మార్కెట్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, ఏప్రిల్ -24 (మనం బ్యూరో)ః రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్ ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం నగరం రోటరీ నగర్ లో గల వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మార్కెట్ ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ₹ ఖమ్మం నగరం రోటరీ నగర్ లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30 పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్ ను నూతనంగా ఏర్పాటు చేసుకున్నామని, మొదటి రోజున మూడు స్టాల్ లలో రైతులు పండ్ల అమ్మకం చేపట్టారని, విస్తృత ప్రచారం కల్పించి రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్ లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూడాలని తెలిపారు.

ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయిస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందని, దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన క్యాడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటివి రైతులు నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**అనంతరం జిల్లా కలెక్టర్ వ్యాపారులకు పండ్ల కవర్లను పంపిణీ చేశారు**

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, స్థానిక కార్పొరేటర్ నీరజ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు పరిష్కారం భూ భారతి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల, ఏప్రిల్ 24,( మనం న్యూస్): మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో గురువారం రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు భూ భారతి పరిష్కారం చూపుతోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. భూ భారతిపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సమస్యలకు కారణమైన ధరణి స్థానంలో భారతి రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని అన్నారు. మొత్తంగా దీర్ఘకాల భూ సమస్యలకు భూ భారతి శాశ్వతం పరిష్కారం చూపుతోందని తెలిపారు. ధరణిలో భూ సమస్యల కోసం అప్పీల్ వ్యవస్థ లేదని కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదిని, భూ భారతిలో రెండంచెల అప్పీల్ వ్యవస్థను తీసుకు వచ్చామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కలుగుతుందని చెప్పారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ పెండింగ్ సాదా బైనామ దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణిత కాలంలో విచారణ, భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యూటేషన్ చేసి రికార్డులలో నమోదు, పాస్ పుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచల అప్పీల్ వ్యవస్థ, భూధార్ కార్డుల జారి, ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఎమ్మార్వో మునిధర్, ఎంపీడీవో స్వాతి, దారం ఆది రెడ్డి, దొంగ ఆనంద రెడ్డి , బత్తిని శ్రీనివాస్ సింగిల్ విండో చైర్మన్లు లింగారెడ్డి, చంద్రశేఖర్, మండల యూత్ అధ్యక్షుడు శనగరపు తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు నాగులపేట సంజీవ్, కొండబత్తిని అనిల్ కుమార్ , చెక్క బండి కార్తీక్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతిపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

- **అవగాహనా సదస్సులో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి**




**హైదరాబాద్, ఏప్రిల్24 (మనంన్యూస్):** భూ భారతి చట్టం పై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని నారాయణ పేట శాసన సభ్యురాలు డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు.మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో గురువారం నిర్వహించినభూ భారతి అవగాహన సదస్సు ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి నారాయణపేట శాసన సభ్యురాలు డా. చిట్టెం పర్ణిక రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతులందరికీ ఉపయోగపడేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు మేధావులతో చర్చించి అందరి ఆమోదంతో చట్టాన్ని ఏప్రిల్ 14 నుండి అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు ధరణి కారణంగా రైతులు ఎన్నో భూ సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు పేరులో ఒక అక్షరం తప్పు పడడం, ఒక గుంట విస్తీర్ణం తక్కువ గా నమోదు కావడం ఇలాంటి సమస్యలు తో ఎంతోమంది పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలలయాలు,జిల్లా కలెక్టర్ చుట్టూ తిరగ వలసి వచ్చేదని ఆమె అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం వేలాదిమంది దరఖాస్తులను ప్రజా ప్రతినిధులు ,జిల్లా కలెక్టర్ అధికారులకు ఇచ్చే వారని అన్నారు.ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి రద్దు చేస్తామని తెలిపిన విధంగానే ధరణి స్థానంలో భూ భారతి చట్టం ను అన్ని నిబంధనలతో తీసుకు వచ్చినట్లు తెలిపారు. భూ భారతి చట్టం పై అన్ని మండలం లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రైతులు అవగాహన సదస్సులో తెలుసుకున్న విషయాలు గ్రామాల్లో రైతులకు,ప్రజలకు తెలుపాలని అన్నారు. భూ భారతి చట్టం లో తహశీల్దార్ వద్ద సమస్య పరిష్కారం కాకుంటే అర్.డి. ఓ,అర్.డి. ఓ వద్ద కాకుంటే జిల్లా కలెక్టర్ కు,జిల్లా కలెక్టర్ వద్ద కాకుంటే సి.సి.ఎల్. ఏ,ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ కు వెళ్ళ వచ్చని తెలిపారు. భూ భారతి చట్టం అమలు పై నారాయణ పేట జిల్లా మద్దూరు మండలం ఖాజి పూర్ గ్రామం లో పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు.గ్రామంలో చాలా సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. రైతులు ,ప్రజల నుండి వచ్చిన సూచనలు స్వీకరించి భూ భారతి చట్టం ను మెరుగ్గా అమలు చేయనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల ననుసరించి త్వరలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అధికారులు అన్ని సమస్య లు పరిష్కరిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూ సమస్యలను సత్రం పరిష్కారం చేసేందుకు అన్ని అంశాలను పొందుపరిచి ఉగాది చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని తెలిపారు. లెటర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులలో 80% భూ సమస్యలకు సంబంధించి వస్తున్నట్లు తెలిపారు .ఈ ఫిర్యాదులలో భూమి రికార్డులోకి నమోదు కాకపోవడం, కొన్ని సర్వే నెంబర్లు నమోదు జరిగి కొన్ని సర్వే నెంబర్లు నమోదు జరగకపోవడం, భూమి సాగులో ఉండి రికార్డులోనికి రాకపోవడం, పాసుబుక్ జారీ చేసి,పహాని నకళ్లు ఉండి ధరణి లో విస్తీర్ణం,సబ్ డివిజన్ వారీగా నమోదు కాక పోవడం వంతు ఎన్నో సమస్యలు ఉన్నాయని తెలిపారు .వారసత్వంగా వచ్చిన భూములు విరాసత్ కు సంబంధించి అందరు కుటుంబ సభ్యులు రాకుండా కొంతమంది పేర్లు రాసుకుని భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. అలాగే మహిళలకు ఆస్తిలో భూమి లో సమాన హక్కు ఉన్నప్పటికీ వారికి తెలియకుండా అన్నదమ్ములు తమ పేరున నమోదు చేసుకున్న దృష్టాంతాలు వివరించారు.పట్టా భూములు కలిగి ప్రభుత్వ అవసరాల కు సేకరణ చేసినప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందని తెలిపారు. పాత చట్టం లో తహశీల్దార్ నిర్ణయం జరిగిన తర్వాత పరిష్కారం కు పై అధికారులకు అధికారాలు లేవని,సివిల్ కోర్టు కు వెళ్ళ వలసి వచ్చేదని, చాలా సమయం పడుతుందని అన్నారు. 1971 లో అర్. ఓ.అర్.చట్టం వచ్చాక అమలుకు నిబంధనలు 18 సంవత్సరాల తర్వాత 1989 లో నిబంధనలు రావడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా భూ భారతి (భూమి హక్కుల చట్టం) 2025 జనవరి లో రూపొందించి ఏప్రిల్ 14 న నిబంధనలతో అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ భారతి చట్టం లో భూ సమస్యలు సత్వరం పరిష్కారం చేసేందుకు అన్ని నియమాలను ప్రభుత్వం పొందుపరచడం జరిగిందని తెలిపారు. సాదా బైనమా ద్వారా కొనుగోలు చేసిన భూములు పరిష్కారం కు వెసులు బాటు కల్పించిందని పేర్కొన్నారు.ఆధార్ కార్డు లాగానే ప్రతి భూ కమతానికి భూదార్ కార్డ్ జారీ చేయనున్నట్లు తెలిపారు.భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే చేసి హద్దులను నిర్ణయించి మ్యాప్ తయారు చేసి భూ వివరక్తో ౧ పాస్ పుస్తకం ప్రింట్ చేయనున్నట్లు తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ లను నియమించి సర్వే చేసిన తర్వాత మండల సర్వేయర్ దృవీకరిస్తారని, వీటి ఆధారంగా తర్వాత తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేస్తారని అన్నారు.అనంతరం శాసన సభ్యురాలు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి. ఓ నవీన్,మండల ప్రత్యేక అధికారి ,జిల్లా యువజన ,క్రీడల అధికారి శ్రీనివాస్ ,తహశీల్దార్ రాజ గణేష్,రిటైర్డ్ తహశీల్దార్ జాఫరుల్లా ఖాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టం పై వివరించారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- **కలెక్టర్ విజయేందిర బోయి**

**హైదరాబాద్, ఏప్రిల్ 24(మనంన్యూస్):** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు.గురువారం కోయిలకొండ మండల కేంద్రంలో రైతు వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ఐ.కె.పి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రం ధాన్యం కొనుగోలు రికార్డులను పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్ని లు ఉన్నాయా పరిశీలించి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతంను కలెక్టర్ పరిశీలిం చారు. తేమ,తాలు,మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం ను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. సన్న రకం,దొడ్డు రకం వేరువేరుగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాడి క్లీనర్ ఉపయోగించి శుభ్ర పరచు కొవాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రైతుల వివరాలు ఓపిఎంఎస్ ఆన్ లైన్ లో వెంట వెంటనే నమోదు చేసి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,ఆర్.డి. ఓ నవీన్,తహశీల్దార్ అన్నారు.




# జాతీయ బీజేపీ కోశాధికారుల సమావేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 24(మనంన్యూస్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ కోశాధికారుల సమావేశం ఈ నెల 23, 24 తేదీల్లో న్యూఢిల్లీ లోని బీజేపీ జాతీయ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి భాండారి శాంతికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా, భాండారి శాంతికుమార్ తెలంగాణ రాష్ట్ర బీజేపీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను, పద్దుల నిర్వహణ విధానాన్ని, ఖర్చుల వివరాలను సమావేశంలో సమగ్రంగా వివరించారు. రాష్ట్ర స్థాయిలో నిధుల సేకరణ, వినియోగం, పారదర్శకత వంటి అంశాలను ప్రస్తావించారు. కేంద్ర బీజేపీకి అందవలసిన నివేదికలను సమర్పించి, తెలంగాణ బీజేపీ పద్దులు ఎలా నడుస్తున్నాయన్నదాని పై స్పష్టతనిచ్చారు. ఇది ఒక రకంగా రాష్ట్ర పార్టీకి ప్రాధాన్యత లభించడంతోపాటు, భవిష్యత్తులో ఆర్థిక నిర్వహణను మరింత మెరుగుపరిచే అవకాశాలను కూడా అందించే సందర్భమైంది. సమావేశంలో పాల్గొన్న ఇతర రాష్ట్రాల కోశాధికారులతో అనుభవాలను పంచుకుంటూ, మంచి పద్ధతులపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

# మే నెల మొత్తం అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి

- **అంగన్వాడి యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు భానుమతి**
- **సీఐటీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట అంగన్వాడిల ఆందోళన**
- **జిల్లా కలెక్టరేట్ , ఐసిడిఎస్ పిడి కార్యాలయల్లో వినతి పత్రాలు**



**మంచిర్యాల, 24, ఏప్రిల్, ( మనం న్యూస్):** అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంగన్వాడి ఉద్యోగులకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడిల ఆందోళన చేశారు . అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సూపర్డెంట్, ఐసిడిఎస్ పిడి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ లకు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు . ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం కూడా పై తరగతి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించిందని , కానీ అంగన్వాడి కేంద్రాలకు మాత్రం వేసవి సెలవులు ఇంకా ప్రకటించలేదుని , మరి అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలు ఐదు సంవత్సరాలు లోపు ఉన్నవాళ్లు ఇప్పటికే జిల్లాలో రాష్ట్రంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక చాలామంది చనిపోతున్నారన్నారు .ఇంత ఎండలో అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను వారి తల్లిదండ్రులు ఎండలకు భయపడి సరిగ్గా పంపించడం లేదని, అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యం, రక్షణ కూడా ప్రభుత్వానికి అవసరమే అందుకే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మే నెల మొత్తం కూడా అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కూడా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క కూడా మే నెల సెలవులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు . కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగన్వాడీ కేంద్రాలకు ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు వేసవి సెలవులు కూడా ఇచ్చింది కాబట్టి అంగన్వాడి కేంద్రాల పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి సెలవులు మంజూరు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, సవిత, విరోనిక, అనురాధ , పద్మ, ప్రవీణ, శారద, సువర్ణ, సుగుణ ,చిందం వెంకన్న, పళ్ళికొండ శేఖర్, జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మూడవ రోజుకు చేరిన నిరవధిక సమ్మె




**కరీంనగర్, ఏప్రిల్ 24 (మనం బ్యూరో):** శాతవాహన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని గత మూడు రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా గురువారం నాటికి సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులు తమ మద్దతును ప్రకటించి వారితో పాటు కూర్చుని వారికి తమ సంఘీభావం తెలిపారు. ఎడ్యుకేషన్ వింగ్ చూసే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరగా స్పందించి వారిని రెగ్యులరైజ్ చేసి అధ్యాపకులకు న్యాయం చేయాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన నలంద డిగ్రీ కాలేజ్, జగిత్యాల ప్రిన్సిపాల్ శ్రీపాద నరేష్, రామకృష్ణ డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రిన్సిపల్ రాజేందర్, రామకృష్ణ డిగ్రీ కళాశాల, కోరుట్ల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ ఒప్పంద సహాయ ఆచార్యుల డిమాండ్స్ న్యాయమైనవని తమ పూర్తి మద్దతు తెలిపారు.

# స్వచ్ఛందంగా కోరుట్ల బంద్



**కోరుట్ల ఏప్రిల్ 23 (మనం న్యూస్):** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం కోరుట్ల వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించి కాశ్మీర్ లోనీ పహల్గాంలో జరిగిన హింసాత్మకమైన సంఘటనకు నిరసనగా జరిగిన జాతీయ పతాకంతో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు తరువాత శాంతి భద్రతలతో అభివృద్ధి పథంలో వెళుతున్న రాష్ట్రంలో అలజడి రేపడానికి కేవలం హిందువులు అనే కారణం చేత కొంతమంది మతోన్మాద టెర్రరిస్టులు కాశ్మీర్లో హిందువులను క్షుణ్ణంగా తనికి చేసి మరీ కాల్చి చంపారని ఇది చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. దేశంపై విషం చిమ్ముతూ పరదేశాన్ని ప్రేమిస్తూ దేశాన్ని వ్యతిరేకించే మతోన్మాద శక్తులు ఎవరైనా దేశద్రోహులే అలాంటి వారి పట్ల ప్రభుత్వాలు కఠిన నిర్ణయం తీసుకొని ఇలాంటి ఘటనలు ఉన్నరావృతం కాకుండా తీసుకోవాల్సిన బాధ్యత ఉంద న్నారు.

# పహిల్గాం ఉగ్ర దాడి అమానుషం

- **మృతులకు అశ్రు నివాళులు**
- **పోలాడి రామారావు**



**మానకొండూర్, ఏప్రిల్ 24(మనం న్యూస్):** పహిల్గాం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు వదిలిన 25 మంది అమాయక హిందువులకు అశ్రు నయనాలతో నివాళులు అర్పిస్తూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు. మారణ కాండ సృష్టించిన ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ఇందుకు బాధ్యులైన పొరుగున ఉన్న దాయాది దేశానికి గట్టి జవాబ్ చెప్పాలని పోలాడి డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రవాదులు ఒక వర్గం టూరిస్టులపై ఏరికోరి కిరాతకంగా అమాన మీయంగా కాల్పులు జరిపి 25 మంది ప్రాణాలు బలిగొనడం దారుణమైన సంఘటన అని తీవ్ర దిగ్భ్రాంతి వేదనకు గురి చేసిందని పోలాడి రామారావు విచారం వ్యక్తం చేశారు. గురువారం నగరానికి వచ్చిన రామారావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కాశ్మీర్ ఉగ్ర మూకల మారణ కాండలో 25 మందికి పైగా అమాయక టూరిస్టులను కాల్చి చంపడం దారుణ, హేయమైన, క్రూర చర్య అని తీవ్రంగా ఖండించారు. టూరిస్టులు నెలకొరగడం యావత్ భారతీయులందరిని కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టు దిట్టమైన ఏర్పాటు చేయాలని టూరిస్టులకు భద్రత కల్పించాలని రామారావు కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**మేడిపల్లి, ఏప్రిల్ 24 (మనం న్యూస్):** మేడిపల్లి మండలంలోని కాచారం గ్రామంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాలమేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి లబ్ధిదారు బర్ల శంకర్ కు 37,500 రూపాయల చెక్కును గురువారం రోజున సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దేశెట్టి గంగాధర్, ఉపా అధ్యక్షుడు బర్ల గంగాధర్, మాజీ సర్పంచ్ జలంధర్ రెడ్డి, మ్యాదరి రాజిరెడ్డి, పానుగంటి రాజేష్, బడుగు పోషణ, బడుగు నరసయ్య, బర్ల అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా తిరుపతి రెడ్డి



**జన్నారం(ఏప్రిల్ 24)మనం న్యూస్:** రెడ్డి సంక్షేమ సంఘూ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా మందమర్రి కి చెందిన కొంగల తిరుపతి రెడ్డి ని నియమించినట్లు రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గా ఎన్నికయిన కొంగల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘూ ను జిల్లా లో బలోపేతం చేసేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.తన మీద నమ్మకం తో జిల్లా ఉపాధ్యక్షులు గా నియమించిన జిల్లా అధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి కి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీధర్ రెడ్డి, జిల్లా నాయకులు ఏలేటి సత్య నారాయణ రెడ్డి లకు అయన కృతజ్ఞతలు తెలిపారు

# మానకొండూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



**మానకొండూర్, ఏప్రిల్ 24 మనం న్యూస్:** జమ్మూ కాశ్మీర్ పహల్ గామ్ లో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజల కు ఆత్మ శాంతి చేకూరాలని మానకొండూరు మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు కందిరాజి రెడ్డి ఆధ్వర్యంలోబాబు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి యూనియన్ బ్యాంకు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. ఈసందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ అమాయక హిందూ ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని ఇంతకు రెండింతల ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మియాపురం లక్ష్మణ చారి, నాయకులు మార్కొండ రమేష్ పటేల్, మాచర్ల కోటేశ్వర్,ఎదులాపురం అశ్విన్ తేజ, కొండ్ర వరప్రసాద్, ఊషా కోయిల సాయి వంశీకృష్ణ, కొండ్ర సురేష్ కుమార్, బండారి హరీష్, తాండ్ర రాకేష్,వైద వైదిక్ రావు, వీరగోని రాజు, ప్రణయ్, కార్తీక్, బన్నీ, అక్షయ్, శ్రీనివాస్, శివకుమార్, అనిల్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం సమాజానికి మేలు

- **బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ రెడ్డి**




**కరీంనగర్,ఏప్రిల్24( మనంన్యూస్):** వక్ఫ్ నిబంధనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి, పేద మధ్యతరగతి ముస్లింల ప్రయోజనాలు, సంక్షేమం అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణ లు చేపట్టిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ రెడ్డి తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం రోజున కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో వక్ఫ్ చట్ట సవరణ -2025 జన జాగరణ అభియాన్ కరీంనగర్ జిల్లా కార్యశాల ప్రోగ్రాం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా వక్తగా హాజరైన బిజెపి ఆయన మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్ట ప్రకారం ఇవ్వబడిన తిరిగి ఇవ్వలేని దాతృత్వ నిధి అన్నారు. భారతదేశంలో 1996 నుండి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. 2018 కేంద్రీయ వక్ఫ్ పరిషత్ నివేదిక ప్రకారం భారత్లో 10 లక్షల కోట్లకు పైగా అంచనా విలువ కలిగిన ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా వక్ఫ్ కు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అయితే వక్ఫ్ యొక్క పాలన వ్యవస్థ బలహీనంగా ఉండి , బోర్డులో ఎవరు ఎవరికి జవాబు దారి గా ఉండడం లేదని , ఆ కారణం చేతనే మోడీ ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి వీలుగా వక్ఫ్(సవరణ) చట్టం-2025ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా వక్ఫ్ పెద్ద మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న ముస్లిం సమాజ ప్రయోజనాలు ,సంక్షేమం అభివృద్ధి కోసం వక్ఫ్ పనిచేసిన దాఖలాలు ఏమీ లేవని, ముస్లిం సమాజాన్ని దోచుకుందని ఆరోపించారు. ముస్లిం ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వక్ఫ్ భారత్లో అన్నింటికన్నా పెద్ద స్కామ్ గా తయారైందన్నారు. లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉన్న వక్ఫ్ ముస్లిం సమాజ సంక్షేమ, అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఈరోజుకి 31 శాతం ముస్లింలు దారిద్యరేఖకు దిగువనే జీవితాలను గడుపుతున్నారని , వారికి చేయూతనివ్వాలనే ఆలోచన వక్ఫ్ ఏనాడూ చేయలేదన్నారు. ప్రధానంగా వక్ఫ్ భూములలో షాపింగ్ మాల్స్, హోటల్లు, వ్యాపార భవనాలు విలసిల్లుతున్నాయి కానీ పేద ముస్లింలకి ఇప్పటికీ ఏ విధమైన ప్రయోజనం చేకూరలేదన్నారు. 80 శాతం వక్ఫ్ భూములు అవినీతి, అక్రమ కబ్జాలకు గురయ్యాని పేర్కొన్నారు. ముస్లిం వర్గాల సేవ కోసం ఉద్దేశించిన వక్ఫ్ భూమి కొంతమంది వ్యక్తులకు రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యంగా మారిందన్నారు.2018 లో కేంద్ర వక్ఫ్ పరిషత్ వెలువరించిన నివేదికలో వక్ఫ్ బోర్డులో ఏలాంటి పారదర్శకత లేదని, అవినీతి పతాకాస్థాయిలో ఉందని పేర్కొన్న విషయాన్ని ఆయనఈ సందర్భంగా గుర్తు చేశారు.2006 సచార్ కమిటీ నివేదిక ప్రకారం విద్య, ఉద్యోగం, ప్రభుత్వ సేవల పరంగా ముస్లింల పరిస్థితి దళితుల కన్నా అధ్వాన స్థితిలో ఉందని , ఈ పరిస్థితిని మెరుగుపరచకపోతే ఎవరి సంక్షేమం కోసం చట్టం తయారు చేయబడిందో ఆ చట్టం ద్వారానే దోపిడి గురయ్యే అవకాశం ఉందన్నారు.వక్ఫ్ స్కాలర్షిప్ నిధులు నకిలీ లబ్ధిదారుల పేరుతో దోపిడీకి గురయ్యాయని , దీంతో అసలైన పేద ముస్లిం విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం 70 శాతం వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని, మిగిలిన ఆస్తులు ,మాల్స్, హోటల్లు, పరిశ్రమలకు నామమాత్రపు లీజుకు కట్టబెట్టారన్నారు. గత వక్ఫ్ బోర్డులో ఉన్న లోపాలను సరి చేస్తూ మోడీ ప్రభుత్వం చట్టంలో సవరణలు చేపట్టిందన్నారు. అయితే ఇన్నాళ్లు వక్ఫ్ ఆస్తులను దోచుకున్నోళ్లకు, సొమ్మును అనుభవించిన కొంతమందికి సవరణ చట్టం మింగుడు పడడం లేదని తెలిపారు. ప్రోగ్రాంలో మాజీ మేయర్ సునీల్ రావు, బిజెపి రాష్ట్ర మహిళా నాయకురాలు సుంకర మౌనిక , నిర్మల దేవి , మాజీ డిప్యూటీ మేయర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగుగ్గిలపు రమేష్, కోమల ఆంజనేయులు , కన్నబోయిన ఓదెలు, వాసాల రమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, సాయిని మల్లేశం, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , ఎస్సీ మోర్చా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్ , మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, పుప్పాల రఘు, ఎన్నం ప్రకాష్, బల్బీర్ సింగ్ పాల్గొన్నారు.

# పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసిన భారత్

**ఢిల్లీ, ఏప్రిల్ 24 :** పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ ఆదేశాలు ఇచ్చింది. '' పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. ఈ దేశ పౌరులు పాక్‌లో పర్యటించవద్దని సూచిస్తున్నాం'' అని విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే.. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని మోడీఅధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు



వెలువడ్డాయి. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు వారు దేశం వీడి వెళ్లేందుకు వారం గడువు విధించారు. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మే ఒకటో తేదీలోగా దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విదేశాంగ శాఖ ఆ దేశ ప్రజలనుద్దేశించి సవివర ప్రకటన విడుదల చేసింది.

**భారత్ అల్టిమేటం.. మనదేశం వీడుతున్న పాకిస్థానీయులు**

ఇక ఇప్పటికే పాక్ జాతీయులు అమృత్‌సర్‌లోని అటారీ- వాఘా రోడ్డు మార్గం ద్వారా భారత్ను వీడుతున్నారు. దీనిలో భాగంగా పలు పాకిస్థానీ కుటుంబాలు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్దకు చేరుకున్నాయి. ''ఢిల్లీలో ఉన్న మా బంధువులను కలిసేందుకు ఏప్రిల్ 15న మేం భారత్ వచ్చాం. మా వీసా గడువు 45 రోజులు ఉంది'' అని ఓ పాక్ కుటుంబం వెల్లడించింది. సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు విడిచారు.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఇది సీమాంతర కుట్రే అని, సూత్రధారులను దోషులుగా నిలబెడతామని భారత ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# జమ్మూ కశ్మీర్‌కు వెళ్లొద్దు..!

- అమెరికన్ పౌరులకు విదేశాంగ శాఖ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** జమ్మూ కశ్మీర్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉండటంతో.. అమెరికా తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడితో అమెరికా అప్రమత్తమైంది. తమ దేశస్తులు ఎవరూ జమ్మూ కశ్మీర్‌కు ప్రయాణాలు పెట్టుకోవద్దని, ఉగ్రదాడులు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని పేర్కొంది. దీంతోపాటు భారత్-పాక్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల సమీపంలోకి కూడా వెళ్లొద్దని తెలిపింది. ''కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లోఉద్రిక్త పరిస్థితి తలెత్తే లేదా ఉగ్రదాడులు జరిగే



ప్రమాదం ఉంది. ఆ ప్రాంతానికి వెళ్లవద్దు. తూర్పు లద్ధాఖ్, దాని రాజధాని లేహ్‌కు వెళ్లొచ్చు. ఇక నియంత్రణ రేఖ వద్ద కూడా హింసాత్మక ఘటనలు జరగొచ్చు. కశ్మీర్‌లోయలోని శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాంలో హింస చెలరేగవచ్చు. సైనిక ఘర్షణకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో సరిహద్దులకు 10 కిలోమీటర్ల వరకు వెళ్లవద్దు'' అని అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది.పహల్గాం దాడిని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయన నిన్న ప్రధాని మోదీకి నేరుగా కాల్ చేసి మాట్లాడారు. ఉగ్రవాదులను పట్టుకోవడంలో భారత్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

# వీసాల రద్దు ఆపండి: అమెరికాలో భారతీయ విద్యార్థులకు ఊరట

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** అమెరికాలో ట్రంప్ యంత్రాంగం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి




వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ నేరాలు చేయకపోయినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తారు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు, చైనీయులు, నేపాలీలు, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ వాసులున్నారు. అమెరికాలో చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు అక్కడ పని చేయవచ్చు. ఈ సమయాన్ని వారు హెచ్-1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.

తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దైన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరికా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటున్నారు.

# ఐక్యరాజ్యసమితి వేదికగా అమెరికా, చైనా కస్సుబుస్సు

**న్యూయార్క్, ఏప్రిల్ 24:** ఐరాస వేదికగా అమెరికా, చైనాలు విమర్శ, ప్రతివిమర్శలు చేసుకున్నాయి. అమెరికా- చైనాల మధ్య వాణిజ్యయుద్ధం తార స్థాయికి చేరుకుంటోంది. ఇప్పటికే పరస్పర సుంకాలతో ప్రతీకార చర్యలు తీసుకొంటున్న ఇరు దేశాలు తాజాగా.. ఐక్యరాజ్య సమితి వేదిక మీద విమర్శ, ప్రతివిమర్శలతో విరుచుకుపడ్డాయి. అమెరికా సుంకాల ధోరణి మాపై బెదిరింపులతో కూడినదిగా ఉందని చైనా విమర్శించగా.. అమెరికా బీజింగ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చింది. బుధవారం ఐరాసలో భద్రతా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో చైనా తరఫు రాయబారి ఫు కాంగ్ మాట్లాడుతూ యూఎస్ విధించిన సుంకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం తమ వాణిజ్య భాగస్వాములపై సుంకాలు విధించి ప్రపంచ ఆర్థికవ్యవస్థకు విఘాతం కలిగించింది. పరస్పరం అనే ముసుగులో యూఎస్ టారిఫ్ల ఆట ఆడుతోంది. ఇతర దేశాలకు నష్టం కలిగించి.. తమ సొంత ప్రయోజనాలను అభివృద్ధి చేసుకోవాలని చూస్తోంది. ఈ చర్య ఇప్పటికే అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్యక్రమాన్ని దెబ్బతీస్తోంది. మేము అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలా, లేక ఇలాంటి అర్థం లేని



చట్టాలను పాటించాలా. మాపై భారీ స్థాయిలో సుంకాలు విధించడం బెదిరింపులతో కూడినదిగా ఉంది. ఇలా మాపై ఒత్తిడి పెంచడం సరైన చర్య కాదు' అని ఫు కాంగ్ పేర్కొన్నారు. ఇక, ఈ వ్యాఖ్యలకు అమెరికా మిషన్ ప్రతినిధి టింగ్ వు గట్టిగా బుదులిచ్చారు. చైనా విశ్వసనీయత లేని వ్యాఖ్యలు చేస్తోందన్నారు. ప్రపంచం చైనా వాదనలు వినకుండా.. ఆ దేశం చేస్తున్న చర్యలను చూడాలని ఆయన ఎద్దేవా చేశారు. చాలాకాలంగా బీజింగ్ ఏకపక్షమైన, అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరించిందన్నారు. కాగా.. ప్రపంచ దేశాలపై సుంకాల విధింపులో భాగంగా వాణిజ్య దేశాలతో పాటు ట్రంప్ చైనా పైనా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ దేశంపై 145 శాతం సుంకం అమలులో ఉంది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యంపై బీజింగ్ 125 శాతం టారిఫ్లను ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది.

# దేశ సమగ్రతే ముఖ్యం.. ప్రభుత్వానికి అండగా ఉంటాం: డీకేఎస్



**బెంగళూర్, ఏప్రిల్ 24:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ స్పందించారు. దేశ సమగ్రతే తమకు అత్యంత ముఖ్యమన్న ఆయన.. కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడతామన్నారు. కొందరు దీన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా కలిసి శాంతిని కాపాడుకోవాలని, ఈ సమయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు. మరోవైపు, పహల్గాం ఉగ్ర దాడి ఘటనను కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి సీడబ్ల్యూసీ తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఇది పిరికిపంద చర్య, పాకిస్థాన్ పన్నిన కుట్రగా పేర్కొంది. దేశవ్యాప్తంగా భావోద్వేగాల్ని రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే హిందువులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపింది. ఈ ఘటనలో నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపైనా సమగ్ర విశ్లేషణ తప్పనిసరి అని పేర్కొంది. ఐక్యత అత్యంత అవసరమైన ఈ సమయంలో రాజకీయాలు చేయడం దిగ్భ్రాంతికరమని తెలిపింది. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల భద్రతను జాతీయ ప్రాధాన్యతగా పరిగణించి.. అందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కేంద్రాన్ని కోరింది. పహల్గాం దాడి మృతులకు నివాళులర్పించేందుకు ఏప్రిల్ 25న దేశ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు.

# రష్యా-ఉక్రెయిన్ శాంతి సమావేశం రద్దు

- జెలెన్స్కీని తప్పుబట్టిన ట్రంప్

**కీవ్/మాస్కో ,ఏప్రిల్ 24:** రష్యా-ఉక్రెయిన్ల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఉద్దేశించిన సమావేశం చివరి క్షణంలో రద్దైంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఉక్రెయిన్ దేశాల రాయబారుల మధ్య ఈ సంప్రదింపులు జరగాల్సి ఉంది. లండన్‌లోబుధవారం జరిగిన ఉక్రెయిన్, రష్యా శాంతి సంప్రదింపులకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రాయబారి స్టీవ్ విట్‌కాఫ్‌లు హాజరు కాలేదు. ఫ్రాన్స్, జర్మనీ విదేశాంగ మంత్రులూ గైర్హాజరయ్యారు.

క్రిమియాను రష్యాకు అప్పగించకుండా యుద్ధాన్ని జెలెన్స్కీ సాగదీస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుయ్యబట్టారు. క్రిమియా భాగం ఉక్రెయిన్‌దేనని జెలెన్స్కీ చెప్పడాన్ని తప్పుబట్టారు. ఆయన ప్రకటనలు పరిస్థితిని సంక్లిష్టంగా మారుస్తున్నాయన్నారు. కావాలంటే మరో మూడేళ్లు యుద్ధం చేసుకుని మొత్తం దేశాన్ని వదులుకుంటారేమోనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా అన్నారు.

# పాక్ ఆర్మీ చీఫ్కు.. బిన్ లాడెన్కు పెద్ద తేడాలేదు : అమెరికా అధికారి కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్ 24:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ ఆర్మీ చీఫ్‌పై అమెరికా మాజీ అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనకు ఉగ్రవాది బిన్‌లాడెన్కు పెద్ద తేడా లేదన్నారు.

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటనను భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. దీనిపై అమెరికా మాజీ అధికారి ఒకరు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా మాజీ చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌కు పెద్ద తేడా లేదని పెంటగాన్ మాజీ అధికారి మైఖెల్ రూబిన్ వ్యాఖ్యానించారు. బిన్‌లాడెన్ అప్పుడు కలుగులో దాక్కుంటే ఇప్పుడు మునీర్ ప్యాలెస్‌లో జీవిస్తున్నారని.. ఇదొక్కటే వారి మధ్య తేడా అని అన్నారు.



''అప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటనలో ఉన్నప్పుడు కశ్మీర్లో ఇలాంటి దాడే జరిగింది. మళ్లీ ఇప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తుండగా పహల్గాంలో ముష్కరులు నరమేధానికి పాల్పడ్డారు. ఈ దాడిపై పాక్ స్పందిస్తూ తమకు సంబంధం లేదని, స్థానికులే ఈ ఘోరానికి పాల్పడ్డారని నిందిస్తోంది. ఇలాంటి నాటకాలు ఎన్ని ఆడినా.. ఆ దేశ వక్ర బుద్ధి ఎలాంటిదో అందరికీ తెలుసు. పహల్గాం దాడికి మనంచేయాల్సింది ఒక్కటే..! పాక్‌ను ఉగ్రవాద ప్రేరేపిత దేశంగా, మునీర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించాలి'' అని మైఖెల్ రూబిన్ అన్నారు.

మంగళవారం పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు పేట్రేగిపోయిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. పర్యటకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం తర్వాతే ఈ దాడి జరగడంతో వేళ్లన్నీ ఆయనవైపే చూపిస్తున్నాయి. అసీం మునీర్‌కు.. భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలూ ఉగ్ర దాడికి పురిగొల్పేలానే ఉంటాయి. ఇటీవల ఆయన ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం'' అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఈ ఉగ్రవాది చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

# షెల్టర్గా మారిన పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి

**గాజా,ఏప్రిల్ 24:** గాజా నగరంలో షెల్టర్‌గా మారిన పాఠశాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 23 మంది మరణించారు. దాడులతో శిబిరంలోని టెంట్లకు మంటలు అంటుకున్నాయి. కొంత మంది సజీవ దహనమయ్యారు. దాడులపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించలేదు. ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే మిలిటెంట్లు తలదాచుకుంటున్నారని, అందుకే అక్కడ దాడులు చేస్తున్నామని గతంలోనే ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందంపై అరబ్ మధ్యవర్తులు కొత్త ప్రతిపాదనపై చర్చిస్తున్నారు. బందీలందరినీ విడిపించేందుకు వీలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. గాజాకు అందే సాయంపై ఇజ్రాయెల్.. 7 వారాల నిషేధం విధించడాన్ని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తప్పుబట్టాయి.

**ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణులు**

ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపైకి బుధవారం ఉదయం యెమెన్‌లోని హూతీలు క్షిపణులను ప్రయోగించారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఈ గ్రూపు.. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై దాడి చేయడం ఇదే



తొలిసారి. హూతీల క్షిపణులు అంత దూరం ప్రయాణించడం కలకలం రేపింది. మరోవైపు అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను అడ్డుకుని కూల్చేశామని హూతీలు ప్రకటించారు.

# పరాయి దేశంలో 42 ఏళ్లు.. ఎట్టకేలకు స్వేచ్ఛ



**త్రివేంద్రం, ఏప్రిల్ 24:** 1983లో ఉద్యోగం కోసం బహ్రెయిన్ దేశం వెళ్లిన ఒక వ్యక్తి పాస్‌పోర్టు పోగొట్టుకోవడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. దాదాపు 42 ఏళ్ల తర్వాత ఆయన తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఉద్యోగం, పై చదువుల కోసం ఎంతోమంది విదేశాలకు వలస పోతుంటారు. ఈక్రమంలో కొన్ని కారణాల వల్ల కొందరు ఆ దేశాల్లో చిక్కుకుపోతుంటారు. అలా ఉద్యోగం కోసం వెళ్లి దాదాపు 42 ఏళ్లుగా బహ్రెయిన్‌లో ఉండిపోయిన వ్యక్తి కేరళకు చెందిన గోపాలన్ చంద్రన్. తాజాగా ఆయన స్వదేశానికి తిరిగివచ్చారని ప్రవాసీ లీగల్ సెల్ ఒక పోస్టు ద్వారా వెల్లడించింది. పోస్టు ప్రకారం.. కేరళలోని పొడికోణం సమీపంలో చిన్న గ్రామానికి చెందిన గోపాలన్ చంద్రన్ 1983లో ఉద్యోగం కోసం బహ్రెయిన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఆయన యజమాని మృతిచెందాడు. ఈక్రమంలో గోపాలన్ తన పాస్‌పోర్టును పోగొట్టుకున్నారు. దీంతో ఆయన అక్కడే చిక్కుకుపోయారు. స్వదేశానికి తిరిగి వచ్చే మార్గం తెలియక.. దాదాపు 42 ఏళ్లుగా ఆ దేశంలోనే ఉండిపోయారు. ఇటీవల ఫేస్‌బుక్ వేదికగా గోపాలన్ తన ఆవేదన వ్యక్తంచేశారు. తన కుటుంబాన్ని చూడాలని ఉందని ఒక వీడియోలో వాపోయారు. ఈ వీడియో ప్రవాసీ లీగల్ సెల్ ఎన్జీవో కంటపడింది. దీంతో గోపాలన్‌ను వెనక్కి తీసుకొచ్చేందుకు బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపారు. ఈక్రమంలోనే ఆయన తాజాగా స్వదేశానికి చేరుకున్నారు. ఇక, ఈ ఎన్జీవో మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు జర్నలిస్టులతో కూడినది. వీరు విదేశాల్లో అన్యాయంగా చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తుంటారు.

# వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలు.. భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** భారత్ సుంకాలు తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రకాల వస్తువులపై భారత్ సుంకాలు తగ్గించనుందనే విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఓవల్ ఆఫీస్‌లో పాత్రికేయులతో ఈమేరకు మాట్లాడారు. అయితే ఏ ఉత్పత్తులపై తగ్గింపు ఉంటుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా అధికారులు ఈనెల 23న వాషింగ్టన్‌లో చర్చలు ప్రారంభించారు. భారత్‌తో ఒప్పందం వల్ల అమెరికా వస్తువులకు కొత్త మార్కెట్లు తెరచుకుంటాయని, ఇరు దేశాల్లోని ఉద్యోగులు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు వస్తాయని ఇప్పటికే అమెరికా పేర్కొంది. టారిఫ్, టారిఫేతర అడ్డంకులను అమెరికా తగ్గించుకోవాలని అనుకుంటున్నట్లు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్



పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన షరతుల(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సెస్)కు ఇరు దేశాలు తుది రూపునిచ్చాయి కూడా. 90 రోజుల పాటు టారిఫ్ అమలుకు అమెరికా విరామం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు రోజుల చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ తరఫు బృందానికి వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్నవేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోడీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు.

# భూ సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం



- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- పోచంపల్లి లో భూ భారతి అవగాహన సదస్సు
- పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం,జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు

**భూదాన్ పోచంపల్లి,ఏప్రిల్ 24 (మనం న్యూస్):** రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టం తో పరిష్కారం దొరుకుతుంది అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనవరి 4 న భూభారతి చట్టం తీసుకురావడం జరిగిందని, ఏప్రిల్ 14 న అంబేద్కర్ జయంతి సందర్భంగా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టం తీసుకురావడంతో తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలు మరింత పెరిగాయన్నారు. ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. భూ భారతి చట్టం వల్ల ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. 18 రాష్ట్రాల్లో భూ సమస్యలకు పరిష్కరించే చట్టాలన్నిటిని పరిశీలించి తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. భూభారతి చట్టం ప్రతి ఒక్కరికి చాలా ఉపయోగపడుతుందని భూ సమస్యలన్నిటికీ పరిష్కారం చూపే విధంగా ఉంటుందని భూభారతి చట్టాన్ని కొనియాడారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతు ప్రజల ఆదరణ పొందుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రాజీవ్ యువ వికాసం కింద యువతకు ఉపాధి, సన్న బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు తదితర పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మంచి పాలన అందించే విధంగా ఈ ప్రభుత్వంకృషి చేస్తుందని అన్నారు. భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి నియోజకవర్గం లోని పోచంపల్లి మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా 67 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మరియు 25 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరము మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో తెల్లరేషన్ కార్డు లబ్దిదారులు మొగిలిపాక పుష్ప వారి కుమారుడు అనిల్ ఇంట్లో ఆయన సన్న బియ్యం అన్నంతో సహపంక్తి బోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, స్పెషల్ ఆఫీసర్ రమణి , మండల వ్యవసాయ అధికారి శైలజ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఇంచార్జ్ తహసిల్దార్ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు తడక వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి , కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మద్ది అంజిరెడ్డి, కుక్క దానయ్య, సుర్వి వెంకటేశం, మర్రి రాజిరెడ్డి, ఎమ్మార్రై వెంకట్ రెడ్డి, పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేష్, నాయకులు కొట్టం కరుణాకర్ రెడ్డి, కాసుల అంజయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి గునిగంటి వెంకటేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చేరాల సుధీర్ కుమార్, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, ఫకీరు నర్సిరెడ్డి, ఏర్పుల శ్రీనివాస్, కుక్క కుమార్, అరుణ్, చేరాల మహేందర్, మహేష్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన యెల్లౌల సంజీవరెడ్డి



**మోటకొండూర్, ఏప్రిల్ 24 (మనం న్యూస్):** మోటకొండూరు మండలంలోని తెర్యాల గ్రామనికి చెందిన నల్ల కృష్ణవేణి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లౌల సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో తన వెంట తెర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పంజల రాజు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగు పుల్లయ్య, వాకిటి విమల,ఇరుకుల సునీత, నల్ల యాదగిరి, భూరెడ్డి సుధాకర్ రెడ్డి, మంత్రి శంకరయ్య, పంజల రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి తో భూ సమస్యల పరిష్కారం

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం భూభారతి చట్టం
- ప్రతి మనిషికి ఆధార్ సంఖ్య లాగానే ప్రతి భూమికి భూధార్ సంఖ్య
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్
- ధరణితో దరిద్రం పోయింది ఎమ్మెల్యే







**తుంగతుర్తి,ఏప్రిల్ 24,( మన న్యూస్)ః** భూ భారతి చట్టం 2025 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నందు భూ భారతి చట్టం 2025 పై అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్, కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజలకు చట్టంపై అవగాహన తెచ్చేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుందని సమస్యలను బట్టి తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చు అన్నారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారిని ప్రభుత్వం త్వరలో నియమిస్తుందని చెప్పారు. 2014 జూన్ 2 కి ముందు సాదా కాగితం, స్టాంప్ పేపర్ పై కొనుగోలు చేసి 12 సంవత్సరాలు సాగులో ఉన్నవారు దరఖాస్తు చేసుకున్న సాధా బై నామ దరఖాస్తులు పరిశీలించి వాటిని పట్టాదార్ పాస్ బుక్ నందు అప్డేట్ చేస్తామని తెలిపారు. వారసత్వం/ పౌతి అమలు చేసేటప్పుడు కుటుంబ సభ్యులందరికీ గ్రామపంచాయతీలో నోటీసులు ఇచ్చి వారం రోజులు గడువు ఇస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చనన్నారు .అలాగే పౌతి అమలు అయినా తర్వాత కూడా మార్పులకు అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణలో భాగంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి ప్రతి రైతుకి వన్( బి ) అందజేస్తామని ఏవైనా తప్పులు ఉంటే సరిచేస్తామని తెలిపారు. విస్తీర్ణంలో మార్పులు, మిస్సింగ్ సర్వే నెంబర్, సవరణలు లాంటి సమస్యకి మీసేవ ద్వారా కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకునేలా భూ భారతి పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి వ్యక్తి ఆధార్ ఉన్నట్లుగా ప్రతి భూమికి భూధార్ అనే యూనిక్ నెంబర్ ఇచ్చి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూభారతి పోర్టల్ అప్డేట్ చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి భూమి గల రైతుకు లెక్క పక్కాగా ఉంటుందని అన్నారు. భూభారతి చట్టం పై స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ చట్టాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందన్నారు రైతు లేనిదే రాజ్యం లేదని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలఎత్తకుండా భూ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఆలోచనతో ఈ చట్టం తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వం నడుస్తుందని ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు జరగలేదన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ లో కొల్లగొట్టిన భూములను భూ భారతి చట్టం ద్వారా పేదలకు రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా పాలనలో పంచుతామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ చట్టాలను తుంగలో తొక్కుతూ వారికి అనుకూలంగా ధరణి పోర్టల్ ను తీసుకు వచ్చిందని మండిపడ్డారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పేదల భూములకు భద్రత కల్పించేలా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి చట్టం ప్రారంభించినట్లు తెలిపారు .ధరణి చట్టం నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు స్వార్థం కోసం పేదల భూములను కొల్లగొట్టేందుకు రూపొందించిన చట్టమన్నారు ధరణితో దరిద్రం పోయిందన్నారు. ఈ చట్టంలోని అంశాలు పై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు మాధవరావు, తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ , ఉప్పుల రాంబాబు, అజయ్ , రైతులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పని దినాలు కుదింపు చట్ట వ్యతిరేకం

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు...



**మేళ్లచెరువు, ఏప్రిల్ 24 మనం న్యూస్ః** సిపిఎం,ప్రజా సంఘాలు,వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, మహిళా సంఘంల ఆధ్వర్యంలో చింతలపాలెం లో గురువారం ఇంటింటికి తిరిగి సభ్యత్వం క్యాంపెయిన్ నిర్వహించడం జరిగింది. ఉపాధి హామీ పని దినాలను కుదింపు చట్ట వ్యతిరేకం అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు అన్నారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేటట్లు తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తేవాలి అన్నారు.అన్యాయంపై బిజెపి ఎంపీలు, మంత్రులు నోరువిప్పాలిని డిమాండ్ చేశారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పని దినాలు 8 కోట్ల నుండి 6.5 కోట్ల పని దినాలను తగ్గించడానికి వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధపడాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ బిజెపి ఎంపీలు మంత్రులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన తెలంగాణ రాష్ట్రం 1.5 కోట్ల పని దినాలను కోల్పోతుందని లక్షలాది కుటుంబాలు పని కోసం ఇతర ప్రాంతాలకు వలసబోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనుల కోసం వలసలు వెళ్లే వారిని నిలవరించడం కోసం గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పనిని గ్యారెంటీ చేసిందని అన్నారు. ఈ మౌలిక ఉద్దేశానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం దుర్మార్గమైన చర్య అనిబిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఒక పథకం ప్రకారమే గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలను నీరుగారిస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కొత్త జాబ్ కార్డులను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఆపివేసిందన్నారు.పెద్ద ఎత్తున బడ్జెట్ లో నిధులను కోత విధించిందని అన్నారు. ఉదయం పూట సాయంత్రం పూట ఆన్లైన్ మస్టర్ , ఆధార్ కార్డు బ్యాంక్ ఎకౌంటు ఉపాధి జాబ్ కార్డు నంబర్ల ఆన్లైన్ పేరుతో కోట్లాదిమంది పేదలను ఉపాధి పనికి దూరంగా నెట్టిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలుగా ఉన్న దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు మూడు పూటల బువ్వ తినడం చూసి తట్టుకోలేకనే బిజెపి పేదల పొట్ట కొట్టాలని చూస్తుందని విమర్శించారు. తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అన్ని గ్రామాలలో కూలీలకు విస్తృతంగా పనులు కల్పించి రోజు కూలి 600 ఇచ్చి ఏడాదికి 200 రోజులు పరిధిలో కల్పించాలని కోరారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వట్టేపు సైదులు, రైతు సంఘం జిల్లా నాయకులు కందుల సుందరమల్లేశ్వర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసన బోయిన హుస్సేన్, నాయకులు ఆరే రామకృష్ణారెడ్డి, జంపాల స్వరాజ్యం, గుండు సైదులు, భూలక్ష్మి, పుల్లయ్య, షేక్ జానీ మియా, షేక్ మక్బూల్, వెంకన్న, దేశ బోయిన వెంకన్న, కందుల భాస్కర్ రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

- వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయలక్ష్మి



**నేరేడుచర్ల, ఏప్రిల్ 24 మనం న్యూస్ః** భారత దేశభద్రతకు పెను సవాల్ గా మారిన ఉగ్రవాదాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాదాన్ని అంతమొందించాలి అని వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం నేరేడుచర్లలో వాసవీ మరియు వనితా క్లబ్ ల ఆధ్వర్యంలో పహల్గామ్ లో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులను నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఉగ్ర మూకలు సైనికుల ముసుగులో టూరిస్టుల వద్దకు వచ్చి కాల్పులు జరిపి 27 మంది అమాయకులను పొట్టన పెట్టుకోవడం పిరికి పందల చర్య అని అభివర్ణించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకొని ఉరితీయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టి ఉగ్రవాదాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ పిఆర్ఓ గరిణె అరుణ , డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్తా లక్ష్మణ్, జిల్లా సాంప్రదాయాల ఇన్చార్జి వీరవల్లి శ్రీలత, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీ నరసింహారావు, వాసవి మరియు వనిత క్లబ్ అధ్యక్షులు ఐత సుమన్ గరిణె జ్యోతి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు, సభ్యులు మురారి శెట్టి రమేష్, గుండా సత్యనారాయణ, ఊటుకూరు నటరాజ్, గజ్జల కోటేశ్వరరావు, పాల్వాయి గోపాలకృష్ణ, నీలా శ్రీనివాస్, పివిటి, గరిణె వాసు, గుంటూరు శ్రీను, వీరవల్లి కోటేశ్వరరావు, మా శెట్టి మోహన్, కట్టమూరి మధు, చారు గుండ్ల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి అశోక్ గంధం అశోక్, చెరుకు రాము, అనిల్ పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడవాలి



- జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

**తుంగతుర్తి ఏప్రిల్ 24, ( మనం న్యూస్ )ః** గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,యువతను సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం అని జిల్లా అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ గ్రామానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉందన్నారు.ఒకరికొకరికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని అన్నారు,అంతే కానీ గొడవల జోలికి వెళ్ళితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామంలోని ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ముఖ్యంగా నేడు యువత చెడు మార్గంలో ప్రయాణిస్తుందని డ్రగ్స్,గంజాయి,సైబర్ క్రైమ్,బెట్టింగ్ లకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. దీనివల్ల వారి జీవితాలు చెడిపోవడం కాకుండా తల్లిదండ్రులు అవమానాలకు గురికావాల్సి వస్తుందని అన్నారు. అందుకే యువత సన్మార్గంలో ప్రయాణించాలని హితువు పలికారు.ఈ సందర్భంగా గంజాయి ఆన్లైన్ మోసాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహారావు,ఎస్సై క్రాంతి కుమార్, స్టేషన్ సిబ్బందితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 28న చలో కలెక్టరేట్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**మోటకొండూర్, ఏప్రిల్ 24 (మనం న్యూస్)ః** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా సమస్యల సాధనకై ఈనెల 28న చలో కలెక్టరేట్ సిపిఎం పాదయాత్ర మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ పిలుపును ఇచ్చారు. గురువారం రోజున మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే సిపిఎం పార్టీ పాదయాత్ర సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయం నుండి పెద్ద ఎత్తున మహాధర్నను కలెక్టరేట్ ముందు జయప్రదం చేయాలని, కరపత్రాన్ని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మరియు జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ విడుదల చేసి మాట్లాడుతూ, పాలకులు మారుతున్నారు కానీ పాలనా తీరు మారడం లేదని, ప్రజా సమస్యలపై సమగ్ర ప్రణాళిక లేక అనేక ప్రజా సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో చేపట్టవలసిన సమస్యలను ఏళ్ల తరబడి నాన్చుతున్నారని, జిల్లాలో సాగునీటి సమస్య కీలకంగా ఉన్నదని బస్వాపురం రిజర్వాయర్ పనులు రెండు దశాబ్దాలు కావస్తున్న ఇంతవరకు పూర్తి కాలేదని, ప్రజా ఆందోళనల వల్ల మంజూరైన ధర్మారెడ్డి పల్లి పిల్లాయి పల్లి పునాది గాని కాల్వ పనులు ఎంత కాలానికి పూర్తి అవుతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలువలు తవ్వి ఏళ్లు గడిచిన నీళ్లు ఎందుకు పారడం లేదని, షామీర్పేట ను రిర్వాయర్ చేసి బొమ్మలరామారం తుర్కపల్లి భువనగిరి ప్రాంతాలకు నీరిస్తామని ఏళ్ల తరబడి పోరాడిన పాలకులను ఏమని సంబోధించాలని, పెండింగ్ సమస్యలు కారణం నిర్లక్ష్యమేనని అన్నారు. జిల్లాలో పలుచోట్ల భూ సమస్యలు ఉన్నాయని గత 10 సంవత్సరాలుగా ఏ ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వలేదు. ఇంటి స్థలాల కోసం ప్రజలు ఆందోళనల బాట పడితే సానుకూలంగా వివరించకుండా పోలీసుల బెదిరింపులు అరెస్టులు చేస్తున్నారని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అతీగతి లేక మూలుగుచున్నవని, కొన్ని గ్రామాల్లో రేషన్ షాపులకు దూరంగా వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాలలో లింకు రోడ్లు అంతర్గత రోడ్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం పార్టీ జిల్లాలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని సిపిఎం పార్టీ పిలుపు అందుకొని ప్రజలు పెద్ద ఎత్తున ఈ మహా దర్నాను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ బట్టుపల్లి అనురాధ ,జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, మద్దెల రాజయ్య, సిరిపంగి స్వామి, రచ్చ గోవర్ధన్, వేముల బిక్షం, గాజుల ఆంజనేయులు, పల్సం స్వామి, రాగిరి కిష్టయ్య, సీసా శ్రీనివాస్, వడ్డే బోయిన మహేందర్, చెరుకు అనిల్, మొగిలిపాక నరసింహ, మల్లేష్, కొల్లూరి ఐలయ్య, తాడబోయిన యాదయ్య, నరసింహ, బందెల పోచయ్య, వరప్రసాద్, నాగరాజు, బోగారం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రైతుకు వరం



- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (మనంన్యూస్)**: భూ భారతి చట్టం రైతుకు వరం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హన్వాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూముల విషయంలో గత ప్రభుత్వం తెచ్చిన ధరణి లో కాళ్ళు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగిరాని అన్నారు.ధరణి చట్టం లో తప్పుల సవరణకు అధికారులకు అధికారాలు లేవని అన్నారు.కోర్టు కు వెళ్ళ వలసి వచ్చేదని అన్నారు. రైతులకు,భూ హక్కుదారులకు వెసులు బాటు కల్పించి న్యాయంగా దక్కాల్సిన భూ వాటా హక్కును కల్పించేలా భూ భారతి చట్టం రూపొందించినట్లు తెలిపారు.న్యాయ నిపుణులు,మేధావులతో సంప్రదించి అసెంబ్లీ లో భూ భారతి చట్టం ఆమోదించి ఏప్రిల్ 14 న ప్రారంభించినట్లు తెలిపారు.భూ భారతి చట్టం గొప్ప మార్పు తీసుకు వచ్చే చట్టం అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉన్న ధరణి వల్ల కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టింది అని ఆయన మండిపడ్డారు. గ్రామీణ ప్రాంత రైతులకు ఈ భూ భారతి చట్టం ఉపయోగపడుతుంది అని ఆయన చెప్పారు. భూ భారతి చట్టం కొనుగోలు , దానం, బదిలీ, భాగపంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారు పుస్తకం జారీ చేస్తారని రిజిస్ట్రేషన్ , మ్యుటేషన్ ఒకే రోజు జరిగిపోతుందని ఆయన తెలిపారు. గతంలో హక్కుల రికార్డులో తప్పుల సవరణకు అవకాశం ఉండేది కాదని కానీ భూభారతిలో తప్పుల సవరణకు రికార్డులలో అవకాశం ఉందని ఆయన తెలిపారు. గతంలో గ్రామాల్లో ఉన్న విఆర్ఎ, వీఆర్వో వ్యవస్థ ను త్వరలో తీసుకురాబోతున్నాం అని తెలిపారు. అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ఎవరైనా పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ఎవరైనా పేదవారి మధ్య విభేదాలు సృష్టిస్తే సహించమని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం,నాయకులు ప్రజలకు మంచికి పని చేయాలని,అప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ని ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ప్రజలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు అన్నారు. హన్వాడ మండలంలో 5100 మంది రైతులకు 38 కోట్ల రూ. లు రుణ మాఫీ చేసినట్లు తెలిపారు.31 మంది రైతు కుటుంబాలకు రైతు భీమా కింద ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు రైతు భరోసా కింద 13 వేల మందికి పెట్టు బడి సాయం వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.గృహ జ్యోతి కింద 2 యూనిట్లు విద్యుత్తు వినియోగించిన వారికి 7600 కుటుంబాలకు డబ్బులు ఇచ్చి కొట్టినట్లు తెలిపారు 5800 మందికి గ్యాస్ సబ్సిడీ అందజేసినట్లు తెలిపారు మండలంలోని గ్రామాల్లో 9 కోట్ల రూపాయలతో సి.సి రోడ్లు, డ్రైన్ లు నిర్మించినట్లు తెలిపారు. 7 కోట్ల 50 లక్షల రూ లతో బి.టి.రోడ్లు పనులు చేపట్టినట్లు తెలిపారు. కల్యాణ లక్ష్మి కింద పేద ఆడ బిడ్డల పెండ్లిళ్లకు 262 మందికి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.5 కోట్ల రూ. ల వ్యయంతో రెండు సబ్ స్టేషన్ లు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని లో ఓల్టేజ్ సమస్య లేకుండా రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. త్రాగునీటి ఇబ్బందులు లేకుండా 12 నెలల కాలంలో 42 బోర్వెల్స్ చేయడం జరిగిందని తెలిపారు మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా త్రాగు నీరు సమస్య ఉన్నట్టు దృష్టికి తీసుకువస్తే ఇలా కలెక్టర్ ప్రత్యేక పని నుంచి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు ప్రభుత్వం 5 లక్షలు రూ.లు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. 1225 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతులకు రుణమాఫీ చేశామని, ఆయన గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న హన్వాడ మండలం లోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు ఇండ్లు నిర్మాణం చేసేందుకు మహిళా సమైక్య ద్వారా ఒక్కరికి 50 వేల రూపాయల చెక్కు ను జిల్లా కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం హన్వాడ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ 8 మండలాల్లో ఇప్పటి వరకు భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు.భూ భారతి చట్టం పై రైతులు అవగాహన చేసుకొని గ్రామాల్లో రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజాపాలన గ్రామ సభలు ద్వారా కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు .వెరిఫికేషన్ తర్వాత కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు ఇందిరమ్మ ఇండ్లు వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు సన్న ధాన్యం కు క్వింటాలుకు 500 రూ.లు, బోనస్ అంద చేసినట్లు తెలిపారు. సన్న బియ్యం పంపిణీ రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భూమి ముఖ్యమైన ఆస్తి అని, భూమి తో తరతరాలుగా ఒక అనుబంధం ఉంటుందని అన్నారు భూమికి హక్కులు లేక కరెక్ట్ గా రికార్డులో రాక పోవడం బాధాకరం అన్నారు. ప్రజావాణి లో వచ్చే సమస్యల్లో 80 శాతం భూ సమస్యలు అని తెలిపారు పాస్ బుక్ లు,పహని నకలు ఉన్నా,విస్తీర్ణం రికార్డు లో నమోదు కాక పోవడం,కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేరి పోవడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. తెల్ల కాగితం మీద రాసుకుని కొనుగోలు కొనుగోలు చేసిన భూములు క్రమబద్ధీకరణకు చట్టం ఆకాశం కల్పిస్తుందని తెలిపారు ప్రభుత్వం సంవత్సరం పాటు వివిధ రాష్ట్రాల్లో భూ చట్టాలు అధ్యయనం చేసి నూతన భూ భారతి చట్టం,నియమాలు పొందు పరచి నట్లు తెలిపారు. ఏప్రిల్ 14 న అమలు చేసిన భూ భారతి చట్టంలో ధరణి లో లేని నిబంధనలు భూ వివాదాల పరిష్కారం కు నిబంధనలు వెసులుబాటు కల్పించడం జరిగిందని అన్నారు. 1971 లో అర్. ఓ చట్టం నిబంధనలు 1989 లో వచ్చినట్లు తెలిపారు 2020 లో వచ్చిన ధరణి చట్టంలో నిబంధనలు లేవని అన్నారు. ధరణి లో ఆపిల్ వ్యవస్థ లేదని నూతనంగా వచ్చిన భూభారతి చట్టంలో తాసిల్దారు ఆర్డిఓ జిల్లా కలెక్టర్ సి.సి.ఎల్.ఏ భూ ట్రిబ్యునల్ కు వెళ్లేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.వారసత్వంగా,విల్ ద్వారా వచ్చిన భూములు విరాసత్ చేసేందుకు 30 రోజుల్లో తహశీల్దార్ మ్యుటేషన్ చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు.లేకుంటే ఆటోమేటిక్ గా మార్పు జరుగుతుందని అన్నారు. సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములకు చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు రాష్ట్రంలో తొమ్మిది లక్షల మంది రైతులు సాదా సైనామా సమస్యతో ఉన్న రైతులు ఉంటే, జిల్లాలో దాదాపు 9 వేల మంది రైతులు ఉన్నారని తెలిపారు.ప్రతి భూమికి భూ దార్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందని,భూ దార్ ద్వారా భూ వివాదాలు తగ్గుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి. ఓ నవీన్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిఆర్డీవో నర్సింహులు, హన్వాడ మండల తహసిల్దార్ కిష్ట్యా నాయక్, ఎంపిడిఓ యశోద, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, నాయకులు కృష్ణయ్య యాదవ్, నవనీత, బుద్దారం సుధాకర్ రెడ్డి, యాదవ రెడ్డి, లింగం నాయక్, వెంకటయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పెన్షన్ ఇప్పించండి సార్లు ...!!

- వయో వృద్ధుడైన ఒక రిటైర్డ్ కార్మికుడి ఆవేదన



**మంచిర్యాల, ఏప్రిల్ 24 (మనం న్యూస్)**: సింగరేణి లో సుదీర్ఘ కాలం పనిచేసిన ఈ వ్యక్తి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. పేరు రాచర్ల మదునయ్య, జిడికె 6బి లో పని చేశారు. ఇతను గత పదిహేను సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయ్యాడు . ఇతనికి 14 వందల రూపాయల పెన్షన్ వస్తున్నది . కుటుంబ పోషణకు తనకు వచ్చే సింగరేణి (బొగ్గు) పెన్షన్ సరిపోవడం లేదని గత కేసిఆర్ ప్రభుత్వ పాలనలో ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు . నెలకు రెండు వేల రూపాయల పెన్షన్ మంజూరు అయింది. ఈ రిటైర్డ్ కార్మికుడు 2024 వరకు సింగరేణి పెన్షన్ తో పాటు ఆసరా పెన్షన్ తీసుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు . తాను సింగరేణి లో మారు పేరు తో ఉద్యోగం చేసి రిటైర్ అవుతే, స్వంత పేరు ఆసాల మదునయ్య అని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలో లో నమోదు ఉండటం వల్ల సింగరేణి పెన్షన్ గత మూడు నెలల నుంచి రావడం లేదని ఈ రిటైర్డ్ కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్వంత పేరు పై ఆధార్ కార్డు ఉందని, మారుపేరు పై ఆధార్ కార్డు సీడింగ్ చేస్తే ఆసరా పెన్షన్ రాదని, మారు పేరు వల్ల నాకు సింగరేణి పెన్షన్ బ్యాంకు వారు ఇవ్వడం లేదని, ఆధార్ కార్డు మార్చుకుంటేనే పెన్షన్ వస్తుందని బ్యాంకు అధికారులు అంటున్నారని తెలిపారు . సంబంధిత అధికారులు స్పందించి తనకు సింగరేణి పెన్షన్ ఇప్పించాలని అందరిని ఆయన వేడుకుంటు తిరుగుతుండటం చుస్తున్నవారికి భాదను కలిగిస్తున్నది . మరి ఈ వయో వృద్ధుడైన సింగరేణి రిటైర్డ్ కార్మికుని సమస్య విషయంలో సింగరేణి అధికారులు , అలాగే సిఎంపిఎఫ్ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

## కత్తిగూడెంలో పెసా గ్రామ సభ

- ఇసుక రీచ్ నిర్వాహణ శ్రీ ఆంజనేయ సొసైటీకి అప్పగిస్తూ ఏకగ్రీవ తీర్మానం



**మంగపేట, ఏప్రిల్ 24 ( మనం ప్రతినిధి ) :** మండలంలోని కత్తిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇసుక రీచ్ నిర్వహణ గ్రామంలోని శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక మరియు మొరం క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యాక్స్ లిమిటెడ్ కు దక్కింది. కత్తిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో రిజిస్టర్డ్ ఇసుక లేబర్ కాంట్రాక్టర్ సొసైటీలలో ఇసుక రీచ్ నిర్వహణ కోసం సొసైటీని గుర్తించడం కోసం కత్తిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కత్తిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి చదలవాడ కృష్ణాజీ ఆధ్వర్యంలో గురువారం పెసా గ్రామ సభ నిర్వహించారు. ఈ పెసా గ్రామ సభకు మంగపేట ఎంపీడీఓ భద్రు నాయక్, కత్తిగూడెం గ్రామ ప్రత్యేక అధికారి భిక్షపతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కత్తిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక మరియు మొరం క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యాక్స్ లిమిటెడ్, శ్రీ సమ్మక్క సారలమ్మ ట్రైబల్ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అనే రెండు సొసైటీలు ఉన్నాయి. అయితే అందులో శ్రీ సమ్మక్క సారలమ్మ ట్రైబల్ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సొసైటీకి సంబంధించి ఆడిట్ కాకపోవడంతో కేవలం శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక మరియు మొరం క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యాక్స్ లిమిటెడ్ మాత్రమే రిజిస్టర్డ్ ఇసుక లేబర్ కాంట్రాక్టర్ సొసైటీగా గుర్తించి ఉన్నతాధికారులు ఉత్తర్వులు పంపినట్లు అధికారులు తెలిపారు. కత్తిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 12 మంది గిరిజన ఓటర్లు ఉన్నారు. గ్రామసభ నిర్వహించాలంటే గ్రామంలోని గిరిజన ఓటర్లలో మూడవ వంతు (4 ) మంది హాజరు కావాలి. గురువారం నిర్వహించిన పెసా గ్రామ సభకు మొత్తం12 మంది ( వంద శాతం ). నిభందనల ప్రకారం కోరం ఉండడంతో అధికారులు గ్రామ సభను నిర్వహించారు. సొసైటీని గుర్తించడం కోసం చేతులు ఎత్తి అభిప్రాయం తెలిపే పద్ధతిలో అధికారులు ఓటింగ్ నిర్వహించారు. శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక మరియు మొరం క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యాక్స్ లిమిటెడ్ సొసైటీకి అనుకూలంగా 12 మంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. దీంతో సభ్యుల ఏకగ్రీవ అభిప్రాయం మేరకు శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక మరియు మొరం క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యాక్స్ లిమిటెడ్ సొసైటీకి ఇసుక రీచ్ నిర్వహణ భాద్యతలు అప్పగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంగపేట ఎంపీడీఓ భద్రు నాయక్ మాట్లాడుతూ ఇసుక క్వారీల ద్వారా గిరిజనులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగపేట ఎంపీడీఓ భద్రు నాయక్, కత్తిగూడెం గ్రామ ప్రత్యేక అధికారి భిక్షపతి, కత్తిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి చదలవాడ కృష్ణాజీ, కారోబార్ వల్లి శ్రీను, పెసా సభ్యులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## మే నెల మొత్తం అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి




**నస్పూర్, ఏప్రిల్ 24(మనంన్యూస్)**: అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంగన్వాడి ఉద్యోగులకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సూపర్డెంట్, ఐసిడిఎస్ పిడి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గార్లకు వేర్వేరుగా వినతిపత్రలు అందజేశారు. ఈ సందర్భంగా భానుమతి అంగన్వాడి యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా పై తరగతి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించింది. కానీ అంగన్వాడి కేంద్రాలకు మాత్రం వేసవి సెలవులు ఇంకా ప్రకటించలేదు. మరి అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలు ఐదు సంవత్సరాలు లోపు ఉన్నవాళ్లు. ఇప్పటికే జిల్లాలో రాష్ట్రంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక చాలామంది చనిపోతున్నారు. ఇంత ఎండలో అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను వారి తల్లిదండ్రులు ఎండలకు భయపడి సరిగ్గా పంపించడం లేదు.అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యం, రక్షణ కూడా ప్రభుత్వానికి అవసరమే అందుకే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మే నెల మొత్తం కూడా అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర మంత్రి శీతక్క గారు కూడా మే నెల సెలవులు ఇస్తామని హామీ ఇచ్చారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగన్వాడీ కేంద్రాలకు ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు వేసవి సెలవులు కూడా ఇచ్చింది. కాబట్టి అంగన్వాడి కేంద్రాల పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి సెలవులు మంజూరు చేయాలి. లేకుంటే ఆందోళనలు చేస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు, సవిత విరోనిక అనురాధ పద్మ ప్రవీణ శారద సువర్ణ సుగుణ ,చిందం వెంకన్న, పళ్ళికొండ శేఖర్ జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మెట్ పల్లి,ఏప్రిల్ 24 ( మనం న్యూస్)**: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో. గురువారం మండలానికి చెందిన పలు గ్రామాల కు సంబంధించిన తొంభై లక్షల పదివేళ రూపాయల నాలుగు వందల నలపై రూపాయల. విలువగల 90 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నియోజకవర్గంలోని బీదస్తులు అన్ని కులాల వారు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసే సమయంలో ఇలాంటి పథకాలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డి, అధికారులు లబ్ధిదారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మతిలేని పనిచేసే మతోన్మాదుల పని పట్టాలి

- మృతుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి
- బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్

**మంచిర్యాల, ఏప్రిల్ 24(మనం న్యూస్)**: జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గాం యాత్రికులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ఎంతో మంది మరణానికి కారకులైన మతి లేని పనిచేసిన మతోన్మాదుల పని పట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రం లో మృతులకు ఘన నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవా ల న్నారు. భారత నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేసి, భద్రత సలహాదారులను మార్చాల ని, ఈ ఘటనకు కారకులైన ముష్కరులు ప్రపంచంలో ఏ మూలన దాక్కున అంత మొందించాలని, మతోన్మాదులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదంతో అనగ తొక్కలన్నారు. ఈ కార్యక్రమం లో గాజుల శంకర్, ఎండి మతిన్ ఖాన్, ఐలేని రాజు తదితరులు పాల్గొన్నారు.



## మంథని జేఎన్టీయూహెచ్‌లో ఆరు రోజులుగా కొనసాగుతున్న సమ్మె

**రామగిరి ఏప్రిల్ 24 మనం న్యూస్**: తెలంగాణ రాష్ట్రం లోని 12 విశ్వ విద్యాలయాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జేఎన్టీయూహెచ్ మంథని ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు స్టేట్ కో ఆర్డినేషన్ కమిటి పిలుపు మేరకు నిరవధిక సమ్మెను ఆరో రోజు కూడా కొనసాగించారు. నిరవధిక సమ్మెకు మద్దతుగా ఆరో రోజు నిరవధిక సమ్మెకు మద్దతుగా విద్యార్థులు తరలివచ్చారు. ఇప్పుడు కొనసాగుతున్న 10 నుంచి 30 ఏళ్ల అనుభవం గల కాంట్రాక్ట్ అధ్యాపకులను ముందుగా క్రమబద్ధీకరించిన తర్వాతనే మిగిలిన పోస్టులను నిరుద్యోగుల కోసం కేటాయించాలని తద్వారా విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాలని కోరారు.




## కేకేఓసిపి కార్మికులకు 10 శాతం ఇంటి అద్దె భత్యం ఇవ్వాలి



- యాక్టింగ్ మేనేజర్ కు వినతిపత్రం అందజేత

**మందమర్రి, ఏప్రిల్ 24 మనం న్యూస్**: మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్లు లేని కేకేఓసిపి గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు, ఇతర గనుల్లో చెల్లిస్తున్న విధంగానే 10 శాతం ఇంటి అద్దె భత్యం (హెచ్.ఆర్.ఎ) చెల్లించాలని గురువారం గని కార్మికులు యాక్టింగ్ మేనేజర్ శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని ఇతర గనుల్లో క్వార్టర్లు లేని ఉద్యోగులకు 10 శాతం ఇంటి అద్దె భత్యం చెల్లిస్తున్నప్పటికీ, అదే పరిధిలో పనిచేస్తున్న తమకు మాత్రం కంపెనీ ఎక్సెస్ క్వార్టర్లు ఉన్నాయనే కారణంతో భత్యం మినహాయించటం అన్యాయం అని ఉద్యోగులు అన్నారు. ఇంతకు ముందు అదే స్థలంలో ఉన్న కేకే-2 గనిలో పనిచేసిన ఉద్యోగులకు కూడా 2016 వరకు 10 శాతం ఇంటి అద్దె భత్యం చెల్లించారనీ, ఇప్పుడేమాత్రం తాము ఇలాంటివే పనులు చేస్తూ కూడా అర్హత కోల్పోతున్నామన్న బాధ వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని, ఇతర గనుల్లో చెల్లిస్తున్న విధంగా తామూ అర్హులమనే అభిప్రాయంతో కంపెనీ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆవిష్కృత్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరించిన జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్

**రామగిరి, ఏప్రిల్ 24 మనం న్యూస్**: మంథని జెన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో మే 7, 8 తేదీలలో సాంకేతిక పండుగ జరుగనుంది. టెక్నికల్ ఫెస్టకు సంబంధించిన ఆవిష్క ృత్ 2025 పోస్టర్ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ బి విష్ణువర్ధన్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఆవిష్క ృత్ 2025లో ఆరు బ్రాంచ్లకు చెందిన విద్యార్థులు టెక్నికల్, నాన్ టెక్నికల్, కల్చర్ కారయక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి బ్రాంచ్ ఒక ప్రత్యేకమైన ప్రాజెక్టును తయారుచేస్తుంది. మే 7న సాయంత్రం మూడవ సంవత్సర విద్యార్థులు ఫ్లాష్మాబ్ నిర్వహించనున్నారు. 8న కళాశాల వార్షికోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమాలను దిగ్విజయం చేయడానికి విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్, పిడి పింగిళి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్స్ బి శివ, కె అఖిల్, సిహెచ్ వివేక్ మిట్టల్ బిఆర్ కుశ్వంత్, జె హేమసుందర్, పి దేవిచరణ్, మహిళా కోఆర్డినేటర్స్ ఎం నిఖిత, ఎస్ అనుపమ, పి అలేఖ్య, పి శిరీష, సిహెచ్ హరిక, జి సహస్రతేజ, విద్యార్థులు పాల్గొన్నారు. మైనింగ్కు సంబంధించిన పోస్టర్ను సైతం ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైనింగ అధ్యాపకులు గజేందర్, మధు, రాకేష్, ప్రశాంత్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



# భవిష్యత్తులోనూ పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోం: బీసీసీఐ ఉపాధ్యక్షుడు

పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత క్రికెట్ బోర్డు మరో కఠిన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఎప్పుడూ పాకిస్థాన్ తో ద్వైపాక్షిక సిరీసులను ఆడబోమని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టంచేశారు. 2012-13 నుంచి ఇప్పటివరకు టీమ్ఇండియా పాక్ గడ్డపై అడుగుపెట్టలేదు. కేవలం ఐసీసీ ఈవెంట్లలో తటస్థ వేదికలపైనే తలపడుతోంది. ఐసీసీ నిబంధనలు పాటించడం కోసమే బీసీసీఐ తన జట్టుకు అనుమతిస్తోంది. ఇదే విషయంపై ఐసీసీ ఆలోచన చేయాలన్నట్లుగా రాజీవ్ శుక్లా పరోక్షంగా సూచించారు. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ లోనూ ఇరు దేశాలు తలపడ్డాయి. ఆ సమయంలో పలువురు మాజీ క్రికెటర్లు భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ లు ఉంటే బాగుంటుందని సూచించారు. ఇప్పుడు బీసీసీఐ స్పష్టత ఇవ్వడంతో అలాంటి ఆలోచనలకు తెరపడినట్లే.



''ఉగ్రదాడికి గురైన బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే అదే చేస్తాం. ఇప్పటికే పాకిస్థాన్ తో ద్వైపాక్షిక సిరీస్ లను ఆడటం లేదు. ముమ్ముందూ ఆ జట్టుతో ఆడే ప్రసక్తే లేదని బలంగా చెబుతున్నాం. అయితే, ఐసీసీ ఈవెంట్ల విషయానికొచ్చేసరికి.. అంతర్జాతీయ క్రికెట్ మండలిని గౌరవిస్తూ తటస్థ వేదికలపై ఆడుతున్నాం. ఇప్పుడు దేశంలో జరిగిన దానిపై ఐసీసీకి అవగాహన ఉందనుకుంటున్నా'' అని రాజీవ్ శుక్లా వెల్లడించారు.

క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది: దేవజిత్ సైకియా

పహల్గాం ఘటనను ఇప్పటికే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ లో సన్రైజర్స్ హైదరాబాద్ - ముంబయి ఇండియన్స్ మ్యాచ్ సమయంలో సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా ఎలాంటి సంబరాలు లేకుండా మ్యాచ్ ను నిర్వహించారు. ''జీవితాలు కోల్పోయిన అమాయక ప్రజలకు అండగా నిలుస్తాం. ఈ ఘటన గురించి తెలియగానే క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. బీసీసీఐ తరఫున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఈవిషయంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలిపి సంఘటితంగా పోరాడుదాం'' అని తెలిపారు.



# పంత్ పాట్లు

ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికే ఆటగాడు బాగా ఆడిన దాఖలాలే పెద్దగా కనిపించవు! యువరాజ్ సింగ్, బెన్ స్టోక్స్, క్రిస్ మోరిస్.. ఇలా ఏ ఆటగాడిని చూసినా అదే వరస! నిరుడు రూ.24.75 కోట్లతో కోల్కతా సొంతమైన మిచెల్ స్టార్క్ కూడా ఆ ధరకు న్యాయం చేయలేకపోయాడు. ఈ ఏడాది రూ.27 కోట్లతో కొత్త రికార్డు నెలకొల్పిన రిషబ్ పంత్ అయినా కథ మారుస్తాడనుకుంటే.. మునుపెన్నడూ లేనంత పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. 9 మ్యాచ్లు ఆడి కేవలం ఒకే ఒక్క అర్ధశతకం సాధించడం ఇందుకు నిదర్శనం. రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఏడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్న రిషబ్ పంత్.. గత ఏడాది ఐపీఎల్ తోనే పునరాగమనం చేశాడు. ఆ టోర్నీలో నిలకడగా రాణించడమే కాక, అంతర్జాతీయ క్రికెట్లోనూ సత్తా చాటాడు. ఐపీఎల్ ముంగిట అతను గొప్ప ఫామ్లో లేకపోయినా.. దిల్లీ జట్టును వీడి వేలంలోకి వచ్చిన అతడిని దక్కించుకోవడానికి ఫ్రాంఛైజీల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. దీంతో పంత్కు రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల రేటు పలికింది.

అతణ్ని సొంతం చేసుకున్న లఖ్నవూ కెప్టెన్ ను చేసింది. అయితే ఐపీఎల్లో ఇలా అత్యధిక రేటు పలికిన ఆటగాళ్లలో చాలావరకు నిరాశపరిచిన నేపథ్యంలో పంత్ ఆట మీదా అభిమానులకు సందేహాలు కలిగాయి. చివరికి ఆ సందేహాలే నిజమవుతున్నాయి. 9 మ్యాచ్లో 13.25 సగటుతో కేవలం 106 పరుగులే చేశాడు లఖ్నవూ కెప్టెన్. మార్క్రమ్, మిచెల్ మార్ష్, పూరన్లతో బలంగా కనిపిస్తున్న ఎల్ఎస్జీ బ్యాటింగ్ ఆర్డర్లో పంత్ ఒక్కడే బలహీనంగా కనిపిస్తున్నాడు. మిగతా బ్యాటర్లు ఎంత రాణిస్తున్నా పంత్ వైఫల్యం జట్టును వెనక్కి లాగుతోంది. మంగళవారం దిల్లీతో మ్యాచ్ లో సమద్, బదోని, మిల్లర్లను ముందు పంపి.. పంత్ ఆఖరి ఓవర్లో బ్యాటింగ్కు రావడం అభిమానులకు విస్మయం కలిగించింది. చెన్నైతో లఖ్నవూ ఓటమి పాలైన మ్యాచ్లో మినహా పంత్ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. అతను మూడుసార్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. పంత్ కెప్టెన్గానూ చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించలేకపోతున్నాడు. తన వ్యూహాలు, నిర్ణయాలు విమర్శల పాలవుతున్నాయి. చెన్నైతో మ్యాచ్లో చక్కగా బౌలింగ్ చేస్తున్న రవి బిష్ణోయ్తో కోటా పూర్తి చేయించకుండా, శార్దూల్ను దించడం, అతను భారీగా పరుగులిచ్చుకుని లఖ్నవూ ఓటమికి కారకుడవడంతో పంత్ మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. దిల్లీతో గత మ్యాచ్లోనూ పంత్ కెప్టెన్సీ మీద ప్రశ్నలు తలెత్తాయి. రిషబ్ పదే పదే అసహనానికి గురి కావడం.. సహచరులపై అరవడం.. డగౌట్లో కోచ్ జహీర్ ఖాన్తోనూ వాదనకు దిగడం చర్చనీయాంశమైంది. పంత్ వికెట్ కీపింగ్లోనూ పలు తప్పిదాలు చోటు చేసుకుంటుండడం అతనెంత ఒత్తిడిలో ఉన్నాడో తెలియజేస్తోంది. ఓవైపు టీమ్ఇండియా లో వివిధ ఫార్మాట్లలో వికెట్ కీపర్ బ్యాటర్ల మధ్య పోటీ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్లో మిగతా మ్యాచ్లో పంత్ సత్తా చాటకపోతే.. భారత జట్టులో అతడి స్థానానికి ముప్పు తప్పకపోవచ్చు!





IPL-2025



బీసీసీఐ అండర్-19

## హైదరాబాద్ సిటీ అమ్మాయిలకు అవకాశం

- స్థానం దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు

**సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (మనం న్యూస్):** బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి సిటీకి చెందిన ఆరుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఒకే సారి ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు



త్వరలోనే జట్టు-ఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీ, కాగా, టీమ్ -డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్-బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్-19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో శుక్రవారం ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొంటారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

# 'శుభం' ట్రైలర్.. ఏరోజైనా.. ఎప్పుడైనా రావచ్చు – సమంత



స్టార్ బ్యూటీ సమంత ఇప్పుడు నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. 'ట్రాలాలా' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించిన సమంత తొలి సినిమాగా 'శుభం' అనే చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తోంది. ఈ సినిమాలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రవీణ్ కండ్రేగుల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను కామెడీ జోనర్లో తెరకెక్కిస్తున్నారు. ఇక ఇప్పటికే షూటింగ్ ముగించుకున్న ఈ సినిమాను వేసవి కానుకగా మే 9న రిలీజ్ చేసేందుకు సమంత ప్లాన్ చేస్తోంది. అయితే, ఈ సినిమా ట్రైల్ప సామ్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చింది. 'శుభం' ట్రైలర్.. ఏరోజైనా.. ఎప్పుడైనా రావచ్చు.. అంటూ సామ్ తన సోషల్ మీడియా అకౌంట్లో పోస్ట్ చేసింది. దీంతో ఈ సినిమా ట్రైలర్ త్వరలోనే రిలీజ్ కాబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ సినిమాకు వివేక్ సాగర్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

## ఆ డైరెక్టర్ తో కళ్యాణ్ రామ్ నెక్స్ట్ మూవీ..?



నందమూరి కళ్యాణ్ రామ్ రీసెంట్గా 'అర్జున్ ఖి/ వైజయంతి' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేసిన ఈ సినిమా యాక్షన్ డ్రామాగా తెరకెక్కించారు. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. అయితే, ఈ సినిమా ఊహించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఈ సినిమా రిజల్ట్ తర్వాత కళ్యాణ్ రామ్ ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్టు పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నాడట. ఈ క్రమంలోనే గిరీశయ్య అనే డైరక్టర్ కళ్యాణ్ రామ్కు ఓ కథను చెప్పినట్లు తెలుస్తోంది. కల్ట్ మూవీ అయిన 'అర్జున్ రెడ్డి' చిత్రాన్ని తమిళంలో 'ఆదిత్య వర్మ' అనే పేరుతో రీమేక్ చేశాడు గిరీశయ్య. ఇక మెగా హీరో వైష్ణవ్ తేజ్ నటించిన 'రంగ రంగ వైభవంగా' సినిమాను కూడా ఆయనే డైరెక్ట్ చేశాడు. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కోసం ఓ పవర్ఫుల్ యాక్షన్ డ్రామా కథను రెడీ చేశాడట. అయితే, కళ్యాణ్ రామ్ ఈ డైరెక్టర్ని హోల్డ్లో పెట్టినట్లుగా తెలుస్తోంది. 'బింబిసార 2' సినిమాను స్టార్ట్ చేయాలని కళ్యాణ్ రామ్ ఆలోచిస్తున్నాడట. కానీ, ఆ సినిమాకు కావాల్సిన స్క్రిప్ట్ వర్క్ ఇంకా పూర్తి కాలేదని.. అందుకే గిరీశయ్యతో కళ్యాణ్ రామ్ సినిమా చేసే అవకాశం ఉందని సినీ సర్కిల్స్లో టాక్ వినిపిస్తోంది.

# మెగాస్టార్ సినిమాలో కార్తికేయ విలనిజం..?

టాలీవుడ్ లో ఇప్పుడు అందరి చూపులు మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కబోయే సినిమాపై ఉన్నాయి. ఈ సినిమాను ఇప్పటికే అఫీషియల్ గా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఎప్పుడెప్పుడు ఈ సినిమా షూటింగ్ మొదలుపెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ వార్త వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవిని ఢీకొనే విలన్ పాత్రను పవర్ ఫుల్ గా డిజైన్ చేశాడట అనిల్ రావిపూడి. దీంతో ఈ పాత్రలో నటించేందుకు యంగ్ హీరో కార్తికేయ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావిస్తుందట. గతంలోనూ ఒకట్రెండు చిత్రాల్లో విలన్ గా తన సత్తా చాటాడు ఈ యంగ్ హీరో. దీంతో ఇప్పుడు ఈ హీరోకు మెగా ఛాన్స్ దక్కే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు చిత్ర వర్గాల టాక్. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేయనున్నారు.





# నేను పాకిస్థానీని కాదు..

కశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిని యావద్భారతం ఖండించింది. ఈ దాడి నేపథ్యంలో దాయాది పాకిస్థాన్ తో సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోన్న విషయం తెలిసిందే. అయితే పాకిస్థాన్ నటీనటులు మన సినిమాల్లో నటించడానికి వీల్లేదంటూ నెట్టింట పోస్ట్ లు షేర్ అవుతున్నాయి. దీంతో ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో హీరోయిన్ ఇమాన్వీ ఎస్మాయిల్ ఒక్కసారిగా హాట్ టాపిక్ గా మారారు. ఆమె పాకిస్థానీ అంటూ.. ఆమెను తీసుకోవద్దంటూ పోస్ట్ లు షేర్ అవుతున్నాయి. ఈ విషయంపై ఇమాన్వీ క్లారిటీ ఇచ్చారు. తాను పాకిస్థానీ నటిని కాదని స్పష్టంచేస్తూ పోస్ట్ పెట్టారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ''నాకు, నా కుటుంబానికి సంబంధించిన కొన్ని తప్పుడు వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. నేను పాకిస్థానీని కాదు. నాకు, నా కుటుంబంలోని ఎవరికీ ఆ దేశంతో సంబంధాలు లేవు. నాపై ద్వేషాన్ని కలిగించాలనే ఏకైక ఉద్దేశంతో ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారు. కొన్ని పేరున్న వార్తా సంస్థలు కూడా నా విషయంలో కనీస పరిశోధనలు చేయకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయి'' అని పేర్కొన్నారు. ''నేను భారత అమెరికన్ ని అని గర్వంగా చెబుతాను. హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లిష్ మాట్లాడగలను. లాస్ ఏంజెలెస్ లో పుట్టాను. నా తల్లిదండ్రులు అమెరికాకు వలసవెళ్లి.. అక్కడి పౌరులుగా మారారు. నేను చదివింది కూడా అక్కడే. చదువు పూర్తయిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్ గా, డ్యాన్సర్ గా కెరీర్ ను ప్రారంభించాను. ఈ రంగంలో ఎంతోకాలం కొనసాగిన తర్వాత భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పనిచేసే అవకాశాలను అందుకున్నాను. ఈ విషయంలో ఎంతో ఆనందంగా ఉన్నాను. సినిమా నా జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉంది. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి'' అని తన పోస్ట్ లో రాసుకొచ్చారు. ఉగ్రదాడి ఘటన దారుణమని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. తన డ్యాన్స్, స్టైల్ తో సోషల్ మీడియాలో ఎంతోమంది ఫాలోవర్స్ ను సొంతం చేసుకున్నారు ఇమాన్వీ. దీంతో ప్రభాస్- హను రాఘవపూడి కాంబోలో రానున్న సినిమాలో అవకాశాన్ని అందుకున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమంలోనూ ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.